సోమవారం
12•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 246
• పేజీలు : 16 + (24/20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

రష్యాలో కూలిన విమానం



మాస్కో సమీపంలోని ఓ గ్రామం వద్ద మంచులో పడిన ఏఎన్ 148 విమాన శకలం

71 మంది మృతి

టేకాఫ్ అయిన రెండు నిమిషాలకే కూలిన ఏఎన్-148

విమానంలో 65 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది .. భారీగా మంచు కురుస్తుండటంతో కనిపించని దారి

మాస్కో, ఫిబ్రవరి 11: రష్యాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. టేకాఫ్ అయిన రెండు నిమిషాలకే విమానం కుప్పకూలింది. ఏం జరిగిందో తెలియదు కానీ, గాల్లోనే మంటలు అంటుకుని కుప్పకూలిపోయింది. సెకన్ల వ్యవధిలో విమానం పూర్తిగా కాలిపోవడంతో దానిలో ఉన్న 71మంది ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. ఇంతటి విషాద ఘటనకు మాస్కో డుమోడెడ్వో విమానాశ్రయం సాక్షీభూతంగా నిలిచింది. విమానాయశ్రం నుంచి టేకాఫ్ అయిన రెండు నిమిషాలకే విమానం జాడ రాడార్ నుంచి అదృశ్యమైంది. సరటోవ్ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తున్న ఏఎన్-148 రకం విమానం మాస్కో సమీపంలోని అర్గునోవ్ గ్రామం సమీపంలో కూలిపోయింది. మృతిచెందిన వారిలో 65మంది ప్రయాణికులు

› మిగతా 5వ పేజీలో



కంచి చీరల కోసం ప్రత్యేక మగ్గాలు, ఆమనగల్లులో మగ్గాలు నేస్తున్న ధర్మవరం కార్మికులు

తీపి తెలుగు మాగాణం

తెలంగాణలో తెలుగు భాషాభివృద్ధికి వేగంగా చర్యలు..

ఒకటి నుంచి ఇంటర్ వరకు తెలుగు తప్పనిసరికి త్వరలో ఆర్డినెన్స్

- పాలనాభాషగా తెలుగు అమలుకు ప్రణాళికలు
- ఇంటింటికీ షడ్రుచుల తెలుగు వైభవం
- ఉగాదిరోజున కోటి పుస్తకాల పంపిణీ
- హైదరాబాద్‌లో తెలుగు భాషా విశిష్ట కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు
- ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శనంలో కార్యాచరణ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

స్వరాష్ట్రంలో తొలిసారి దిగ్విజయంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల స్ఫూర్తితో, తెలుగును బోధనాభాషగా చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శనంలో వేగంగా అడుగులు పడుతున్నాయి. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ స్థాయి వరకు రాష్ట్రంలోని అన్ని స్థాయిల్లోని విద్యాసంస్థల్లో తెలుగును తప్పనిసరిగా ఒక విషయంగా బోధించాలంటూ ఆర్డినెన్స్ సిద్ధమైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరలోనే దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం అనంతరం వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ విధానం అమల్లోకి రానున్నది. దీంతోపాటుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి నాయకత్వంలో పరిపాలనావ్యవస్థలో తెలుగు వినియోగానికి ప్రణాళికలు రూపొందుతున్నాయి. మరోవైపు తెలుగు భాష విశిష్టతను, తెలంగాణ సంస్కృతిని పరిచయం చేసే విధంగా ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక అధికారి దేశపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రచురించిన కోటి పుస్తకాలను రానున్న విళంబి ఉగాది పర్వదినాన రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ పంపిణీ చేయనున్నారు. తెలుగు భాషా విశిష్టకేంద్రాన్ని నెలకొల్పేందుకు కూడా సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్రమంతటా నామ ఫలకాలన్నీ తెలుగులోనే ఉండాలనే నిబంధనను సైతం కచ్చితంగా పాటించనున్నారు.

ప్రాథమిక స్థాయి నుంచి తెలుగు..

ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకు తెలుగును తప్పనిసరి చేసే అంశంపైన నిశిత అధ్యయనం జరిగింది. తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ సారథ్యంలోని ఉన్నతస్థాయి కమిటీ దీనిపై అనేక రాష్ట్రాలలో పర్యటించింది. అనేక దేశాలలో మాతృభాషలోనే బోధనలు జరుగుతున్న విషయాలను పరిశీలించింది. అభివృద్ధి చెందిన జపాన్, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా వంటి చాలా దేశాలలో మాతృభాషలోనే బోధన జరుగుతున్న విషయాలన్నింటినీ ప్రభుత్వం

› మిగతా 11వ పేజీలో

మళ్లీ మగ్గాల సందడి

ప్రభుత్వ ప్రోత్సాహంతో కొత్త కళ

తెలంగాణ పట్టు చీరలకు భారీ డిమాండ్.. చేనేత కార్మికులకు ఎదురొస్తున్న అవకాశాలు

పట్నంలో పనులు మాని మగ్గాలెక్కిన నేతన్నలు.. పనికోసం పొరుగు రాష్ట్రాల కార్మికుల రాక

సాంకేతిక నైపుణ్యం కలిగినవారికి ఉపాధి దన్ను.. నెలకు రూ.30 వేలకు పైగా సంపాదన

సరికొత్త కంచి చీరలకు అనూహ్య డిమాండ్.. రాజధాని శివార్లలో కార్ఖానాల ఏర్పాటుకు ప్లాన్

ఆమనగల్లు, హయత్‌నగర్‌లోనూ కొత్తమగ్గాలు

కొరవడిన ప్రోత్సాహం.. ముందుకొచ్చిన ఆధునికత ముప్పు.. చేసిన పనికి గిట్టుబాటు కూలీ దక్కని దుస్థితి! మగ్గాలు వదిలి.. పొట్టచేత పట్టుకుని పట్నానికి వలసలు! ఏటీఎంలోనో, అపార్ట్‌మెంట్లలోనో సెక్యూరిటీగార్డులుగా వెళ్లదీసిన బతుకులు! ఇది చేనేత రంగ దయనీయ గతం!! పెరుగుతున్న చేనేత ఉత్పత్తుల వినియోగం.. చేనేతను ప్రమోట్ చేయడంలో, ప్రోత్సహించడంలో మంత్రి కేటీఆర్ చొరవ! వెరసి.. వలసొచ్చిన పట్నంలోనే మగ్గాలు పెట్టుకుని, కొత్త జీవితంలో ఆధునాతన డిజైన్లను తీర్చిదిద్దుతున్న కళాకౌశలం! ఇది తెలంగాణ రాష్ట్రావతరణ అనంతర ఆశావహ వాతావరణం!

› వివరాలు 12వ పేజీలో



మౌలానా సల్మాన్ హుస్సేనీ నద్వీ

మౌలానా నద్వీ బహిష్కరణ

ముస్లిం పర్సనల్ లా బోర్డు సంచలన నిర్ణయం

- బాబ్రీపై రవిశంకర్‌తో చర్చలు జరిపినందుకు వేటు
- మసీదు అస్తిత్వాన్ని ఎవరూ మార్చలేరు
- ట్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభలో విపక్షాలు అడ్డుకోవాలి
- షరియా రక్షణకు చర్యలు తీసుకొంటాం
- హైదరాబాద్ డిక్లరేషన్‌లో పలు తీర్మానాలు

12

తెలంగాణ మీసేవాకు ఈ గవర్నెన్స్ అవార్డు

3

జమ్మూలో ఉగ్రవేట

ముగ్గురు జైషే ఉగ్రవాదుల్ని మట్టుబెట్టిన సైన్యం

ముష్కరుల కాల్పుల్లో ఐదుగురు సైనికులు, పౌరుడు మృతి

మరో 11మందికి తీవ్రగాయాలు



5

హైదరాబాద్‌లో రియల్ డిమాండ్

4 శాతం పెరిగిన అద్దెలు.. ఇతర మెట్రో నగరాలతో పోల్చితే భాగ్యనగరమే ఆకర్షణీయం

99 ఏకర్స్‌డాట్‌కామ్ అధ్యయనంలో వెల్లడి

మెట్రో రైల్ ప్రాజెక్టుతో మియాపూర్-నాగోల్ రియల్టీ మార్కెట్‌లో జోష్

13



మురిసిన మునుగోడు



ఆదివారం నల్లగొండ జిల్లాలో బట్లపల్లి వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద కృష్ణాజలాలకు పూజలు చేస్తున్న అధికారులు, స్థానికులు

ఫ్లోరోసిస్ కష్టాలు తీర్చగ..

తరలివచ్చిన కృష్ణమ్మ

మిషన్ భగీరథలో తొలిసారి మునుగోడుకు కృష్ణానీళ్లు

కోదండాపురం నుంచి బట్లపల్లి ప్లాంట్‌కు ట్రయల్‌రన్ సక్సెస్

ప్లాంట్ నుంచి 535 గ్రామాలకు తాగునీటి సరఫరా

చండూరు : తాగునీరే తమ పాలిటశాపమై బొక్కలు వంగి.. జీవచ్ఛవాలుగా మారినవారు తమవద్దకు తరలివచ్చిన కృష్ణమ్మను చూసి మురిసిపోయారు. తెలంగాణ ప్రభుత్వ చొరవతో కృష్ణాజలాలు తమ చెంత చేరడంతో ఇక తమకు తాగునీటి కష్టాలు తీరినట్టేనని, ఫ్లోరోసిస్ పీడ విరగడైనట్టేనని సంబరపడిపోయారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తికీ ప్రతిరోజూ 100 లీటర్ల రక్షితనీటిని అందించాలనే అద్భుత సంకల్పంతో మిషన్ భగీరథ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఫ్లోరోసిస్ బాధిత నల్లగొండ జిల్లాలోని చౌటుప్పల్‌లో అంకురార్పణచేశారు. ఆ సంకల్పం కార్యరూపందాల్చి మునుగోడు నియోజకవర్గానికి

› మిగతా 2వ పేజీలో

పగటి కలల కాంగ్రెస్!

ఖమ్మం ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

ఉద్యమ నేత, సీఎం కేసీఆర్ వల్లే రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తున్నదని రాష్ట్ర భారీ నీటిపారుదల, మార్కెటింగ్‌శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. జాతీయ పార్టీలను నమ్మితే ఢిల్లీలో బానిసలమవుతామని, గత పాలకులు రాష్ట్రాభివృద్ధికి ఏం చేశారో పరిశీలించాలని అన్నారు. రూ.23 కోట్ల వ్యయంతో ఖమ్మం నగరంలో ఆధునీకరించిన లకారం చెరువు, ట్యాంక్‌బండ్‌ను ఆదివారం సాయంత్రం రోడ్లు, భవనాలు, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'రాష్ట్రాన్ని కాంగ్రెస్ పాలించిన రోజులను గమనిస్తే చెన్నారెడ్డి, నేదురుమల్లి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డిలు వెంటవెంటనే ఏ విధంగా పదవులు పంచుకున్నారో చూశాం. ఆ తర్వాత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనంతరం రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి రాష్ట్రాన్ని ఎలా చేశారో గమనించాం. ప్రాంతీయ పార్టీల ద్వారానే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి' అని చెప్పారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం టీఆర్‌ఎస్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నదని, దీన్ని చూసి ఓర్వలేని కాంగ్రెస్ నాయకులు గాంధీభవన్‌లో కూర్చొని రాబోయే ఎన్నికల్లో వందసీట్లు గెలుస్తామని ప్రకటనలు చేయడం పగటి కలలు కంటున్న తీరుకు నిదర్శనమని హరీశ్ ఎద్దేవాచేశారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ అధికారంలో ఉన్నకాలంలో రాజీవ్, ఇందిరాసాగర్లకు ఎందుకు అనుమతులు తీసుకురాలేదని ప్రశ్నించారు. గోదావరి జిల్లాలు పండింది ఎట్ల? ఖమ్మం ఎండింది ఎట్లనో కాంగ్రెస్ నాయకులు

› మిగతా 2వ పేజీలో



ఖమ్మం నగరంలో లకారం చెరువులో బోటింగ్ చేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల, ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే అజయ్‌కుమార్ తదితరులు

- జాతీయ పార్టీలను నమ్మితే ఢిల్లీలో బానిసలమవుతాం
- ప్రాంతీయ పార్టీలతోనే అభివృద్ధి సాధ్యం
- గోదావరి జిల్లాలు పండింది ఎట్ల..? ఖమ్మం ఎండింది ఎట్లనో కాంగ్రెస్ చెప్పాలి
- రెండేండ్లలో సీతారామ ద్వారా గోదావరి నీళ్లను పారిస్తాం
- ఖమ్మంలో లకారం చెరువు, ట్యాంక్‌బండ్ ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

ప్రశంసలే కాదు.. నిధులు కూడా ఇవ్వాలి

- 15వ ఆర్థికసంఘం రాష్ట్ర పర్యటనపై మంత్రి కేటీఆర్ స్పందన
- పనిచేసే ప్రభుత్వానికి ఆర్థికసాయం చేయాలని సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం తెలంగాణ సర్కారు చేపట్టిన పథకాలను ప్రశంసించడంతోపాటు వాటికి తగినన్ని నిధులు కూడా ఇవ్వాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, ఎన్నారై వ్యవహారాలశాఖ మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, మిషన్ భగీరథను 15వ ఆర్థికసంఘం బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రశంసించిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనపై మంత్రి కేటీఆర్ స్పందించారు. కేంద్రబృందం పథకాలను అభినందించడం మంచిదేనని, అలా అభినందించినవారు నిధులను మాత్రం మంజూరు చేయడంలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. పనిచేసే ప్రభుత్వానికి ఆర్థికసహాయం చేయాలని.. కేవలం ప్రశంసలు కురిపిస్తే సరిపోదని మంత్రి కేటీఆర్ ఆదివారం ఓ ట్వీట్‌లో స్పష్టంచేశారు.



పనిచేసే ప్రభుత్వానికి ఆర్థికసాయం చేయాలని మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్

ఆ కుటుంబానికి అండగా ఉంటా..

సౌదీఅరేబియాలో మృతిచెందిన కరీంనగర్ వాసి కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. ఓ నెటిజన్ చేసిన ట్వీట్‌కు మంత్రి స్పందించారు. తన కార్యాలయ సిబ్బందిని సహాయం చేయాలని సూచించారు. బాధిత కుటుంబసభ్యులతో మంత్రి కార్యాలయ సిబ్బంది మాట్లాడారు.





రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తేతెలంగాణ: మహా శివరాత్రి వేడుకలకు వేములవాడ రాజన్న ఆలయం ముస్తాబైంది. సోమవారం నుంచి 14వ తేదీ వరకు జరిగే జాతరకు అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం వసతి గృహాలతోపాటు గుడిచెరువు, వివిధ ప్రాంతాల్లో రూ.1.02 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. జాతరకు 4 లక్షల మంది భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు పటిష్ఠ భద్రత కల్పించేందుకు పోలీసులు 220 సీసీ కెమెరాలతో పట్టణంలో నిఘా ఉంచారు. భక్తుల కోసం 1.90 లక్షల చదరపు అడుగుల చలువ పందిళ్లు, 30 వేల చదరపు అడుగులతో ప్రత్యేక కలకత్తా చలువ పందిళ్లు, రూ.4లక్షలతో 12 చోట్ల పార్కింగ్ స్థలాలు, రూ.20 లక్షలతో విద్యుత్ దీపాలంకరణ చేశారు. తాగునీటి వసతి కోసం వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు. రూ.3.50 లక్షలతో 170 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. వేములవాడ శివారులో తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేశారు. రాజన్న క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం మూడు రోజులపాటు శివార్చన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

పట్టు వస్త్రాలు సమర్పించనున్న దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి ఈనెల 13న ఉదయం 8 గంటలకు దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. అదేరోజు టీటీడీ నుంచి వచ్చే పట్టువస్త్రాలు రాజన్నకు సమర్పిస్తారు.

జాతర యాప్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

వేములవాడ కల్చరల్: రాజన్న ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రూపొందించిన మొబైల్ యాప్‌ను ఆదివారం కలెక్టర్ కృష్ణభాస్కర్ ఆవిష్కరించారు. 360 డిగ్రీ వ్యూతో తీసిన దేవాలయ చిత్రాలను ఇందులో ఉంచారు. జాతర సందర్భంగా గుడి చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న శివార్చన కార్యక్రమాన్ని దీని ద్వారా భక్తులు వీక్షించవచ్చునని తెలిపారు.

కాళేశ్వరం ఓ అద్భుత కట్టడం

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి

నిర్మాణంలో ఇంజినీర్ల శ్రమ గుర్తించదగినది - ఒక్కో ఎకరం తడుస్తుంటే అభివృద్ధిలో ఒక్కో మెట్టు ఎక్కినట్టే

విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్ల బృందంతో కలిసి రెండోరోజు ప్రాజెక్టుల పరిశీలన

పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే ఒక అద్భుత కట్టడంగా మిగిలిపోతుందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి ఒక్కో ఎకరం తడుస్తుంటే తెలంగాణ అభివృద్ధిలో ఒక్కో మెట్టు ఎక్కినట్టేనని పేర్కొన్నారు. న్యాయమైన నీటి వాటాను సాధించుకొనేందుకే కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వం నిర్మిస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలోని ఐదు ప్రధాన విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్ల బృందంతో కలిసి ఘంటా చక్రపాణి.. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా రెండోరోజు ఆదివారం పెద్దపల్లి జిల్లాలో పర్యటించారు. మంథని మండలం సిరిపురంలో నిర్మిస్తున్న సుందిళ్ల బరాజ్ పనులు, కాశిపేటలో అన్నారం పంప్‌హౌజ్ పనులను పరిశీలించారు. అంతర్గాం మండలంలోని గోలివాడలో నిర్మిస్తున్న సుందిళ్ల పంప్‌హౌజ్, ఎల్లంపల్లి ప్రాజెక్టుతోపాటు ధర్మారం మండలంలోని నందిమేడారంలోని కాళేశ్వరం 6వ ప్యాకేజీ పనులను పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. అనంతరం గోలివాడ పంప్‌హౌజ్ వద్ద టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం ప్రధానంగా నీళ్ల కోసం జరిగిందని, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత నీళ్లను ప్రాధాన్య అంశంగా తీసుకొన్న ప్రభుత్వం ప్రాజెక్టుల రీడిజైనింగ్ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. ప్రాజెక్టుతో తెలంగాణ అభివృద్ధి ఎలా ఉండబోతుందో తెలుసుకొనేందుకే ప్రొఫెసర్ల బృందంతో కలిసి ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వచ్చినట్టు తెలిపారు. పర్యటనలో నిర్మాణ పనులను చూసి ఆశ్చర్యానికి గురైనట్టు చక్రపాణి చెప్పారు. ఉద్యమం సమయంలో తెలంగాణ పునర్నిర్మాణం అంటే తెలంగాణలో ఉన్న నిర్మాణాలను తొలిగించి కొత్త నిర్మాణాలు చేస్తారా? అని ఎద్దేవా చేశారని, కానీ సీఎం కేసీఆర్ చేపడుతున్న ప్రాజెక్టుల నిర్మాణం చూసిన తరువాత భావి తెలంగాణ నిర్మాణానికి పునాదులు పడుతున్నాయని అనిపించిందని పేర్కొన్నారు. నాడు తెలంగాణ కోసం ఉద్యమించిన యువ ఇంజినీర్లు ఇప్పుడు ప్రాజెక్టు నిర్మాణ ప్రదేశాల్లో రాత్రింబవళ్లు పనిచేస్తున్నారని, ఇంజినీర్లతోపాటు కూలీల శ్రమ గుర్తించతగ్గదని అభినందించారు. సమావేశంలో ఆయన వెంట సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాఘవరెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ స్పెషలిస్టు సాయిలు, హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ డీ నిశాంత్ , ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ లింబాద్రి, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చెన్న బసవయ్య, మల్లేశ్, లక్ష్మీనారాయణ, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌తోపాటు మరికొందరు ప్రొఫెసర్లు ఉన్నారు.



ఆదివారం మంథని మండలం సిరిపురంలో సుందిళ్ల బరాజ్ పనులను పరిశీలిస్తున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, ప్రొఫెసర్ల బృందం

ఫ్లోరోసిస్ కష్టాలు తీర్చగ..
తరలివచ్చిన కృష్ణమ్మ

మొదటిపేజీ తరువాయి...

ఆదివారం కృష్ణాజలాలు చేరుకున్నాయి. నల్లగొండ జిల్లాలోని పెద్దఅడిశర్లపల్లి మండలం కోదండాపురం వద్ద నుంచి శనివారం సాయంత్రం అధికారులు నీటిపంపింగ్‌ను ప్రారంభించారు. అక్కడినుంచి 39 కిలోమీటర్ల దూరంలోని నాంపల్లి మండలం ఎస్ లింగోటం శివారులో ఉన్న బట్లపల్లి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు చేరడానికి 24 గంటల సమయం పట్టింది. సరిగ్గా ఆదివారం సాయంత్రం 5.15గంటలకు కృష్ణానీళ్లు బట్లపల్లి వాటర్‌ప్లాంట్‌కు చేరుకున్నాయి. దీంతో ఇంతకాలం గుక్కెడు మంచినీరు కరువై విలవిలలాడిన నాంపల్లి, మర్రిగూడెం మండలాల ప్రజలు సంబరాలు చేసుకున్నారు. తొలిసారిగా తమవద్దకు చేరిన కృష్ణమ్మ పరవళ్లు చూసి ఆనందంతో పొంగిపోయారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఫొటోలు దిగారు. 70 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మించిన బట్లపల్లి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్ల్యూటీపీ) నుంచి ఫ్లోరోసిస్ పీడిత ప్రాంతాలైన ఆరు మండలాల్లోని 585 గ్రామాలకు మంచినీరు సరఫరా కానుంది. ఈ ప్లాంట్‌లో ప్రతిరోజూ 7 కోట్ల లీటర్ల నీటిశుద్ధీకరణ జరుగుతుంది. మొదటినుంచి ఇక్కడ మిషన్ భగీరథ పనులకు రాష్ట్రం ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. రక్షిత మంచినీటిని అందించేందుకు మార్చి నెలను డెడ్‌లైన్‌గా నిర్ణయించింది. అయితే, ఇంజినీర్లు, అధికారులు గడువు కంటే ముందే పైప్‌లైన్ పనులతోపాటు, ట్రయల్‌రన్‌ను కూడా విజయవంతంగా పూర్తిచేశారు. మిషన్ భగీరథ పథకంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించి మొట్టమొదటి ట్రీట్‌మెంట్ ప్లాంటు ఇదే కావడం గమనార్హం. ట్రయల్‌రన్ కార్యక్రమంలో మిషన్ భగీరథ సీఈ విజయపాల్‌రెడ్డి, ఎస్‌ఈ యేసురత్నం, ఈఈ సంపత్‌రెడ్డి, డీఈ రవి, ఏఈలు ప్రవీణ్‌రెడ్డి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మరిన్ని పెట్రోలు బంకులు

- జైళ్ల శాఖ డీజీ వీకే సింగ్.. మూడువేల మందికి ఉపాధి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది చివరినాటికి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 100 పెట్రోల్ పంపులు ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ వీకే సింగ్ తెలిపారు. వీటి ద్వారా మూడువేల మందికి ఉపాధి కల్పించనున్నామని పేర్కొన్నారు. జైలు శిక్ష అనుభవించి విడుదలైన వారికి ఉపాధి కల్పించే లక్ష్యంతో జైళ్లశాఖ పలు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన ఆదివారం తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 13 పెట్రోల్ పంపులను జైళ్లశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పెట్రోల్ బంకుల్లో 150 మంది జైలు నుంచి విడుదలైనవారితోపాటు జైలుశిక్ష అనుభవిస్తున్న 200 మంది ఖైదీలు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నూతన ప్రెటోల్ బంకుల ఏర్పాటుకు అవసరమైన స్థలాల లీజ్ కోసం ప్రభుత్వ ఆయిల్ కంపెనీల ద్వారా బిడ్లు వేశామన్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న 80కి పైగా పెట్రోల్‌పంపుల్లో దాదాపు 25 నుంచి 30శాతం మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్ణయించినట్టు వీకే సింగ్ చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో అందుబాటులోకి తెచ్చిన పెట్రోల్ పంపుల ద్వారా 2016-17లో రూ.10 కోట్ల లాభాన్ని పొందామని, 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.15 కోట్లు లాభాలు వస్తాయని అంచనా వేస్తున్నట్టు పేర్కొన్నారు. 2021 బడ్జెట్‌లో జైళ్లశాఖకు కేటాయింపులే అవసరం లేకుండా సొంతనిధులతో నిర్వహించుకొనే అవకాశం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

48 బస్సుల్లో రెండువేల మంది రైతులు

హుస్నాబాద్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బరాజ్‌ల సందర్శన



జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారం బరాజ్‌ను పరిశీలిస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గ రైతులు

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ రైతులు కాళేశ్వరం ప్రాజెక్టును తిలకించి సంబురపడ్డారు. ఇంత పెద్ద ప్రాజెక్టును ఎక్కడా చూడలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ నేతృత్వంలో సుమారు రెండు వేల మంది రైతులు ఆదివారం కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును సందర్శించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలం మేడిగడ్డ, అన్నారం వద్ద నిర్మిస్తున్న బరాజ్‌లు, కన్నెపల్లి వద్ద నిర్మిస్తున్న పంప్‌హౌస్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి అబ్బురపడ్డారు. బరాజ్‌లు, పంప్‌హౌస్ పనుల వేగాన్ని చూసి ఆశ్చర్యపోయారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై మేడిగడ్డ, అన్నారం వద్ద బరాజ్‌లు, కన్నెపల్లి వద్ద పంప్‌హౌస్ నిర్మాణం జరుగుతుంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా పనులు జరుగుతున్న సాగునీటి ప్రాజెక్టుల్లో ఇది ఒకటి. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల నుంచి వివిధ జిల్లాల ఎమ్మెల్యేలు, తమ నియోజకవర్గ పరిధిలోని రైతులతో కలిసి మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లు, కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శిస్తున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు గురించి సాగునీటిశాఖ ఇంజినీర్ల ద్వారా తెలుసుకుంటున్నారు. ఇందులో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల నుంచి సుమారు రెండువేల మంది రైతులు మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లు, కన్నెపల్లి పంప్‌హౌస్‌కు వచ్చారు. ఈ రైతులకు ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ 48 బస్సులు, 35 కార్లు సమకూర్చారు. ఆయన రైతులతో కలిసి మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లు, కన్నెపల్లి పంప్‌హౌస్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ బరాజ్‌లు, పంప్‌హౌస్‌ల గురించి కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ఉపకార్యనిర్వహక ఇంజినీర్లు సూర్యప్రకాశ్, యాదగిరి, ప్రకాశ్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌తోపాటు రైతులకు వివరించారు. మేడిగడ్డ నుంచి కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా గోదావరి జలాలను అన్నారం బరాజ్‌కు తరలించనున్నట్టు ఇంజినీర్లు చెప్పారు. ఎత్తిపోతల కోసం కన్నెపల్లి నుంచి అన్నారం బరాజ్ వరకు 13.2 కిలోమీటర్ల పొడవునా అడవిలో గ్రావిటీ కెనాల్ నిర్మిస్తున్నట్టు తెలిపారు. మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లో ఎంత నీరు నిల్వ ఉంటుంది, కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా రోజూ ఎన్ని టీఎంసీల నీటిని గోదావరి నుంచి ఎత్తిపోయవచ్చు అనే వివరాలను ఇంజినీర్లు రైతులకు తెలియజేశారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ... కాళేశ్వరం గొప్ప ఎత్తిపోతల ప్రాజెక్టుగా అభివర్ణించారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.48 గంటలకు



సూర్యాస్తమయం: 6.13 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం ద్వాదశి రాత్రి 8.07 వరకు తదుపరి త్రయోదశి, నక్షత్రం: పూర్వాషాఢ, అమృతఘడియలు: రాత్రి 8.40 నుంచి 10.16 వరకు, రాహుకాలం: ఉదయం 8.13 నుంచి 9.39 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.07 నుంచి 12.53 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.10 నుంచి 3.56 వరకు, వర్జ్యం: ఉదయం 8.01 నుంచి 9.37 వరకు.

లోకం పోకడ



రైల్వేసిబ్బందికి విజ్ఞప్తి.. మిమ్మల్ని ఇంటికి పంపించేరైలు ప్లాట్‌ఫాంపైకి వచ్చియున్నది.. లగేజీలతో వచ్చేయగలరు!



ఖమ్మం నగరంలో ట్యాంక్‌బండ్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు. చిత్రంలో ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి కూడా ఉన్నారు



ఖమ్మంలోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటుచేసిన బహిరంగసభలో పాల్గొన్న జనం

పగటి కలల కాంగ్రెస్!

మొదటిపేజీ తరువాయి...

సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'రాజీవ్, ఇందిరాసాగర్‌కు రీ డిజైన్ చేసి సీతారామ ప్రాజెక్టుకు సీఎం కేసీఆర్ ప్రాణం పోశారు. గోదావరి నీళ్లతో ఖమ్మం జిల్లా సస్యశ్యామలమవుతుంది. ఉమ్మడి ఖమ్మంలో నిర్మిస్తున్న సీతారామ ద్వారా రెండేండ్లలో 10 లక్షల ఎకరాలకు గోదావరి జలాలను పారిస్తాం. ఇప్పటికే మొదటి ఫేజ్ అటవీ అనుమతులు పొందాం. వారంరోజుల్లో రూ.300 కోట్లు చెల్లించి రెండో ఫేజ్ అనుమతులు కూడా పొందుతాం. గోదావరిపై నిర్మించే కాళేశ్వరం ద్వారా రాష్ట్రం సస్యశ్యామలం అవుతుంది. ఖమ్మంలో నిర్మించిన లకారం ట్యాంక్ బండ్ అద్భుతంగా ఉన్నది. ఇక్కడ రహదారులు, డివైడర్లు, వంతెనలను బాగా నిర్మించారు ' అని మంత్రి హరీశ్ పేర్కొన్నారు. మంత్రి తుమ్మల, ఎంపీ పొంగులేటి, ఎమ్మెల్యే అజయ్ కృషితో ఖమ్మం అభివృద్ధి గుమ్మంగా మారుతున్నదని చెప్పారు. వారంరోజుల్లో రఘునాథపాలెం మండలం, కామేపల్లి, సింగరేణి మండలాల్లోని 35 వేల ఎకరాలకు బుగ్గ వాగు ద్వారా నీళ్లు అందించేందుకు రూ.37 కోట్లను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఖమ్మాన్ని పరిపాలించిన సీపీఎం, కాంగ్రెస్ హయాంలో లకారం మురికికూపంగా ఉండేదని, దాన్ని అద్భుతంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. 'మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, డబుల్‌బెడ్రూం ఇండ్ల పథకంలో ఉమ్మడి ఖమ్మం మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. రానున్న రోజుల్లో హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్‌ను తలదన్నేలా ఖమ్మం ఔటర్ రింగ్‌రోడ్‌ను నిర్మించబోతున్నాం. మంత్రి కేటీఆర్ సహకారంతో ఖమ్మంలో ఐటీ పార్క్ వచ్చింది. మంత్రి తుమ్మల కృషితో 400 ఎకరాల్లో ఫారెస్ట్ పార్కు నిర్మితమవుతున్నది. ఇక్కడ అభివృద్ధి చూసిన ప్రతిసారీ నేను సెల్ఫీ తీసుకుంటాను' అని హరీశ్ చెప్పారు. జిల్లా కలెక్టర్ ఖమ్మంలో ఐదెకరాల స్థలం కేటాయిస్తే వెంటనే ఫ్రూట్‌మార్కెట్‌కు నిధులు మంజూరు చేస్తామని, అడ్వెంచర్ పార్కు నిర్మించేందుకు నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూసి సిద్దిపేటలో అమలుచేసేందుకు అక్కడినుంచి ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులను తనతోపాటు తీసుకొచ్చానని హరీశ్ తెలిపారు. రాబోయేరోజుల్లో టీఆర్‌ఎస్‌ను ఆదరించాలని కోరారు. ఎమ్మెల్యే అజయ్ మంచి విజన్ ఉన్న నేత అని చెప్పారు. అనంతరం మంత్రి తుమ్మల, ఎంపీ పొంగులేటి, ఎమ్మెల్యే అజయ్‌తో కలిసి బ్యాటరీ కారులో ట్యాంక్‌బండ్ అందాలను వీక్షించారు. లకారం చెరువులో బోటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మండలిలో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, వైరా, ఇల్లెందు, అశ్వారావుపేట, పినపాక ఎమ్మెల్యేలు బానోత్ మదన్‌లాల్, కోరం కనకయ్య, తాటి వెంకటేశ్వర్లు, పాయం వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత, మేయర్ డాక్టర్ జీ పాపాలాల్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, తెలంగాణ రాష్ట్ర ఐడీఎస్ చైర్మన్ ఎస్బీ బేగ్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, కలెక్టర్ డీఎస్ లోకేశ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కేఎంసీ కమిషనర్ సందీప్‌కుమార్ ఝా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్జేసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలతో సస్యశ్యామలం చేస్తాం: హరీశ్‌రావు

కల్లూరు: గోదావరి జలాలతో ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సీఎం కేసీఆర్ సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. ఆదివారం కల్లూరు మండలం కోరుట్లగూడెంలో తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు యాచవరపు రంగారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి కాంస్య విగ్రహ ఆవిష్కరణ చేశారు. అనంతరం రూ.2.50 కోట్ల లిఫ్టు ఇరిగేషన్ పనులకు, 20 డబుల్ బెడ్రూం ఇండ్లకు మంత్రి తుమ్మలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు పనులను మరో రెండేండ్లలో పూర్తిచేసి గోదావరి జలాలతో ఖమ్మం జిల్లా ప్రజల కాళ్లు తడుపుతామని చెప్పారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. యాచవరపు రంగారెడ్డి తనకు రాజకీయాలు నేర్పిన గురువని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, పాయం వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్మన్ గడిపల్లి కవిత, డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కలెక్టర్ లోకేశ్‌కుమార్, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి తక్కెళ్ళపల్లి రవీంద్రకుమార్, ఆర్జేసీ కృష్ణ, దిండిగల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వానకాలం నాటికి
ఒక టీఎంసీ పంపింగ్

- కాలంతో పోటీపడుతున్న కాళేశ్వరం పనులు
- మోటర్లను పరీక్షించేందుకు ఫిన్‌లాండ్‌కు బయలుదేరిన అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర వ్యవసాయరంగానికి జీవనాడిగా మారనున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులు కాలంతో పోటీపడుతున్నాయి. ఈ వర్షాకాలానికి ఎట్టి పరిస్థితుల్లో గోదావరి జలాలను లిఫ్ట్ చేయాలనే సర్కారు సంకల్పానికి అనుగుణంగా పనులు జోరందుకున్నాయి. ఒకవైపు సివిల్ పనులను ముమ్మరంగా కొనసాగిస్తూనే.. మరోవైపు నీటిని తోడిపోసే పంపుహౌజ్, మోటర్ల బిగింపు పనులను వేగవంతం చేశారు. ఈ క్రమంలో వర్షాకాలానికి మేడిగడ్డ బరాజ్ నుంచి కన్నెపల్లి పంపుహౌజ్ ద్వారా ఐదుమోటర్లతో రోజుకు ఒక టీఎంసీ చొప్పున తరలించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అదేరీతిన అన్నారం, సుందిల్ల పంపుహౌజ్‌ల వద్ద నాలుగుమోటర్ల చొప్పున ఏర్పాటుచేసి గోదావరి జలాల్ని ఎల్లంపల్లికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సుందిల్ల పంపుహౌజ్‌లో ఏర్పాటుచేసే రెండు మోటర్లకు సంబంధించిన విడిభాగాలు ఇప్పటికే సైట్‌కు చేరినట్టు అధికారులు తెలిపారు. దీంతో మరో రెండుమోటర్లతో పాటు కన్నెపల్లి, అన్నారం పంపుహౌజ్ మోటర్ల విడిభాగాలను కూడా త్వరలో తరలిస్తామని స్పష్టంచేశారు. ఈ మేరకు ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డితోపాటు జెన్‌కో అధికారులు ఆదివారం రాత్రి ఫిన్‌లాండ్‌కు బయలుదేరారు. అక్కడ మోటర్లను పరిశీలించిన అనంతరం విడిభాగాలను ఇక్కడకు తరలించేందుకు ఏర్పాట్లుచేస్తారు. నౌకలో ఈ భాగాలు చెన్నై వచ్చేందుకు సుమారు 25 రోజులు, అక్కడ నుంచి కాళేశ్వరం సైట్‌కు చేరడానికి వారం రోజులు కలిపి మొత్తం నెలరోజులు పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో విడిభాగాలు సైట్‌కు చేరడానికి ముందే సివిల్ పనులను పూర్తి చేసుకుంటే జూలై నాటికి అనుకున్న రీతిలో మోటర్లు సిద్ధం అవుతాయని వారు చెప్తున్నారు. మరోవైపు ఎల్లంపల్లి-మిడ్‌మానేరు మార్గంలోని నంది మేడారం పంపుహౌజ్‌లో మొదటి మోటరు బిగింపు పనులు పూర్తి కావచ్చాయి. ఇదిలా ఉండగా, ఈ నెల 15 లేదా 16వ తేదీన రామడుగు పంప్‌హౌజ్‌లో రెండో మోటర్ డ్రైరన్‌కు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కాఫర్‌డ్యాం.. నీళ్లు పుష్కలం

- గోదావరిలో నీటి నిల్వకు చొరవచూపిన ప్రభుత్వం
- వేసవిలోనూ 'దేవాదుల' పంపింగ్
- ఎత్తిపోతలతో ధర్మసాగర్‌కు నీటి తరలింపు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వేసవిలో దేవాదుల ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను ధర్మసాగర్ రిజర్వాయర్‌కు తరలించాలనే పట్టుదలతో ప్రభుత్వం కొద్దినెలల క్రితం గోదావరి నదిలో, ప్రస్తుతం తుపాకులగూడెం వద్ద నిర్మిస్తున్న బరాజ్ వద్ద తాత్కాలికంగా కాఫర్‌డ్యాం నిర్మించింది. గంగారం ఇన్‌టెక్‌వెల్‌కు ఇది మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రాణహిత నుంచి గోదావరిలో కలుస్తున్న నీటిని కాఫర్ డ్యాం వద్ద నిల్వ చేస్తుండగా, ప్రస్తుతం కాఫర్ డ్యాం నుంచి 16 కిలోమీటర్ల వరకు నీరు నిలిచింది. గత నెల 30న భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు దేవాదుల ప్రాజెక్టు నుంచి పంపింగ్ ప్రారంభించగా, ఆ రోజు నుంచి నిత్యం 16క్యూసెక్కులు భూపాలపల్లి మండలం భీంఘణపురం రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తున్నది. ఇక్కడి నుంచి వరంగల్ రూరల్ జిల్లా పులుకుర్తి సంపుహౌస్ ద్వారా ధర్మసాగర్ రిజర్వాయర్ తరలుతున్నది. ఆదివారం దాకా ధర్మసాగర్‌కు 441ఎంసీఎఫ్‌టీల నీరు చేరింది. మార్చి నెలాఖరు వరకు దేవాదుల నుంచి పంపింగ్ కొనసాగే అవకాశమున్నదని అధికారులు భావిస్తున్నారు. గోదావరిలో ఉన్న ప్రవాహం ఇలాగే కొనసాగితే 60రోజులకుపైగా దేవాదుల నుంచి పంపింగ్ జరుగనుందని


జయశంకర్ భూపాలపల్లి జిల్లా తుపాకులగూడెం వద్ద తాత్కాలికంగా కాఫర్ డ్యాం నిర్మించడంతో గోదావరి నదిలో నిలిచిన నీరు

చెప్తున్నారు. దీంతో దేవాదుల ప్రాజెక్టు నుంచి యాసంగి పంట సాగు, వరంగల్ ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రయోగం విజయవంతమైంది. నవంబర్ తర్వాత, ఫిబ్రవరిలో దేవాదుల ప్రాజెక్టు నుంచి పంపింగ్ జరుగడం, గోదావరి నదిలో 16 కిలోమీటర్ల వరకు నీరు నిలిచి ఉండటం ఇదే తొలిసారి. యాసంగి పంటసాగు, వరంగల్ ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రయోగం విజయవంతం కాగా, ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోని చెరువులను కూడా దేవాదుల నీటితో నింపేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

తెలంగాణ మీసేవకు ఈ గవర్నెన్స్ అవార్డు

21వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ప్రదానం చేయనున్న కేంద్రప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పౌరసేవల్లో సాంకేతికతకు పెద్దపీట వేసి వినూత్న విధానాలతో ముందుకు సాగుతున్న తెలంగాణ ప్రభుత్వానికి మరో గుర్తింపు దక్కింది. తెలంగాణ మీసేవకు కేంద్రప్రభుత్వ ఈ గవర్నెన్స్ అవార్డు లభించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి, మీసేవ కమిషనర్ జీటీ వెంకటేశ్వరరావుకు సమాచారం అందించింది. 26-27 తేదీల్లో హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో జరుగనున్న 21వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రదానం చేయనున్నది. మీ సేవ 2.0కు సిల్వర్ అవార్డు క్యాటగిరీ-3 కింద 'ఇన్నోవేషన్స్ ఇన్ ఎగ్జిస్టింగ్ ప్రాజెక్ట్ ఆఫ్ గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్స్ ఆదర్ దేన్ పీఎస్‌యూ' అనే విభాగంలో అవార్డు దక్కింది.

అన్ని వర్గాలకు సమన్యాయం

పేద రెడ్డిల సమస్యలపై సీఎం కేసీఆర్‌తో చర్చిస్తా • వరంగల్ రెడ్డి సభలో హోంమంత్రి నాయిని

సుబేదారి(వరంగల్):

'అసత్యాలు చెప్పొద్దు.. అయ్యేదే చెప్పాలి.. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న రెడ్డి పేదల సమస్యలు పరిష్కరించడానికి కృషిచేస్తా'నని హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. తెలంగాణ రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ సుబేదారి ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానంలో కాకతీయ రెడ్డి శంఖారావం పేరిట నిర్వహించిన సభలో మంత్రి నర్సింహారెడ్డి మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వ పరిధిలో ఉన్న పేద రెడ్డి సమస్యలను సీఎం కేసీఆర్‌తో మాట్లాడి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి సమస్యలపై సానుకూలంగా ఉన్నదన్నారు. కల్యాణలక్ష్మి, ఆసరా పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు వర్తింపజేస్తున్నదన్నారు. 'వాస్తవాలు చెప్పుకోవాలి, మన ఇష్టం కాదు, ఆర్థిక పరమైన రిజర్వేషన్లు అనేది కేంద్రప్రభుత్వం పరిధిలో ఉంది. దానిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంది. మంద కృష్ణమాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఏండ్ల నుంచి పోరాటం చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి ఢిల్లీకి పంపించినా వర్గీకరణ కావడం లేదు. వాళ్లు పోరాటం చేస్తున్నారు. రాజ్యాంగ పరిధిలో ఉన్న హక్కులను సాధించుకుందాం' అని మంత్రి నాయిని పేర్కొన్నారు. సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. పేద రెడ్డి పిల్లల ఉన్నత విద్య అవకాశాలు కల్పించడంలో కానీ, రూ.వెయ్యి కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు విషయంలో సీఎం కేసీఆర్‌తో



హన్మకొండలో కాకతీయ రెడ్డి శంఖారావం సభలో మాట్లాడుతున్న మంత్రి నాయిని నర్సింహారెడ్డి. చిత్రంలో సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యాదగిరిరెడ్డి, ధర్మారెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

మాట్లాడి అమలు చేయడానికి తమవంతు కృషిచేస్తామన్నారు. సభలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, బీజేపీ నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి, రాంరెడ్డి, కాంగ్రెస్ నేత గండ్ర వెంకటరమణారెడ్డి, వివిధ జిల్లాలనుంచి రెడ్డి కులస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


ఆదివారం ఆదర్శనగర్‌లో గొల్ల, కురుమ కులస్థుల ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

గొల్ల, కురుమలు సత్తాచాటాలి

సీఎం కృతజ్ఞతాసభకు భారీసంఖ్యలో కదిలిరావాలి: మంత్రి తలసాని

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గొల్ల, కురుమల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఏప్రిల్ 29న జింఖాన మైదానంలో భారీ బహిరంగసభను నిర్వహించాలని నిర్ణయించినట్టు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. గొల్ల, కురుమల కృతజ్ఞత సభకు పెద్దసంఖ్యలో హాజరై తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేసి రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల నుంచి గొల్ల కురుమలు సభకు తరలివచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఆదివారం ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన గొల్ల, కురుమ కులస్థుల ముఖ్యనాయకుల సమావేశంలో మంత్రి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కురుమ నాయకులతో సమన్వయ కమిటీని త్వరలో ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు. సభకు జనసమీకరణలో భాగంగా ఏప్రిల్ మొదటివారంలో తాను జిల్లాల్లో పర్యటిస్తానని మంత్రి హామీనిచ్చారు. గొల్ల కురుమలకు రూ. 5 వేల కోట్లతో గొర్రెలను పంపిణీ చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సీఎం కేసీఆర్ గొల్ల, కురుమల అభివృద్ధికి హాస్టల్, సంక్షేమ భవనాల నిర్మాణాల కోసం కోకాపేటలో 10 ఎకరాల స్థలం, రూ.10 కోట్లు కేటాయించారని మంత్రి గుర్తుచేశారు. 31 జిల్లాల్లో గొల్ల, కురుమల భవనాల నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషిచేస్తానని హామీ నిచ్చారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశం, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బాబురావుయాదవ్, యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, నోముల నర్సింహయ్య యాదవ్, అరిగెల నాగేశ్వర్‌యాదవ్, నాయకులు తమగొండ రాజేశ్వర్‌రావు, చిన శ్రీశైలం, బడుగుల లింగయ్య యాదవ్, దేవర రాజేశ్వర్‌రావు, టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ ఈశ్వరీబాయి, తెలంగాణ యాదవ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చోళ ఓంప్రకాశ్‌యాదవ్, విద్యార్థి నాయకులు దూదిమెట్ల బాలరాజు యాదవ్, వినోద్ యాదవ్, వివిధ జిల్లాల గొల్ల కురుమ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

జీతం 73 లక్షలు.. ఆస్తులు 25 కోట్లు

- పురుషోత్తంరెడ్డిపై పక్కా నిఘాపెట్టిన ఏసీబీ
- ఆదాయానికి మించి ఆస్తులున్నాయని గుర్తించాకే దాడులు
- ముందేపసిగట్టి కుటుంబంతో సహా పరారైన జీహెచ్‌ఎంసీ అధికారి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చేస్తున్నది ప్రభుత్వ ఉద్యోగం.. పదేండ్ల జీతం లెక్కగట్టినా వచ్చింది రూ.కోటి లోపే.. కానీ అతడి ఆస్తులు మాత్రం మార్కెట్ విలువ ప్రకారం రూ.25 కోట్ల పైమాటే.. పక్కాలెక్కలతో ఏసీబీ అధికారులు ఆ అవినీతి అధికారిపై దాడులు చేశారు. ముందే విషయం పసిగట్టిన అతడు, అతడి బినామీలు ఇండ్లకు తాళాలు వేసి కుటుంబాలతో సహా పరారయ్యారు. పదిరోజులుగా ఏసీబీ అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా, ఎంతమందిని ప్రశ్నిస్తున్నా ఆచూకీ మాత్రం రాబట్టలేకపోతున్నారు. పురుషోత్తంరెడ్డి 1985లో మున్సిపల్‌శాఖలో చిరుద్యోగిగా చేరాడు. 2009లోనే ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు సోదాలు చేసి రూ.5కోట్ల అక్రమాస్తులు గుర్తించారు. 2012లో నాటి ప్రభుత్వం కేసును నిలిపివేయడంతో మళ్లీ విధుల్లో చేరిన అతడు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ స్థాయికి చేరుకున్నాడు. ఉద్యోగంలో ప్రమోషన్లు పొందుతూ తన ఆస్తులను కూడా అదేస్థాయిలో పెంచుకుంటూ పోయాడు. 2012లో తిరిగి విధుల్లో చేరడంతో వచ్చిన బెనిఫిట్స్‌తో కలిపి రెండోసారి కేసు నమోదయ్యేవరకు అతడికి జీతం ద్వారా రూ. 73 లక్షలు వచ్చినట్టు ఏసీబీ అధికారులు రికార్డులు సేకరించారు. జీతంతోపాటు అతడి ఖర్చులపై కూడా దృష్టిసారించారు. జీతంలో 30 శాతం (21 లక్షలు) కుటుంబ అవసరాలకు తీశారు. రూ.50 లక్షలు వెచ్చించి చిన్నకూతుర్ని విదేశాల్లో ఉన్నత విద్యను చదివిస్తున్నాడు. పెద్దకూతురు వివాహం గచ్చిబౌలిలోని ఎన్‌కన్వెన్షన్ సెంటర్‌లో చేశాడు. హాల్ అద్దె, భోజనాల ఖర్చుతోపాటు దాదాపు రూ. కోటికిపైగా ఖర్చుచేసి కూతురుకు డైమండ్స్ ఆభరణాలు ఇచ్చాడు. 2010 నుంచి వాహనాలు, కుటుంబ ఇతరత్రా అవసరాలు, రోజువారీ ఖర్చుల కోసం మరో 50 లక్షల వరకు ఖర్చు చేశాడని గుర్తించిన ఏసీబీ అధికారులు పక్కా సమాచారంతో ఈ నెల 2న దాడులకు సిద్ధమయ్యారు. దీనిని పసిగట్టిన పురుషోత్తంరెడ్డి, అతడి బావమరిది శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాలతో సహా పరారయ్యారు. అతడి కుటుంబానికి చెందిన 10 మందిని, మరో పదిమంది బంధువులను, 20మంది వరకు రియల్‌ఎస్టేట్ వ్యాపారులను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. పురుషోత్తంరెడ్డి ఆచూకీకి సంబంధించి కొంతసమాచారం రాబట్టామని వారు చెప్తున్నారు.

వారణాసి వెళ్తున్న రైల్లో అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ: ఢిల్లీ నుంచి వారణాసి వెళ్తున్న కాశీ విశ్వనాథ్ ఎక్స్‌ప్రెస్ రైలులో కూర్చొనే, సరుకులు నిల్వచేసే (ఎస్‌ఎల్‌ఆర్) బోగిలో ఆదివారం ప్రమాదం జరిగింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హపూర్ రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకోగానే బోగిలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఎవరికీ గాయాలు కాలేదు. మంటలను గుర్తించిన అధికారులు సిబ్బందితో వాటిని అదుపు చేయించారు. ఈ ఘటనపై అధికారులు విచారణకు ఆదేశించారు



నేటి గురించి తెలుసుకోవాలనుకుంటే
నిన్నటి గురించి అన్వేషించాలె.

పెరల్ ఎస్ బక్

గణప సముద్రం నవ్వింది

గుండెలో తడుంటే
బండైనా చెలిమైతది
స్పందించే మనసుంటే
సముద్రమైనా చనుపాలిస్తది!

ఎన్నేండ్లు దు:ఖాన్ని దుసిపోసుకున్నం
ఎన్ని సంక్రాంతులు మంట్ల గల్సినవి
ఎన్ని మల్కలు మమ్మల్ని
మేమే అమ్ముకున్నం!

బిడ్డలే గాదు
విత్తనాలూ గర్భస్రావాలైనవి
ర్యాలపూతల్లా రైతులు రాలిపోయి
నుదుర్లు నేలకు గుద్దుకొని
బొడబొడ రక్తం మడుగైతే
ఒక్క పావురమన్న
కన్నీటిబొట్టు రాల్చలే
ఏ దయామయుడి మనసు చెమ్మగిల్లలే!

నదులు ఉప్పొంగి
వాగుల నడుములిరిగి
జలప్రళయాల బీభత్సంతో చేసి
దేశమంతా జలమయమై
లక్షల క్యూసెక్కుల నీళ్లు
బురదపాల్జేసిన రాజకీయ చిత్రాలు
పచ్చి పాలసముద్రం లాంటి చెరువు
పగిలిన కుండయింది
నీటిబొట్టు లేక బోర్లిచ్చిన బండయ్యింది!

కరువులు కోలాటాలేసినవి
ఆకలిచావులు బొడ్డెమ్మలాడినవి
రుతుపవనాలు వాయుగుండాలు
వంకుడు దుంకుడు లాడినా
ఒక్క చినుకన్న చెరువు గొంతు తడుపలే!

ఎగిరిన పాల పిట్టలను
కరెంటు తీగలు చుట్టుముట్టినవి
పురుగు మందులు పెరుగుబువ్వలై
లొట్టపీసాకులు విందులై
వెన్నెముకలన్ని కాటిలో కుప్పయి
ఊర్లు కమురు కుంపట్లయినవి!

ముప్పై ఐదడుగుల ఎత్తు
మూడు కిలోమీటర్ల వైశాల్యం
కోటలు, గిరిదుర్గం, ఖిల్లాల నడుమ
ఇంద్ర ధనుస్సులా జలాశయం
రెండున్నరవేల ఆయకట్టు
ఒక్కసారి నిండితే
ముక్కారు పంట చేతిలున్నట్లే
కాకతీయుల స్వప్నం
గుండదండధీశుడి గుండెతడి
గణప సముద్రం

కాలాన్ని
పలుగు పార చేసి
రాత్రి పగలుని పనిలో ఒంపి
అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన
అపర భగీరథుడు!

చెరువు అలుగెల్లి
ముప్పైనాలుగేండ్లు దాటె



నీళ్ళను మల్ల కండ్ల చూస్తమనుకోలే
కృష్ణాజలాల నీళ్ళు గలగల భూపాలరాగమై
పడమరన పొద్దెక్కుతుంటే
సంతోషం అలుగుదుంకుతున్నది
నీళ్లు బీళ్లను ముద్దాడుతుంటే
పొలాలు పొన్న పువ్వులై నవ్వుతున్నవి

నది నీటిని మలుపడం
యుద్ధాన్ని గెలువడమే!

– వనపట్ల సుబ్బయ్య, 94927 65358

(మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఘనపురం బ్రాంచి కెనాల్ ద్వారా వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలోని గణప సముద్రం ముప్పై ఏండ్ల తర్వాత కృష్ణా జలాలతో నిండుతున్న సందర్భంగా...)

నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం, 12 ఫిబ్రవరి 2018

ప్రకృతే కవిత్వానికి ప్రేరణ

'Environmental Poetry or Ecopoetry is related to the broader genre of nature poetry. But can be distinguished from it by its portrayal of nature as threatened by human activities."

–The Princeton encyclopedia of Poetry and Poetics (2012)

ప్రపంచ భాషల్లో ఏ కవి అయినా ఐదు అంశాల మీద కవిత రాయకుండా ఉండలేడని పెద్దలు అంటారు. ఇంకా చెప్పాలంటే ఈ ఐదు అంశాలమీద తన జీవితకాలంలో కవిత రాయకపోతే అతను కవే కాడని కూడా అంటారు. ఆ ఐదు అంశాలు: 1) ప్రకృతి 2) పూలు 3) వెన్నెల 4) స్త్రీలు 5) బాల్యం.

భాషా నైసర్గిక భేదాలకతీతంగా, సంస్కృతీ ఖండాలకతీతంగా ప్రపంచవ్యాప్తంగా ఉండే కవులందరికీ ఈ ఐదు అంశాలు కవితా వస్తువులుగా ఉన్నాయనేది సాహితీ చరిత్రకారులు నిగ్గుతేల్చిన నిజం. అంటే ఇవి, కవిని కవిత రాయడానికి ప్రేరేపిస్తున్న నిత్య కవితా వస్తువులు, నిరంతర స్ఫూర్తి మంత్రాలు అని చెప్పాలి.

అయితే, ఈ అంశాలు కావ్య వస్తువులుగా, స్ఫూర్తి విశేషాలుగా మొదలైంది లిఖిత సాహిత్యం ఆరంభమైన తర్వాతే అనుకుంటే పొరపాటు. లిపి, లిఖిత భాష రూపొందడానికి పూర్వం నుంచే మౌఖిక సాహిత్యంలో శ్రుత సంప్రదాయంగా ఒక తరం నుంచి మరో తరానికి పాటల రూపంలో కథాగానాల రూపంలో కొనసాగిన సారస్వతంలో కూడా ఈ వస్తువులకు సంబంధించిన ప్రస్తావన, సాహిత్యం ఉండటం విశేషం. అందుకే సాహితీ విమర్శకులు, మేధావులు పై సూత్రీకరణ చేశారని అర్థమవుతున్నది.

ఈ పంచ కవితా వస్తువులలోనూ అనాదికాలం నుంచి మనిషి మేధోశక్తి, సృజనాత్మకతకు పదును పెట్టే సవాళ్ళను అందించింది ప్రకృతే! నిజానికి ఇతర నాలుగు కవితా వస్తువులు కూడా స్థూలంగా 'ప్రకృతి' అనే విస్తృత భావనలో అంతర్భాగమే అయినప్పటికీ, ఆయా అంశాలకు మానవుడు ఇచ్చిన ప్రత్యేకత, నిర్దిష్ట దృష్టికోణం వల్ల అవి ఆ ప్రత్యేకతని సాధించాయి.

యుగాల నుంచి మానవుడికి తొలి సహచరి ప్రకృతే. ఆ సాహచర్యం వల్లే ప్రకృతి గమనం, ప్రకృతి సూత్రాలే మానవ జీవితాన్ని నిర్దేశించే మార్గదర్శిగా నిలిచాయి. ప్రకృతిలో అవిభాజ్య అంశంగా మానవుడు ఉన్నప్పటికీ అనాది కాలం నుంచి నేటి అత్యాధునిక కాలందాకా ప్రకృతి, ఓ రహస్యం గానే, ఓ నిత్య సవాలుగానే, ఓ మార్మికత గానే, ఓ అద్భుతం గానే ఉంది. వేల ఏళ్ళ నుండి ప్రపంచ భాషలన్నిటా లక్షలాది కావ్యాలు, కవితలు, సాహిత్యం పుట్టుకు వచ్చినప్పటికీ, ప్రకృతి ఇప్పటికీ ఇంకా అన్వేషణకు అందని అంశంగానే ఉన్నది! ఎందుకంటే ఏకాలానికి ఆకాలం, ఏతరానికాతరం, ఏ జాతికాజాతి ప్రకృతిని తమదైన కోణంలో దర్శిస్తున్నది. అంతటి విస్తృత విశుద్ధ భావాన్ని, ఎవరికి వారే తనదైన ఆత్మగత అనుభవాన్ని నిరంతరం ఇస్తున్నది ప్రకృతే. అందుకే 'ప్రకృతి' నిత్య స్ఫూర్తిగా, అనునిత్య దీప్తిగా కవులకు కనిపించడంలో ఆశ్చర్యం లేదు.

యుగాల నుంచి మానవుడికి తొలి సహచరి ప్రకృతే. ఆ సాహచర్యం వల్లే ప్రకృతి గమనం, ప్రకృతి సూత్రాలే మానవ జీవితాన్ని నిర్దేశించే మార్గదర్శిగా నిలిచాయి. ప్రకృతిలో అవిభాజ్య అంశంగా మానవుడు ఉన్నప్పటికీ అనాది కాలం నుంచి నేటి అత్యాధునిక కాలందాకా ప్రకృతి, ఓ రహస్యం గానే, ఓ నిత్య సవాలుగానే, ఓ మార్మికత గానే, ఓ అద్భుతం గానే ఉంది.

ప్రకృతా? అనువంశికతా? అలాగే మానవశాస్త్ర పరిశోధనలను అనుసరించి చూస్తే, మనిషి మేధను, ప్రవర్తనను, గమనాన్ని ప్రభావితం చేసిన కారకాలు రెండు కనిపిస్తాయి. వాటిలో ఒకటి అనువంశికత అయితే రెండోది పరిసరాలు .అనువంశికత ఆయా జీవుల సాధారణ ధర్మాలను, లక్షణాలను తరతరాలకు కొనసాగించే వాహకంగా ఉంటే, పరిసరాలు మనిషి ఆలోచనను, ప్రవర్తనను, జ్ఞానాన్ని నిర్ధారించే కారకాలుగా ఉన్నాయి. ఇక మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు అయితే మరో అడుగు ముందుకువేసి,'పరిసరాలు' అనే మాటను మరో రెండు కోణాల్లో చూసినపుడు మాత్రమే మనిషిని అర్థం చేసుకోవడం సాధ్యం అవుతుందని చెప్పారు. అవే 1) భౌతిక పరిసరాలు 2) సామాజిక పరిసరాలు. భౌతిక పరిసరాలలో ప్రకృతికి సంబంధించిన నైసర్గిక పరిస్థితులు, శీతోష్ణస్థితి, రుతువులు వంటివి ఉండగా, సామాజిక పరిసరాలలో భాష, సంస్కృతి, సాహిత్యం, సంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లు, రాజ్యపాలనా విధానం, చట్టాలు, నియమాలు, కుటుంబ సంబంధాలు, సమాచార ప్రసార సాధనాలు వంటివి ఉంటాయి. ఇవన్నీ స్థూలంగా వ్యక్తి ప్రకృతి, సామాజిక ప్రకృతి, జాతి ప్రకృతిగా కూడా చెప్పవచ్చు.

ఇలా ప్రాకృతిక పరిసరాల వల్ల మనిషి, మనిషి వల్ల ప్రాకృతిక పరిసరాలు నిరంతరం పరస్పరం ప్రభావితం అవుతున్న క్రమంలో ఈ రెండింటి మధ్య అవినాభావ సంబంధం స్థానంలో సంఘర్షణ మొదలైంది. ఆ పరిణామక్రమరీతిని ఈ కింది/దశలుగా చెప్పవచ్చు.1.ప్రకృతికి పూర్తిగా దాసోహమైన దశ. 2.ప్రకృతి నియమాలను/ధర్మాలను / స్థితిని అర్థంచేసుకున్న దశ. 3.ప్రకృతి కాలాలకు అనుగుణంగా నడుచుకున్న దశ. 4.ప్రకృతిని తన సొంత వినియోగానికి వాడుకోవాలని అనుకున్న దశ. 5.ప్రకృతి వనరులను తన స్వార్థానికి, తనకు మాత్రమే సొత్తుగా తన ఆస్తిగా భావించిన దశ. 6.ప్రకృతిని తన అవసరాలకోసం, తన లక్ష్యాలను నిజం చేసుకోవడం కోసం వాడే క్రమంలో అవసరమైతే ప్రకృతిని, దాని ధర్మాలను విధ్వంసం చేసే దశ. 7.సహజ ప్రకృతికి నకలును, ఉన్నత రూపాలను 'హైబ్రీడ్' ద్వారా, టిష్యూకల్చర్, ఇతర శాస్త్రీయ విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞాన పరిశోధనల ద్వారా సృష్టించే దశ. 8.ప్రాకృతిక సంతులనం దెబ్బతిని విపరిణామాలు, విపత్తులు సంభవిస్తున్న ప్రస్తుత కాలంలో ప్రకృతిని పునఃస్థాపించే నిర్మాణదశ.

పై దశలలో జరిగిన, జరుగుతున్న అన్ని పరిణామాలను భావాల రూపంలో, అక్షరాల రూపంలో అందంగానూ, ఆగ్రహంగానూ, అనుగ్రహంగానూ, అన్యాపదేశంగానూ అభివ్యక్తి చేసిన సృజనాత్మక మార్గం సాహిత్యం.. కవిత్వం..

సాహిత్యంలో ప్రకృతి:

లిపిలేని మౌఖిక సాహిత్య కాలం నుంచి బహు భాషల సాహిత్యాల నేటి యుగం వరకు కవిత్వం, ప్రకృతికి మనిషికి మధ్య ఉన్న సంబంధ బాంధవ్యం గురించి అద్దం పట్టింది. ప్రపంచవ్యాప్తంగా ఆఫ్రికా, ఆసియా, అమెరికా, యూరప్ వంటి ఖండాల ఆవిర్భావనకు పూర్వం భూగోళంలోని ఖండ భాగం అంతా 'Pangea' అనే పేరుతో ఏకఖండంగా ఉన్నరోజుల అనాది జాతుల కాలం నుంచి, ప్రాచీన నాగరికతలు రూపొందిన కాలం దాకా ప్రకృతి మానవ సంబంధాలు ఏదో ఒక రూపంలో వ్యక్తీకరించబడ్డాయి. గ్రీక్ నాగరికత, సుమేరియా, మెసపొటేమియా, ఈజిప్ట్, సింధు, చైనా నాగరికతల కాలానికి ముందు ఆ తర్వాత కూడా ఆయా కాలాల్లో ప్రకృతి నియమాల అవగాహన ఉన్నదనే విషయం రుజువవుతున్నది.

ఇక సాహిత్యం విషయానికొస్తే.. గ్రీక్ ఇతిహాసాలైన ఇలియడ్, ఒడిస్సీలలోనూ, బైబిల్‌లోని జెనెసిస్ ఆది కాండములోనూ, చైనా కన్ఫ్యూషియస్ రచనలలోనూ, బౌద్ధంలోని త్రిపీటకాలు, జాతక కథలలోనూ, హైందవ వేదాలలోనూ ప్రకృతికి దాసోహమన్న మానవుడి ఊహాపోహలు, ప్రకృతితో సంఘర్షించిన తీరు కథలుగా, వీర గాథలుగా వివరణలు పొందాయి. మరొకడుగు ముందుకేసి ఈ గ్రంథాలు ప్రకృతి మూలాంశాలకు దైవాన్ని ఆపాదించి పూజలు ఆరంభించాయి. వేదాలైతే ప్రకృతిలోని మూలాంశాలైన పంచభూతాలను సముద్రుడు, వరుణుడు, వాయుదేవుడు, అగ్ని, భూదేవిగా దైవత్వాన్ని ఆపాదించగా, ఆయా ప్రాకృతిక అంశాలను అదుపులోపెట్టే దేవతలుగా ఇంద్రుడు, త్రిమూర్తులు వంటి దేవతల ఉనికిని గ్రంథస్థం చేయడం జరిగింది.

మరోవైపున, ఆదిమజాతుల ప్రాచీన తెగల ప్రజలు వనదేవతలుగా, ప్రకృతిని ఆరాధించడం, ప్రాకృతిక అంశాలకు 'మానుష ధర్మారోపణం' (Anthropomorphism) చేయడం జరిగింది. ఇదే స్థితి పౌరాణిక యుగంలో అన్ని ప్రాంతాలలో జరిగింది.

సాహిత్యం విషయానికొస్తే గుణాఢ్యుని బృహత్కథాకావ్యం, హాలుని గాథాసప్తశతి నుంచి మొదలుకొని తెలుగులోని మహాభారత, రామాయణ ఇతిహాస గ్రంథాలలో ప్రకృతి వర్ణన ఒక ప్రధానాంశంగా, అవి కవి కల్పనాశక్తికి, సృజనా దీప్తికి సూచికగా మారింది. ప్రబంధయుగంలోనైతే 'అష్టాదశ వర్ణనల'లో ప్రకృతి వర్ణన పరమోత్కృష్ట నైపుణ్యంగా అభివర్ణించబడింది.

గుణాఢ్యుని బృహత్కథాకావ్యం, హాలుని గాథాసప్తశతి నుంచి మొదలుకొని తెలుగులోని మహాభారత, రామాయణ ఇతిహాస గ్రంథాలలో ప్రకృతి వర్ణన ఒక ప్రధానాంశంగా, అవి కవి కల్పనాశక్తికి, సృజనా దీప్తికి సూచికగా మారింది. ప్రబంధయుగంలోనైతే 'అష్టాదశ వర్ణనల'లో ప్రకృతి వర్ణన పరమోత్కృష్ట నైపుణ్యంగా అభివర్ణించబడింది.

ఆ తర్వాతికాలపు రచనలలోనూ, ఆధునిక కాలపు వచనంలోనూ ప్రకృతి ఓ ప్రధాన వస్తువుగా ఉంటూ పైన చెప్పిన ఎనిమిది దశల పరిణామానికి అక్షరసాక్ష్యంగా కనిపిస్తుంది.

పర్యావరణ కవిత్వం అంటే..?

సాహిత్యంలో, కవిత్వంలో గతంలో కీర్తించబడినదంతా ప్రాకృతిక కవిత్వమే కానీ సాంతం పర్యావరణ కవిత్వంకాదు. అంటే All Nature poems. అయితే పర్యావరణ కవిత్వం (Ecopoetry) ఇటీవలికాలపు భావననే. దీనిలో ప్రకృతి కీర్తన, వర్ణన, ఆరాధనతోపాటు ఆ ప్రకృతిని విధ్వంసం నుంచి, వినాశనం నుంచి కాపాడాలనుకునే ఆకాంక్ష, అవగాహన భవిష్యత్ తరాల ప్రయోజనం అనే అంశాలు ఇమిడి ఉంటాయి. దీన్నే Forrest Gander తన "Red start: An Ecological Poetics" అనే పుస్తకంలో "Nat-ure Poetry-Where nature features as there-than is poetry that investigates, the relationship between nature and culture, language and perception" అని చెప్పాడు.

ఇదే విషయాన్ని మరింత స్పష్టంగా, John Shop-taw "Ecopoem is environmental is that, it is ecocentric, not anthropocentric. Human interests cannot be the be-all and end-all of an eco-poem" అని వివరించాడు.

ఇక Ursula K.Heise "Ecopoetry is related to the broader genre of nature poetry but can be distinguished from it by its portrayal of nature as threatened by human activities" అని మరొకడుగు ముందుకు వేసి వివరించారు. అంటే Nature poetry ప్రకృతిని సౌందర్యవంతంగా చూపిస్తూ Appreciate చేస్తే, Ecopoetry ప్రకృతి విధ్వంసానికి లోనవుతున్న తీరుని చెపుతూ Alert చేస్తుంది. ఇంకా చెప్పాలంటే Ecopoetryలో పర్యావరణ సమస్యలు, నష్టాలు, ప్రాకృతిక అసంతులనం అనేవి ప్రధానాంశాలు కావాలన్నమాట. ఉదాహరణకు, జాతులు అంతరించిపోవడం,Global warming,అడవుల నరికివేత, కాలుష్యం, ప్లాస్టిక్స్, యుద్ధాలు, అణుబాంబు విస్ఫోటనాలు మొదలగునవి.

ఇంతవరకూ బాగానే ఉంది. అయితే పర్యావరణ కవిత్వం లక్ష్యం కవితలద్వారా ప్రజలు పాఠకులలో అవగాహన కల్గించడమేనా? అనే ప్రశ్నకు అంతకు మించినదే ఉంది అని Jorie Graham చెప్తుంది. ఆమె "Sea Change","Plane" అనే రెండు పర్యావరణ కవితాపుస్తకాలను ప్రచురించింది. ఆమె ప్రకారం ''పర్యావరణ కవిత్వం అంటే ప్రకృతి వైపరీత్యాలను, పర్యావరణ విపత్తులను తెలియచేయడమేకాదు వాటిని ప్రజలు 'అనుభూతి' చెందేలా చేయడమే ప్రధానలక్ష్యం''. ఆమె మాటల్లో"The people know it. But they are not 'feeling' it. Eco-poetry has to 'help it be felt, help it be imagined".

–మామిడి హరికృష్ణ, 8008005231

ప్రకటనలు

యుద్ధకాలంలో స్వప్నాలు

(బాల్య జ్ఞాపకాలు)

ప్రసిద్ధ కెన్యా నవలా రచయిత గుగి వా థియాంగో రచించిన 'యుద్ధకాలంలో స్వప్నాలు' (గుగి బాల్యజ్ఞాపకాలు)నవల ఆవిష్కరణ సభ 2018 ఫిబ్రవరి 18, సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరుగుతుంది. ఎన్.వేణుగోపాల్ అధ్యక్షతన జరుగు సభలో వక్తలుగా కె.శ్రీనివాస్, ఎ.కె.ప్రభాకర్ హాజరవుతారు. ప్రొఫెసర్ సుజీతారు పుస్తకావిష్కరణ చేస్తారు. ముఖ్య అతిథిగా గుగి వా థియాంగో హాజరవుతారు. అనువాదం ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబ.

– 'మలుపు' ప్రచురణలు

గుడిపాటికి సాహితీ పురస్కారం

గుడిపాటికి ఈదురు సుబ్బయ్య సాహితీ పురస్కార ప్రదాన సభ 2018 ఫిబ్రవరి 11న సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభ, కళా లలిత కళావేదికలో జరుగుతుంది. రమణ వెలమకన్ని అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా నికిలేశ్వర్, కళాజనార్దనమూర్తి,ఏనుగు నర్సింహారెడ్డి, బైస దేవదాస్, ఈతకోట సుబ్బారావు, కొమ్మవరపు విల్సన్‌రావు, డాక్టర్ ఈదూరు సుధాకర్ హాజరవుతారు. స్వాగతం–జెల్ది విద్యాధరరావు, సమన్వయకర్త– పెద్దూరి వెంకటదాసు. పురస్కార స్వీకర్త గుడిపాటి స్పందన ఉంటుంది.

– విమల సాహితీ సమితి

'కలల దారుల్లో' ఆవిష్కరణ సభ

నలభైమంది కవుల కవితా సంకలనం 'కలల దారుల్లో' ఆవిష్కరణ సభ 2018 ఫిబ్రవరి 15, సాయంత్రం 6 గంటలకు, హైదరాబాద్, రవీంద్రభారతి మినీ హాల్‌లో జరుగుతుంది. నవీనాచారి సమావేశకర్తగా వ్యవహరించే సభలో అమ్మంగి వేణుగోపాల్, గుడిపాటి, కాంచనపల్లి, ఏనుగు నరసింహారెడ్డి, మామిడి హరికృష్ణ పాల్గొంటారు.

– డాక్టర్ కాంచనపల్లి
తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం కన్వీనర్

పఠాభి శతజయంతి సభ

భాషా సాంస్కృతిక శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ యానం, కవిసంధ్య సంయుక్త ఆధ్వర్యంలో పఠాభి శతజయంతి ఉత్సవం 2018 ఫిబ్రవరి 19న 'పఠాభిసాహిత్యం–ప్రాసంగిత'పై ఒకరోజు సాహిత్య సదస్సు జరుగుతుంది. డాక్టర్ అత్తలూరి నరసింహారావు, డాక్టర్ సీతారాం, అదృష్టదీపక్, వంశీకృష్ణ, డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీదేవి, డాక్టర్ జోతుల కృష్ణబాబు, దాట్ల దేవదానంరాజు, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి వివిధ అంశాలపై పత్రాలు సమర్పిస్తారు. డాక్టర్ శిఖామణి కీలక ప్రసంగం చేస్తారు. అతిథులుగా మల్లాడి కృష్ణారావు, జయరాజ్ డానియేల్, డి.సుబ్రమణ్యేశ్వరరావు హాజరవుతారు. సాయంత్రం 4 గంటలకు డి.సూర్యప్రకాశరావు చే 'హరిశ్చంద్ర కాటిసీను ఘట్టం' ప్రదర్శన ఉంటుంది.

– కవిసంధ్య, యానాం

కొలకలూరి సాహిత్య పురస్కారాలు-2018

కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారాలకు న్యాయనిర్ణేతలుగా ఆచార్య మధురాంతకం నరేంద్ర, ఆచార్య యన్.మునిరత్నమ్మ, డాక్టర్ వి.ఆర్.రాసాని వ్యవహరించారు. అంకం లింగమూర్తి 'అమ్మ–నాన్న' నాటికల సంపుటి ప్రథమ బహుమతికి, జీడిగుంట రామచంద్రమూర్తి 'మూడు నాటికలు' నాటికల సంపుటి ఎంపికయ్యాయి. కొలకలూరి భాగీరథి కవితా పురస్కారానికి న్యాయనిర్ణేతలుగా ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, ఆచార్య జి.దామోదరనాయుడు, ఆచార్య మేడిపల్లి రవికుమార్ వ్యవహరించారు. ఈతకోట సుబ్బారావు 'కాకిముద్ద' కవితా సంపుటి ప్రథమ బహుమతికి, అడిగోపుల వెంకటరత్నం 'ముందడుగు' కవితా సంపుటి ద్వితీయ బహుమతికి ఎంపికయ్యాయి. ఈ పురస్కారాలు ఫిబ్రవరి 26న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్, నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్టీఆర్ కళాప్రాంగణంలో ప్రదానం చేయటం జరుగుతుంది.

- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, 9441923172
- ఆచార్య కొలకలూరి సుమకిరణ్,9963564664

తెలంగాణ బడిపిల్లల కథలు-2018

పిల్లల్లోని సృజనకు అక్షర రూపం ఇచ్చేందుకు తెలంగాణలో 6నుంచి 10 తరగతులు చదువుతున్న విద్యార్థుల నుంచి కథలను ఆహ్వానిస్తున్నాం.సమకాలీన అంశాలపై (సమాజం, ప్రకృతి, వ్యవసాయం, కుటుంబం, బడి, చదువులు) విద్యార్థులు స్వయంగా కథలు రాసి 2018 ఏప్రిల్ 5వ తేదీలోపు పంపాలి. ఆ కథలను విద్యార్థులు చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధృవీకరణ పత్రాలు జతచేయాలి. రచనలు పంపాల్సిన చిరునామా–మంచి పుస్తకం, 12–13–439, వీధినెం–1, తార్నాక, సికింద్రాబాద్–017.

- డాక్టర్ యం.భూపాల్, 98662 04260, తెలంగాణ బాలసాహిత్య పరిషత్. డాక్టర్ వి.ఆర్. శర్మ, 90307 11910 పిల్లల లోకం. గరిపల్లి అశోక్,98496 49101, మారసం. పి.భాగ్యలక్ష్మి,9490746614, మంచిపుస్తకం

సామాన్యుని సాహసయాత్ర

మసక చీకటిలో
మనిషి అలజడి
ఆకలి వాకిట
అన్నపు సందడి
మంచుకొండల మధ్య
జలపాతాల రువ్వడి
రేపటి వెలుగుకై

ఉద్యమించే సవ్వడి
ఈ మనిషిని ఎవ్వరు ఆపలేరు
హెచ్చుతగ్గులు లేని
ఏక జాతికై శ్రమిస్తాడు

స్వార్థ సంకుచితాలు లేని
సంఘం కోసం పోరాడుతాడు
ఆకలి అరుపులు లేని
శ్రేయోరాజ్యం– అతని గమ్యం

భాషాద్వేషాలు లేని
భారతావని తన లక్ష్యం

– డాక్టర్ పద్మ ఎల్లప్ప
98493 71145



విదుషీమణులు-వీరవనితలు

తెలంగాణ సంస్థానాల్లో మహిళల పాత్ర-3


పాల్వంచ సంస్థానం: ఒకనాటి శంకరగిరియే నేటి పాల్వంచ. వరంగల్లు సుబాలో పాల్వంచ సంస్థానం ప్రసిద్ధమైనది. వరంగల్ జిల్లాకు ఆగ్నేయంగా, ప్రస్తుత ఖమ్మం జిల్లాకు ఉత్తరంగా ఉంది. ఈ సంస్థానాధీశులు అశ్వారావులు. ఈ సంస్థాన పాలకుల్లో మొదటిరాజు అన్నప్ప అశ్వారావు (1324). క్రీ.శ 1324నుంచి 1689, అలాగే 1769 నుంచి 1796 వరకు వివిధ దశల్లో ఈ సంస్థానాధీశులు సామంతులుగా పని చేసినట్లు తెలుస్తున్నది. ఈ సంస్థానాధీశుల్లో 19వ శతాబ్దికి చెందిన సీతారామచంద్రసపై అశ్వారావు మరణానంతరం అతని తల్లి లక్ష్మీ నరసయ్యమ్మారావు కొంతకాలం సంస్థాన పాలనను నిర్వహించింది. ఈమె దత్తపుత్రుడైన పార్థసారథి అప్పారావు పాల్వంచ సంస్థానాన్ని వైభవంగా పాలించాడు. ఈ సంస్థాన చివరి పాలకుడు విజయ అప్పారావు. పోలీసు చర్య తర్వాత పాల్వంచ సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

బోరవెల్లి సంస్థానం: ఈ సంస్థానాధీశులు పాకనాటిరెడ్లు. వీరిది మిడిమిళ్ళ గోత్రం. వీరి గృహనామం ముష్టిపల్లి. ఈ సంస్థాన మూలపురుషుడు నాడగౌడు తమ్మారెడ్డి.ఈ సంస్థాన పాలకుడైన చినసోమని భార్య గిరియమ్మ. ఈమె తన పాలనలో బోరవెల్లి సంస్థానాన్ని పండిత పామర జనరంజకంగా తీర్చిదిద్దింది. రాణి గిరియమ్మ కోరికపై 18వ శతాబ్ది పూర్వార్థానికి చెందిన లయగ్రాహి గరుడాచలకవి **'కౌసలేయచరిత్రం'** అనే ఐదాశ్వాసాల కావ్యాన్ని రాశాడు. ఈ కావ్యంలో గిరియమ్మ పుణ్యకార్యాలతో పాటు ఆమె తల్లి లింగమాంబ సత్కార్యాలను కూడా వర్ణించారు. ఈ సంస్థానాధీశురాలైన రాణి చొక్కమ్మ అనుమతితో రాజా రామారావు తర్వాతి కాలంలో బోరవెల్లి సంస్థానాన్ని గద్వాల సంస్థానంలో విలీనం చేశాడు.

సిర్నాపల్లి సంస్థానం: ఈ సంస్థానం నిజామాబాద్ జిల్లాలో ఉంది. ఈ సంస్థానం తెలంగాణకు తలమానికమైనది. నిజాం రాష్ట్ర సంస్థానాల్లో అభివృద్ధిలో ప్రముఖస్థానం పొందినది. సిర్నాపల్లి సంస్థానాన్ని సుమారు 400 ఏళ్ళు చీలం వంశస్థులు పాలించారు. ఈ సంస్థాన పాలకుల్లో చీలం జానకీబాయి సమర్థవంతమైన పాలకురాలిగా ప్రజాదరణ పొందారు.

బాన్సువాడ మండలం పిట్లం గ్రామానికి చెందిన లింగారెడ్డి కుమార్తె జానకీబాయి. ఈమెకు చిన్నతనంలోనే సిర్నాపల్లి సంస్థానాధిపతియైన రఘుపతిరెడ్డి, మంగమ్మల కుమారుడు ప్రతాపరెడ్డితో వివాహమైంది. పెళ్ళయిన మూడేళ్ళకే భర్త మరణించడంతో జానకీబాయి సంస్థాన పాలనా బాధ్యతను చేపట్టారు. జానకీబాయి తన వారసుడిగా సొంత సోదరుని కుమారుడైన రఘుపతిరెడ్డిని దత్తత తీసుకున్నారు. ఈ సంస్థానపరిధిలో సిర్నాపల్లి, ధర్పల్లి, భీంగల్, నిజామాబాద్, నవీపేట, యంచ, బాసర మొదలైన గ్రామాలుండేవి.

చీలం జానకీబాయి ప్రతినిత్యం సంస్థానాభివృద్ధికై కృషిచేసేది. రైతులకు జానకీబాయి పాలనాకాలాన్ని స్వర్ణయుగంగా చెప్పవచ్చు. నీటి పొదుపు, వినియోగం, అడవులరక్షణ, భవిష్యత్ తరాలపై అవగాహన తదితర అంశాలలో జానకీబాయి నేటికీ ఆదర్శం. కుంటలు, చెక్‌డ్యాంల వంటి నిర్మాణాలు చేపట్టారు. సాంకేతిక సౌకర్యాలు లేకపోయినా కార్యదీక్షతో విశేషమైన నిర్మాణాలు చేపట్టారు జానకీబాయి. అందుకే నేటికీ



సిర్నాపల్లి, నల్లవెల్లి, గౌరారం, ఎల్లారెడ్డిపల్లి, లోలం, రామడుగు, ఇందల్వాయి గ్రామాలకు ఆమె తవ్వించిన చెరువులే ఆధారమవుతున్నాయి. గొలుసుకట్టు చెరువుల నిర్మాణం, ఇందల్‌వాయి చెరువు, జానకమ్మ చెరువు వంటివి నాటి ఇంజినీరింగ్ ప్రతిభకు తార్కాణం. నిజామాబాద్ ప్రజలకు మంచిప్పా చెరువు నుంచి మంచి నీటి సరఫరా చేశారు.

మహారాష్ట్ర, మన్మాడ్ వరకు రైల్వేలైను ఏర్పాటు చేయడానికి నిజాం రాజు పంపించిన సర్వేయర్‌కు సహకరిస్తూనే ఈమె సిర్నాపల్లి రైతుల సాగుభూముల నుంచి కాకుండా రైల్వేమార్గాన్ని మార్పు చేయాలని సూచించి దానికవసరమయ్యే ఖర్చులను తానే భరించింది. ఈమె చేసిన సేవలకు గుర్తుగా అప్పటి నిజాంరాజు 'మహారాణి' బిరుదుతో సత్కరించారు. జానకంపేట్ గ్రామానికి, చెరువు, రైల్వే జంక్షన్‌కు ఈమె పేరు పెట్టడం విశేషం.

నిజామాబాద్‌లోని సిర్నాపల్లిగడి, పాతగంజ్‌లోని గడియారం, నవీపేటగడి వంటి నిర్మాణాలు చేయడమే కాకుండా జిల్లాలోని రఘునాథాలయం, రఘునాథ చెరువు, ఖిల్లా రామాలయం, ఇందల్‌వాయి రామాలయం, జాన్కంపేట లక్ష్మీనరసింహాలయాలను పునరుద్ధరణ చేశారు. జానకీబాయి గుర్రపుస్వారీ చేసేది. కరువు సమయాల్లో నిజాం దూతగా పన్ను వసూలు కోసం వచ్చి ప్రజల్ని ఇబ్బంది పెట్టే అధికారుల్ని బండికి కట్టేసిన ధీరవనితగా ప్రజల హృదయంలో స్థానం సంపాదించింది.

వీరి వారసులు ప్రస్తుతం సికింద్రాబాద్‌లో ఉన్నారు. జానకీబాయి మనుమడు రాజా శ్రీరాం భూపాల్ ఐఏఎస్ అధికారిగా పనిచేసి 2013లో మరణించారు. ఆయన కుమార్తె అనురాధారెడ్డి చరిత్ర పరిశోధకురాలిగా సేవలందిస్తూ, సంస్థాన కట్టడాల పరిరక్షణకు కృషిచేస్తున్నారు.

గోపాల్‌పేట సంస్థానం: మహబూబ్‌నగర్ మండలం వనపర్తికి సమీపాన ఉన్న చిన్న సంస్థానం. దీని ప్రభువులు జనుంపల్లి వారు. వనపర్తి వారిలో నుంచి చీలిన శాఖవారు ఈ రాజులు. వనపర్తి రాజులలో పూర్వుడైన బహిరీ గోపాలరావు పేరున నిర్మించడం చేత దీనికి ఈ పేరు వచ్చింది. ఈ సంస్థానంలో కవి పండిత పోషణ జరిగేది. ఈ సంస్థానపు రాణి రంగనాయకమ్మగారు. విద్వత్కవి పోషణలో ప్రసిద్ధి నొందారు. ఈమె తన దర్శనమునకు వచ్చిన శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి మొదలైన పండితుల్ని సత్కరించారు. రాణి తమ సంస్థానానికి చెందిన 'కౌసంపేట' తిరుణాలల్లో విద్వత్కవిగాయక సన్మానాలను నిర్వహించారు. ఈమె పాలనాకాలంలో ప్రాంతీయులైన కవిపండితులెందరో సంస్థానానికి వచ్చి గౌరవసత్కారాలు పొందేవారు.

వివిధ సంస్థానాలలో మహిళల పాత్రను పరిశీలించినపుడు తెలంగాణ మహిళలు అబలలు కాదు, సబలలు విదుషీమణులు, దానశీలురు, వీరవనితలు, త్యాగనిరతులు, కళాపిపాసులు, పరిపాలనాదక్షులు అని చెప్పడానికి ఈ సంస్థానాల చరిత్ర సాక్ష్యంగా నిలుస్తుంది. ఒకవైపు కుటుంబ బాధ్యతలు మరోవైపు సమాజ ఉన్నతికై, ప్రజాసంక్షేమానికై పరిశ్రమిస్తూ తమ వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వర్తించడంలో సంస్థానాధీశులైన మహిళల పాత్ర అద్వితీయమైనది. వీరనారీమణులు మాతృభూమి రక్షణ కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధపడతారనడానికి తెలంగాణ సంస్థాన మహిళల్లో రాణి శంకరమ్మ, పార్వతి, జానకీబాయి వంటి వారు తార్కాణంగా నిలుస్తారు. తెలంగాణ సంస్థానాలలో మహిళల పాత్ర గురించి మరింత లోతైన పరిశోధన సాగాలి.

- డాక్టర్ నమిలకొండ సునీత, 99084 68171

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

విదేశాల్లో ఎంబీబీఎస్‌కు..
'నీట్' క్లియర్ చేయాల్సిందే



కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదన

న్యూఢిల్లీ: విదేశీ యూనివర్సిటీల్లో ఎంబీబీఎస్ చదువాలనుకునేవారు తప్పనిసరి 'నీట్' రాయాలనే కొత్త ప్రతిపాదనను తేవాలని కేంద్రం యోచిస్తున్నది. దీంతో ప్రతిభావంతులే వైద్య విద్యనభ్యసించే వీలుంటుందని భావిస్తున్నది. ప్రస్తుతం జాతీయ అర్హత ప్రవేశ పరీక్షను (నీట్) రాసిన విద్యార్థులే దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో వైద్యవిద్య అభ్యసించే వీలున్నది. విదేశీ మెడిసిన్ చదివే వారిలో 12 నుంచి 15% మంది భారత వైద్య మండలి (ఎంసీఐ) నిర్వహించే లైసెన్స్ పరీక్ష 'ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ)'కు హాజరవుతున్నారని, వారిలో 12 నుంచి 15 శాతానికిపైగా గ్రాడ్యుయేట్లు ఎఫ్ఎంజీఈ పూర్తికి యత్నిస్తున్నారని కేంద్ర ఆరోగ్యశాఖ అధికారి తెలిపారు. ఒకవేళ ఆ పరీక్ష పాస్ కాకుంటే భారత్‌లో ప్రాక్టీస్‌కు రిజిస్ట్రేషన్ ఇవ్వరు. దీంతో వారు అక్రమంగా వైద్యసేవలు అందించడం ప్రమాదకరం. ప్రతిభావంతులే విదేశీ యూనివర్సిటీల్లో వైద్యవిద్యను అభ్యసించే లక్ష్యంతో కొత్త ప్రతిపాదనను తీసుకొస్తున్నారు' అని అధికారులు చెప్పారు.

మానవ హక్కుల కార్యకర్త అస్మా కన్నుమూత

గుండెపోటుతో మృతిచెందిన సామాజిక కార్యకర్త

పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను కాపాడటానికి జీవితాన్ని ధారబోసిన న్యాయవాది



లాహోర్: పాకిస్థాన్ ప్రముఖ సామాజిక కార్యకర్త, మానవ హక్కులకోసం పోరాడుతున్న న్యాయవాది అస్మా జహంగీర్(66) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. పాకిస్థాన్ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌కు తొలి మహిళా అధ్యక్షురాలిగా ఆమె పనిచేశారు. ఆదివారం ఉదయం అస్మాకు గుండెపోటు వచ్చిందని, దీంతో వెంటనే లాహోర్‌లోని ఓ దవాఖానకు తీసుకెళ్లామని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ప్రాణాలు కాపాడటానికి డాక్టర్లు తీవ్రంగా కృషిచేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆమె మరణవార్త తెలియగానే పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. పాక్ అధ్యక్షుడు మామ్నూన్ హుస్సేన్ మాట్లాడుతూ న్యాయాన్ని బతికించడానికి అస్మా ఎంతో కృషి చేశారని కొనియాడారు. పాక్ ప్రధాని అబ్బాసీ మాట్లాడుతూ దేశం గొప్ప వ్యక్తిని కోల్పోయిందని చెప్పారు. హింసపై ఆమె పోరాటం వెలకట్టలేనిదన్నారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ కో-చైర్మన్ ఆసిఫ్ అలీ జర్దారీ ఉన్నారు. 1952లో లాహోర్‌లో జన్మించిన ఆమె పాకిస్థాన్ మానవ హక్కుల కమిషన్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. దానికి చైర్మన్‌గానూ పనిచేశారు. హైకోర్టులు, సుప్రీంకోర్టులో న్యాయవాదిగా సేవలందించారు. ప్రధానంగా మానవ హక్కుల పరిరక్షణకు ఎనలేని కృషి చేశారు. పాక్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణకు1983లో సైనిక పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పాల్గొన్నారు. పాక్‌లో ముషారఫ్ సైనిక పాలన కొనసాగిన కాలం (2007)లో ఆమెను అరెస్టు చేశారు. ప్రజాస్వామ్యం, మానవ హక్కుల రక్షణకు ఎనలేని కృషి చేసిన అస్మాని పలు అవార్డులు కూడా వరించాయి. 2014లో రైట్ లైవ్‌లీహుడ్, 2010లో ఫ్రీడమ్ అవార్డులు అందులో ఉన్నాయి.

రజినీది కాషాయ రంగు కాదనుకుంటున్నా: కమల్



న్యూఢిల్లీ: సినీనటుడు కమల్‌హాసన్ వ్యాఖ్యలు తమిళనాట చర్చనీయాంశమయ్యాయి. అవసరమైతే రజినీతో కలిసి రాజకీయాల్లో పోటీ చేస్తామని ఇటీవల ప్రకటించిన కమల్.. తాజాగా 'మా విధానాలు భిన్నమైనవి. ముందుగా రజినీ రంగుపై స్పష్టత నివ్వాలి. రజినీది కాషాయరంగు కాదని నేను భావిస్తున్నా. ఒకవేళ కాషాయరంగైతే ఆయనతో కలిసి పనిచేయలేను' అని స్పష్టంచేశారు. శనివారం హార్వర్డ్ వర్సిటీలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పరిస్థితులను సవాల్ చేసేందుకే రాజకీయాల్లోకి వస్తున్నాను అని చెప్పారు. సదస్సుకు హాజరైన వారి ప్రశ్నకు సమాధానం చెబుతూ మ్యానిఫెస్టోపై తమ ఆలోచనలు ఒకేలా ఉన్నా మతాలు, రంగు విషయంలో తేడాలు ఉన్నాయన్నారు.

టీచర్లూ యూనిఫాం ధరించాలి

మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆదేశం

భోపాల్: విద్యార్థుల మాదిరిగానే పాఠశాల ఉపాధ్యాయులూ యూనిఫాం వేసుకోవాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది. వచ్చే ఏడాది నుంచి ఈ నిబంధన పాటించాలన్నది. మహిళా ఉపాధ్యాయులు ముదురు ఎరుపు రంగు జాకెట్, పురుషులు లేత నీలిరంగు యూనిఫాం ధరించాలని ఆదేశించింది. యూనిఫాంపై ఉపాధ్యాయుడి పేరు కూడా ఉండాలన్నది. విద్యార్థుల జీవితాన్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయులు వారికి ఆదర్శంగా ఉండటంతోపాటు సమాజంలో టీచర్ల గౌరవాన్ని కాపాడటానికి ఈ నిర్ణయం తీసుకున్నామని అధికార వర్గాలు తెలిపాయి.

స్మార్ట్ సిటీలకు 9940 కోట్లు విడుదల

ఏపీలోని నాలుగు నగరాలకు రూ.588 కోట్లు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాల్లో 'స్మార్ట్‌సిటీ' ఒకటి. దీని కింద వివిధ రాష్ట్రాల పరిధిలో 99 నగరాలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. కానీ ఇప్పటివరకు సుమారు రూ.9940 కోట్లు విడుదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు నగరాలను ఈ పథకం కింద ఎంపిక చేసిన కేంద్రం ఇప్పటివరకు రూ.588 కోట్లే విడుదల చేసింది. కానీ ఈ పథకం కింద సింహభాగం మహారాష్ట్రలోని ఎనిమిది నగరాలకు కలిపి అత్యధికంగా రూ.1,378 కోట్లు విడుదలయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని ఏడు నగరాలకు కలిపి రూ.984 కోట్లు, తమిళనాడులో అత్యధికంగా 11 నగరాలను ఎంపిక చేసినా నిధులు రూ.848 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. కర్ణాటకలోని ఏడు నగరాలకు రూ.836 కోట్లు, రాజస్థాన్‌లో నాలుగు నగరాలకు రూ.784 కోట్లను కేంద్రం విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని 10 నగరాలకు రూ.547 కోట్లు, గుజరాత్‌లోని ఆరు నగరాలకు రూ.509 కోట్లు విడుదలయ్యాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్ర రాజధాని కోల్‌కతాను 2016 మేలో ఎంపిక చేసిన కేంద్రం ఇప్పటి వరకు రూ.9 కోట్లు విడుదల చేసింది. మమతా బెనర్జీ ప్రభుత్వం ఈ 'స్మార్ట్ సిటీస్' మిషన్‌లో భాగస్వాములు కావడం లేదని తెలిపింది. అసోం, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కేరళ, త్రిపురలకు రూ.200 కోట్లు, మణిపూర్, నాగాలాండ్, సిక్కింలకు రూ.100 కోట్లు విడుదల చేసింది.

మురిగిపోయిన మూడువేల కోట్లు

నిధులున్నా నీరసిస్తున్న 'నిర్భయ' పథకం.. ఈనెల 15న విచారించనున్న సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: ఉన్నతాశయంతో ఏర్పాటుచేసిన నిర్భయ 'వన్ స్టాప్ సెంటర్స్' ఆలనాపాలనా లేక అనాథగా మారాయి. లైంగిక వేధింపులకు గురైన మహిళల్ని ఆదుకునేందుకు ఉద్దేశించిన ఆశయం నీరుగారుతున్నది. ఇందుకు కేటాయించిన సుమారు రూ.3409 కోట్లు అధికారుల నిర్లక్ష్యంతో మురిగిపోయాయి. బాధిత మహిళలకు వైద్య, న్యాయ సాయంతో పాటు వారు మానసికంగా కోలుకునేందుకు కేంద్రం ఐదేండ్ల క్రితం దేశవ్యాప్తంగా 660 వన్ స్టాప్ సెంటర్లను ప్రారంభించాలని నిర్ణయించిన కేంద్రం 151 కేంద్రాలకు నిధులు కేటాయించింది. వీటి కోసం 2013-14లో కేంద్రం రూ.1000 కోట్లు కేటాయించింది. తిరిగి 2016-17 బడ్జెట్‌లో రూ.550 కోట్లు, వచ్చే ఏడాది రూ.500 కోట్లు కేటాయించడంతో మొత్తం నిధులు రూ.3,600 కోట్లకు చేరుకున్నాయి. 2016లో రూ.191 కోట్లు వినియోగించారు. వివిధ రాష్ట్రాల నుంచి దీని కింద సాయం అందించాలని కేంద్రానికి 18 ప్రతిపాదనల్లో 16 ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేసే పార్లమెంటరీ కమిటీ ఆమోదం తెలిపింది. అయినా ఆ మేరకు నిధులు కేటాయించలేదు. బాధితులకు చేయూతనిచ్చేందుకు ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ప్రభుత్వ దవాఖానలో నిర్భయ 'వన్ స్టాప్ సెంటర్' ప్రారంభించారు. కానీ దాని గురించి పట్టించుకునే నాథుడే లేరు. ఎయిమ్స్‌లో ఈ సెంటర్‌ను పరిశీలించేందుకు వెళ్లిన జర్నలిస్టులను సిబ్బంది అడ్డుకున్నారు. నిర్భయ నిధుల స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని గత నెలలో కేంద్రం సహా రాష్ట్రాలను సుప్రీంకోర్టు సూచించింది. ఫిబ్రవరి 15 లోపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై సమాధానం ఇవ్వాల్సి ఉంది.

రద్దు లెక్క తేలలేదు!

రద్దయిన నోట్ల లెక్కింపు కొనసాగుతున్నది: ఆర్బీఐ.. ఆర్టీఐ దరఖాస్తుకు సమాధానం



న్యూఢిల్లీ: కేంద్రం పెద్దనోట్లను రద్దు చేసి 15 నెలలైనా బ్యాంకులకు తిరిగొచ్చిన ఈ నోట్ల విలువ ఎంతనేది ఇంకా తేలలేదు. రద్దయిన పెద్దనోట్లు బ్యాంకులకు తిరిగొచ్చిన తర్వాత అవి కచ్చితంగా ఎన్ని ఉన్నాయి, అందులో నకిలీవి, అసలు ఎంత అనే విషయాలు తెలుసుకొనే ప్రక్రియ కొనసాగుతున్నదని ఆర్బీఐ తెలిపింది. ఈ ప్రక్రియ వేగంగా నడుస్తున్నదన్నది. రద్దయిన నోట్లు ఎన్ని అని అడిగిన ప్రశ్నకు.. 'మొత్తం సరిచూస్తున్నాం, భవిష్యత్‌లో ఇంకేమైనా మార్పులు ఉండొచ్చు.. 2017 జూన్ 30 నాటికి బ్యాంకులు అందుకున్న రద్దయిన పెద్దనోట్ల విలువ రూ.15.28 లక్షల కోట్లు' అని తెలిపింది. రద్దయిన పెద్దనోట్ల లెక్కింపును ఎప్పటిలోగా పూర్తిచేస్తారో సమాచారం ఇవ్వాలని కోరగా.. 59 అధునాతన నోట్ల పరిశీలన, ప్రాసెసింగ్ మెషిన్ల(సీవీపీఎస్)తో వేగంగా ఈ ప్రక్రియ కొనసాగుతున్నదన్నది. 'ఇవే కాక వాణిజ్య బ్యాంకులు ఎనిమిది సీవీపీఎస్ యంత్రాలను వాడుతున్నాయి. మరో ఏడు యంత్రాలను లీజ్‌కు తీసుకొని ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో పనిచేస్తున్నాం' అని ఆర్టీఐ పిటిషన్‌దారుకు జవాబిచ్చింది. కేంద్రం 2016 నవంబర్ 8న పెద్ద నోట్లను రద్దు చేసి.. వాటిని బ్యాంకులకు తిరిగి ఇచ్చేయాలని ప్రత్యేకంగా అనుమతించిన అవసరాలకు వినియోగించాలని సూచించింది. గత ఏడాది ఆగస్టు 30న ఆర్బీఐ 2016-17 వార్షిక నివేదికలో.. రూ.15.28 లక్షల కోట్లు లేదా 99% రద్దయి న పెద్ద నోట్లు బ్యాంకులకు చేరాయని.. ఇంకా రూ.16,050 కోట్లు మాత్రమే రావాలని పేర్కొన్నది.

2 లక్షల మంది విదేశీయులకు వైద్యం

2016లో 54 దేశాల నుంచి 2 లక్షల మందికిపైగా రాక

న్యూఢిల్లీ: నాణ్యమైన వైద్యసేవలకు భారత్ గమ్యస్థానంగా మారింది. వైద్యసేవలకు విదేశీయులు భారత్‌కు బారులు తీరుతున్నారు. 2016లో రెండు లక్షల పైచిలుకు మంది వైద్యచికిత్స పొందారు. వారి లో పాకిస్థానీయులు 1,678 మందితోపాటు అమెరికన్లు 296 మంది ఉన్నారు. 2016లో ప్రపంచవ్యాప్తంగా 54 దేశాలకు చెందిన 2,01,099 మంది పౌరులకు మెడికల్ వీసాలు జారీచేసినట్టు కేంద్ర హోంశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2014లో వీసా విధానాన్ని భారత్ సరళీకరించింది. నాణ్యమైన వైద్య సదుపాయలు ఇక్కడ తక్కువ ధరకు లభిస్తున్నందువల్లే మెడికల్ టూరిజానికి భారత్ కేంద్రబిందువైందని తమ సర్వేలో తేలినట్టు బిజినెస్ చాంబర్ వెల్లడించింది. 2016లో అత్యధిక వైద్యవీసాలు బంగ్లాదేశీయులు 99,799 మంది, ఆఫ్ఘనిస్థాన్ 33,955 మంది, ఇరాక్ 13,465, ఒమన్ 12,227 మంది, ఉజ్బెకిస్థాన్ 4,420 మంది, నైజీరియా 4,359 మంది, బ్రిటన్ 70 మంది, రష్యా 96 మంది, ఆస్ట్రేలియాకు చెందిన 75 మంది పౌరులకు జారీచేసినట్టు హోం శాఖ గణాంకాలు తెలిపాయి.

చివరిదశలో ఆర్మీ ఆపరేషన్

- ముగ్గురు జైషే ఉగ్రవాదుల్ని మట్టుబెట్టిన సైన్యం
- ముష్కరుల కాల్పుల్లో ఐదుగురు సైనికులు, పౌరుడు మృతి
- మరో 11మందికి తీవ్రగాయాలు
- సైనిక ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షిస్తున్న ఆర్మీ చీఫ్

జమ్ము, ఫిబ్రవరి 11:

సుంజ్వాన్ ఉగ్రదాడి



'సైనిక్ కాలనీ' క్వార్టర్స్ వద్ద ఆపరేషన్‌లో భద్రతాబలగాలు

జమ్ముకశ్మీర్‌లోని సుంజ్వాన్ ఆర్మీ క్యాంప్‌లో చొరబడిన ఉగ్రవాదుల ఏరివేత కోసం సైన్యం చేపట్టిన ఆపరేషన్ చివరిదశకు చేరుకున్నది. ఉగ్రవాదుల వైపునుంచి కాల్పులు ఆగిపోవడంతో.. వారు తలదాచుకున్న భవనాలను కూల్చే పనిలో ఆర్మీ నిమగ్నమైంది. టెర్రరిస్టులు ఎవరైనా నక్కి ఉంటే, వారిని సైతం మట్టుపెట్టేందుకే భవనాలపైకి మోర్టార్‌షెల్స్, బాంబులు ప్రయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 36బ్రిగేడ్ సైనికశిబిరంలోకి శనివారం ఉగ్రవాదులు చొరబడిన విషయం తెలిసిందే. 42గంటలపాటు సాగిన ఆపరేషన్‌లో ముగ్గురు జైషే మొహమ్మద్ ముష్కరులను సైన్యం మట్టుబెట్టింది. ఉగ్రవాదుల కాల్పుల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ముగ్గురు సైనికులు, ఇద్దరు భద్రతాసిబ్బంది ఉన్నారు. అమరులైన వారిని సుబేదార్ మదన్‌లాల్ చౌదరి, సుబేదార్ మహ్మద్ అష్రఫ్‌మీర్, హవల్దార్ హబీబుల్లా ఖురేషీ, నాయక్ మంజూర్ అహ్మద్, లాన్స్‌నాయక్ మహ్మద్ ఇక్బాల్‌గా గుర్తించారు. అమరజవాన్ మహ్మద్ ఇక్బాల్ తండ్రి కూడా ఉగ్రవాదుల తూటాలకు బలయ్యారు. కాల్పుల్లో ఆరుగురు మహిళలు, చిన్నారులు సహా 11మంది తీవ్రంగా గాయపడ్డారు. శనివారం ఇద్దరు టెర్రరిస్టులను అంతమొందించిన సైన్యం ఆదివారం మరొకరిని హతమార్చింది. చనిపోయిన మూడో ఉగ్రవాది వద్ద కూడా భారీగా ఆయుధాలు లభ్యమయ్యాయి. ఏకే-56 తుపాకులు, మందుగుండు సామగ్రి, గ్రెనేడ్ లాంచర్ స్వాధీనం చేసుకున్నారు. ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ ఆదివారం ఉదయం జమ్ముకు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. క్విక్ రెస్పాన్స్ టీముల తోపాటు పారాకమెండోలు క్వార్టర్స్‌ను ఇప్పటికే తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆదివారం ఎన్ఐఏ బృందాలు కూడా అక్కడికి చేరుకున్నాయి. ఘటనాస్థలంలో ఆర్మీ సేకరించిన ఆధారాలను ఎన్ఐఏ పరిశీలించింది. సీఆర్పీఎఫ్, పోలీసు, అగ్నిమాపక బృందాలు క్యాంపు చుట్టుపక్కల మోహరించి ఉన్నాయి. ఉగ్రదాడి నేపథ్యంలో సైన్యం హైఅలర్ట్‌ను ప్రకటించింది. ఆర్మీ క్యాంపునకు సమీపంలోని పాఠశాలలను మూసివేశారు. పంజాబ్-జమ్ముకశ్మీర్ సరిహద్దు గ్రామాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. కాల్పుల్లో తలకు తీవ్రంగా గాయమైన 14ఏండ్ల బాలుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. జమ్ముకశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ దవాఖానలో క్షతగాత్రులను పరామర్శించారు. సుంజ్వాన్ శిబిరంపై ఉగ్రవాదులు జరిపిన దాడి.. 2016లో జరిగిన యురీ ఘటన తర్వాత తీవ్రమైన దాడిగా అధికారులు పేర్కొంటున్నారు. నాడు యురీ ఘటనలో 19మంది సైనికులు అమరులయ్యారు. ప్రస్తుత దాడిలో ఐదుగురు సైనికులు, ఓ పౌరుడు ప్రాణాలు కోల్పోయారు. సుంజ్వాన్‌లో చేపట్టిన ఆపరేషన్‌ను సైన్యం విజయవంతంగా ముగిస్తుందని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ధీమా వ్యక్తంచేశారు. మరోవైపు సుంజ్వాన్ ఉగ్రదాడిని కాంగ్రెస్ ఖండించింది. పార్టీలకతీతంగా భారతీయులందరూ సైన్యానికి మద్దతివ్వాలని ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు. బాధిత కుటుంబాలు కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

నియంత్రణరేఖ వెంబడి పాక్ కాల్పులు.. ఒకరి మృతి

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ సైన్యం నియంత్రణరేఖ వెంబడి ఆదివారం కూడా కాల్పులను కొనసాగించింది. నాలుగురోజులుగా రాజౌరి, పూంచ్ జిల్లాల్లో మోర్టార్‌షెల్స్‌తో దాడిచేసింది. శనివారం రాత్రి జరిగిన కాల్పుల్లో బుల్లెట్ తగిలి పర్వీన్ అఖ్తర్ (55) అనే మహిళ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

భద్రతాబలగాలకు ఆహారమందిస్తున్న స్థానికులు

ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్‌లో 36గంటలుగా నిమగ్నమైన భద్రతాబలగాలకు స్థానికులు అన్నపానీయాలను అందిస్తున్నారు. సైనిక్‌కాలనీ చుట్టుపక్కల ఉన్న అనేక భవనాలపై మోహరించిన భద్రతాసిబ్బందికి ఆహారం, టీ, నీళ్లు అందిస్తున్నారు. 'సైన్యంపై రాళ్లురువ్వడం నిత్యకృత్యమైన చోట.. ఇలా ఆదరించి ఆహారాన్ని అందించడం మరిచిపోలేము' అని భద్రతాసిబ్బంది తెలిపారు. తాము శనివారం 500మంది భద్రతాసిబ్బందికి భోజనం, స్నాక్స్ అందించామని భారత్-టిబెట్ సహ్యోగ్ మంచ్ అధ్యక్షుడు సంజీవ్ మన్‌హౌతా తెలిపారు.

తూటాలు దిగబడుతున్నా పోరాడిన మదన్‌లాల్



ఒక్కసారిగా చుట్టుముట్టిన ఉగ్రవాదులు.. ఎడపెడా కాల్పులు జరుపుతున్న శబ్దం. చేతిలో ఆయుధం లేదు. అయినా ఆయన ఆగిపోలేదు. బుల్లెట్లు ఛాతిని చీలుస్తున్నా వారితో కలబడ్డాడు. సుంజ్వాన్‌లో ఆర్మీ క్వార్టర్స్‌లోకి ఉగ్రవాదులు చొరబడినప్పుడు సుబేదార్ మదన్‌లాల్ చౌదరి తన ఇంట్లో ఉన్నాడు. అయితే కాల్పులు జరుపుతూ ఉగ్రవాదులు ద్వారం వద్దకు దూసుకొచ్చారు. ఆ క్షణంలో తను నిరాయుధుడు. పైగా ఒక్కరోజు ముందే ఓ పెండ్లివేడుక కోసం షాపింగ్ చేసేందుకు ఆయన భార్య, పిల్లలు ఆ క్వార్టర్‌కు వచ్చారు. అప్పటికే వారంతా భయాందోళనలో ఉన్నారు. ఉగ్రవాదులు లోపలికి రాకుండా ద్వారం వద్దే వారిని అడ్డుకున్న మదన్‌లాల్ కుటుంబ సభ్యుల్ని వెనుక ద్వారం గుండా బయటకు వెళ్లిపోవాల్సిందిగా కేకలేశాడు. ఆగ్రహించిన ముష్కరులు తుపాకీతో తనపై కాల్పులు వర్షం కురిపిస్తున్నా, తన భార్య, పిల్లలు బయటకు వెళ్లేవరకు వారిని అడ్డుకుని, చివరకు నేలకూలాడు. కూతురు నేహాకు తూటా గాయం అయినప్పటికీ ఆ కుటుంబం ప్రాణాలతో బయటపడిందంటే అందుకు మదన్‌లాల్ చూపిన తెగువే కారణం.

కాల్పుల్లో గాయపడి, ఆడ శిశువుకు జన్మనిచ్చింది..

సుంజ్వాన్ ఉగ్రదాడిలో గాయపడిన మహిళ ఆడ శిశువుకు జన్మనిచ్చింది. శనివారం ఆర్మీకార్టర్స్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో.. రైఫిల్‌మ్యాన్ నజీర్‌అహ్మద్‌తోపాటు ఆయన భార్య తీవ్రంగా గాయపడ్డారు. 35వారాల గర్భిణి అయిన ఆమెను హుటాహుటిన ప్రత్యేక హెలికాప్టర్‌లో సైనిక దవాఖానకు తరలించి శస్త్రచికిత్స చేశారు. సిజేరియన్ తర్వాత జన్మించిన ఆడశిశువు 2.5కిలోల బరువు ఉంది. తల్లీకూతుళ్లు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

ప్రగతి కోసం టెక్నాలజీ



- క్షిపణులు, బాంబుల వంటి విధ్వంస చర్యల కోసం కాదు
- నగదు బదిలీ పథకంతో రూ.56 వేల కోట్ల ఆదా
- దుబాయి వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్‌లో ప్రధాని మోదీ

ఒపేరాహౌస్‌లో మాట్లాడుతున్న మోదీ.. దుబాయ్‌లో నిర్మించినున్న స్వామినారాయణ్ ఆలయ నమూనా

దుబాయ్, ఫిబ్రవరి 11: సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలే గానీ విధ్వంసం కోసం కాదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. దుబాయ్‌లో జరుగుతున్న ఆరవ వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ మన ఆదాయం, వనరులు, సమయంలో అత్యధిక శాతం క్షిపణులు, బాంబుల తయారీకి ఉపయోగిస్తున్నామన్నారు. కానీ టెక్నాలజీని తప్పనిసరిగా ప్రగతి కోసం ఉపయోగించుకోవాలన్నారు. దుబాయ్‌లోని ఎడారి ప్రాంతాల్లో పరివర్తన కోసం టెక్నాలజీ వినియోగించడం అద్భుతం అని అభివర్ణించారు. సైబర్ స్పేస్‌ను ఉగ్రవాదులు, హ్యాకర్లు దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉన్నదని ప్రపంచ దేశాలను హెచ్చరించారు. నగదు బదిలీ పథకం కింద సుమారు 400 ప్రభుత్వ పథకాలను ఆధార్‌తో అనుసంధానించడంతో ప్రభుత్వానికి రూ.56 వేల కోట్లు ఆదా అయిందన్నారు. ఈ సదస్సుకు దుబాయి పాలకుడు, యూఏఈ ఉపాధ్యక్షుడు, ప్రధాని షేక్ మహ్మద్ బిన్ రషీద్ అల్ మఖ్తౌంతోపాటు 140 దేశాల నుంచి 4000 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సదస్సుకు ఆతిథ్య హోదాలో భారత్‌కు ఆహ్వానం లభించిందని, కానీ తనను ముఖ్య అతిథిగా పిలువడం 125 కోట్ల మంది భారతీయులకు గర్వ కారణమని ప్రధాని మోదీ చెప్పారు. భారత్‌లో క్యాబ్ సర్వీసుకు కి.మీ.దూరానికి రూ.10 ఖర్చు చేయాల్సి వస్తే.. బుధగ్రహంపైకి ఉపగ్రహ ప్రయోగానికి కి.మీ.కి కేవలం రూ.7 మాత్రమే ఖర్చయిందని మోదీ ప్రకటించగానే సభికులు హర్షధ్వానాలు వ్యక్తం చేశారు.

దుబాయ్ పాలకుడు అల్ మఖ్తౌంతో చర్చలు

ప్రధాని మోదీ ఆదివారం రాజ ప్రసాదంలో దుబాయి పాలకుడు యూఏఈ ఉపాధ్యక్షుడు, ప్రధాని షేక్ మహ్మద్ బిన్ రషీద్ అల్ మఖ్తౌంతో కలిసి ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు.

మోదీకి ఇజ్రాయెల్ వాయుసేన బందోబస్తు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ పాలస్తీనా పర్యటన చరిత్రలో నిలిచిపోనున్నది. శనివారం ఆయన ఇజ్రాయెల్ గగనతలం మీదుగా నేరుగా పాలస్తీనా రాజధాని రమల్లాకు చేరుకున్నారు. జోర్డాన్ ప్రభుత్వం సమకూర్చిన హెలికాప్టర్‌లో వెళ్లిన మోదీకి ఇజ్రాయెల్ వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్లు బందోబస్తుగా రావడం విశేషం.

యూఏఈతో అనుబంధం వ్యాపారం కంటే గొప్పది: మోదీ

దుబాయ్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో భారత్‌కు ఉన్న అనుబంధం వాణిజ్య సంబంధం కంటే గొప్పదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. గల్ఫ్ దేశాలతో పెరుగుతున్న భారత్ సంబంధాలు ఎంతో విశాలమైనవి, లోతైనవి, శక్తిమంతమైనవని ఉద్ఘాటించారు. యూఏఈలో రెండురోజుల పర్యటనలో భాగంగా రెండోరోజైన ఆదివారం దుబాయ్‌లోని ఒపేరాహౌస్‌లో భారతీయ సమాజానికి చెందిన ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. అబుదాబీలో నిర్మించతలపెట్టిన హిందూ దేవాలయానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచస్థాయి దేశంగా భారత్‌ను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నదని పేర్కొన్నారు.

తొలి హిందూ దేవాలయానికి పునాదిరాయి

అబుదాబీలో నిర్మించనున్న తొలి హిందూ దేవాలయమైన స్వామినారాయణ్ ఆలయానికి ప్రధాని మోదీ దుబాయ్ ఒపేరాహౌస్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పునాదిరాయి వేశారు. ఈ పవిత్రమైన ఆలయం మానవత్వానికి, సామరస్యతకు ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని, భారతీయ గుర్తింపునకు ఒక మాధ్యమంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ప్రసంగాలు మాని.. పని మొదలుపెట్టు!

- మీ టర్మ్ ముగియబోతున్నది
- ప్రధాని మోదీకి రాహుల్ హితవు

కరతాగి (కర్ణాటక): ప్రధానమంత్రి నరేంద్రమోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శలు తీవ్రతరం చేశారు. ఇకనైనా ఊకదంపుడు ప్రసంగాలు మాని పనులు మొదలుపెట్టాలని, ఎన్డీయే ప్రభుత్వ గడువు ముగియడానికి ఎంతో సమయం లేదని రాహుల్ హితవుపలికారు. 'గత ఐదేండ్లలో దేశానికి మీరు ఏం చేశారో ఈ ఎన్నికల్లో చెప్పాల్సి ఉంటుంది. ఐదేండ్ల పాలన పూర్తికావస్తున్నది. కానీ, ఇంత వరకు మీరు కనీసం ఖాతా కూడా ప్రారంభించలేదు' అని రాహుల్ విమర్శించారు. కర్ణాటక ఎన్నికల ప్రచారంలోభాగంగా రెండోరోజు ఆదివారం కరతాగి జిల్లాలో 'జన ఆశీర్వాద యాత్ర'లో రాహుల్.. ప్రధాని మోదీ లక్ష్యంగా విమర్శలు సంధించారు. 'ఉద్యోగాల భర్తీలో, నల్లధనాన్ని వెనుకకు తీసుకురావడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైంది' అని ఎద్దేవా చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో మందుపాతర పేలి జవాన్ మృతి

చర్ల/భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,నమస్తే తెలంగాణ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఆనుకుని ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మందుపాతర పేల్చిన సంఘటనలో సీఆర్పీఎఫ్ జవాన్ హేమ్లా(35)మృతిచెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పామేడు పోలీసు స్టేషన్ పరిధిలోని తోగ్గూడెం-తిప్పాపురం గ్రామాల మధ్యలో ఆదివారం ఈ ఘటన జరిగింది.

13 హైకోర్టులకు జడ్జిలను
ఖరారు చేయని కేంద్రం

123 పేర్లు సిఫారసు చేశామన్న సుప్రీంకోర్టు కొలీజియం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: వివిధ రాష్ట్రాల్లోని 13 హైకోర్టుల పరిధిలో న్యాయమూర్తుల నియామకానికి తాము 123 మంది పేర్లను సిఫారసు చేస్తూ కేంద్రానికి పంపిన నివేదిక ఇంకా పెండింగ్‌లోనే ఉన్నదని సుప్రీంకోర్టు కొలీజియం పేర్కొన్నది. వివిధ హైకోర్టులకు మొత్తం మంజూరైన 1,079 మంది న్యాయమూర్తుల పోస్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులపై తుది నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నామని తెలిపింది. తాము సిఫారసు చేసిన 123 పేర్లు మినహా 280 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని కొలీజియం తెలిపింది. కాగా ఈ నెల ఒకటోతేదీ నాటికి అలహాబాద్ హైకోర్టులో 56, కలకత్తాలో 39, కర్ణాటకలో 38, పంజాబ్/హర్యానా హైకోర్టులో 35, ఆంధ్రప్రదేశ్/ తెలంగాణ హైకోర్టులో 30 జడ్జీల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మొదటిపేజీ తరువాయి...

కాగా మిగతావారు విమాన సిబ్బంది. మాస్కో నుంచి ఈ విమానం ఓరస్క్ వెళ్లాల్సిఉంది. ప్రమాదం జరిగిన విషయాన్ని రష్యా అధికారులు ధ్రువీకరించారు. కొంతకాలంగా రష్యాలో భారీగా మంచు కురుస్తుండటంతో దారి సరిగా చూడలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఆకాశం నుంచి విమానం కూలిపోయి మంటల్లో దగ్ధమైన దృశ్యాన్ని చూసి భయకంపితులమయ్యామని అర్గునోవ్ గ్రామస్థులు చెప్పారు. కుప్పకూలిన విమాన శకలాలు చాలా దూరం వరకు విసిరివేయబడ్డాయని స్థానిక వార్తా సంస్థలు తెలిపాయి. 'కూలిపోయిన విమానం కొత్తదే, సర్వీసులోకి తీసుకుని ఎనిమిదేండ్లే అవుతున్నది' అని సరటోవ్ ఎయిర్‌లైన్స్ తెలిపింది. ఈ విమానాన్ని అంతర్జాతీయ సర్వీసులకు కూడా వినియోగించారు. రష్యాలో రెండో అతిపెద్ద విమానాశ్రయంగా డుమోడెడ్వో విమానాశ్రయానికి పేరుంది.

71 మంది మృతి



ప్రమాద స్థలంలో కొనసాగుతున్న గాలింపు; ఇన్‌సెట్‌లో విమానం (ఫైల్)

మంచు కారణంగా సహాయకచర్యల్లో ఆలస్యం

రష్యాలో విపరీతంగా కురుస్తున్న మంచు కారణంగా విమానం కూలిన ప్రదేశానికి సహాయక సిబ్బంది త్వరగా చేరుకోలేకపోయారు. కొంతదూరం నుంచి కాలినడకన ఘటనాస్థలికి వెళ్లాల్సివచ్చింది. విమానం కూలిన ప్రదేశంలో సుమారు 150మంది సహాయక సిబ్బంది సేవలందిస్తున్నారు. రష్యా ట్రాన్స్‌పోర్ట్ మంత్రి మాక్సిమ్ సాకలోవ్ ఘటనా స్థలికి బయల్దేరి వెళ్లారు. విమానం కూలిపోవడానికి వాతావారణ పరిస్థితులతోపాటు మానవతప్పిదాలు కూడా కారణభూతాలేనని రష్యా ట్రాన్స్‌పోర్ట్ మంత్రిత్వ శాఖ పేర్కొంది. విమానం కుప్పకూలిన ఘటన పట్ల రష్యా అధ్యక్షుడు పుతిన్ విచారం వ్యక్తం చేశారు. గత నవంబర్ నెలలో ఓ విమానం కూలిన ఘటనలో ఆరుగురు మృతిచెందారు. డిసెంబర్ నెలలోనూ నల్ల సముద్రంలో మిలిటరీ విమానం కూలి రెడ్ ఆర్మీకి చెందిన 92మంది సైనికులు దుర్మరణం పాలయ్యారు.

కాన్పూర్ యాక్సిస్ ఏటీఎంలో నకిలీ నోట్లు

న్యూఢిల్లీ: పెద్దనోట్ల రద్దు తర్వాత కొన్ని ఏటీఎంల నుంచి 'చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' పేరుతో నకిలీ నోట్లు రాగా, తాజాగా కాన్పూర్‌లో రెండు అలాంటి నోట్లు ఓ ఏటీఎం నుంచి వచ్చాయి. మార్బుల్ మార్కెట్ ప్రాంతంలో ఉన్న యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం నుంచి ఇద్దరు ఖాతాదారులు ఆదివారం నగదు డ్రా చేసేందుకు వచ్చారు. ఒకరు రూ.10 వేలు, మరొకరు రూ.20 వేల నగదును తీసేందుకు ప్రయత్నించగా వారికి చెరో రూ.500 నకిలీ నోటు వచ్చింది. వాటిపై రిజర్వ్ బ్యాంక్‌స్థానంలో 'చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' అని ముద్రించి ఉన్నది.



సిద్దిపేట జిల్లాలోని ప్రసిద్ధ కొమురెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. నాలుగోవారం కావడంతో హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మంగళవారం శివరాత్రి పర్వదినం సందర్భంగా కొమురెల్లిలో పెద్దపట్నం జరుగనున్నది. - చేర్యాల, నమస్తే తెలంగాణ

యాదాద్రికి పోటెత్తిన భక్తులు

యాదాద్రి భువనగిరి, నమస్తే తెలంగాణ ప్రతినిధి: యాదాద్రి భక్తులతో పోటెత్తింది. శ్రీ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ధ్వజారోహణం, దేవతాహ్వానం, భేరిపూజ, అగ్నిప్రతిష్ఠను స్మార్త సంప్రదాయానుసారం నిర్వహించారు. అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి దంపతులు, యాదాద్రి ఆలయ ఈవో గీత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. శివాలయం బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి 7 గంటలకు పరమశివుడి కల్యాణమహోత్సవం నిర్వహించనున్నారు. ఏకాదశి సందర్భంగా శ్రీలక్ష్మీనరసింహస్వామివారికి లక్షతులసీ పుష్పార్చనను కన్నుల పండువగా నిర్వహించారు.



ఎల్ఆర్ఎస్‌లో 'మహా' స్పీడ్!

- వారంలో క్రమబద్ధీకరణ పూర్తి
- 1.75 లక్షల దరఖాస్తుల్లో 90 వేలకు అనుమతులు
- ఉమ్మడి రాష్ట్రంలో ఐదేండ్లలో 38 వేలే పరిష్కారం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హెచ్ఎండీఏ పరిధిలో లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) తుది దశకు చేరుకున్నది. 1,75,406 దరఖాస్తులను స్వీకరించిన అధికారులు పరిశీలన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించి 90,201 మందికి అనుమతులు మంజూరు చేయగా, 76,913 మందిని అనర్హులుగా గుర్తించి దరఖాస్తులను తిరస్కరించారు. ప్రభుత్వ భూములు, శిఖం భూములు, ఎఫ్‌టీఎల్, మాస్టర్‌ప్లాన్ రోడ్ల పరిధిలో ఉన్న ప్లాట్ల దరఖాస్తులను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. ప్రస్తుతం 8,292 దరఖాస్తులు మాత్రమే పరిశీలనలో ఉన్నాయని, వారం రోజుల్లో పూర్తి చేస్తామని హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు తెలిపారు. దరఖాస్తు సమయంలో సరైన పత్రాలు సమర్పించని వారికి సమాచారం అందించామని, షార్ట్ ఫాల్ పేరుతో తిరస్కరించిన వారంతా మళ్లీ దరఖాస్తు చేసుకున్నారని వీరి దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. దాదాపు 20 వేల మంది నిర్ణీత ఫీజు చెల్లించలేదని, వారికి సమాచారం అందించామన్నారు. క్రమబద్ధీకరణ రుసుము చెల్లించకుంటే వారి దరఖాస్తులను తిరస్కరిస్తామని హెచ్చరించారు.

ఇతర విభాగాల కన్నా వేగంగా..

ఎల్ఆర్ఎస్ అమలులో జీహెచ్ఎంసీ, డీటీసీపీ (అన్ని మున్సిపాలిటీలు)తో పోల్చితే హెచ్ఎండీఏ అత్యధిక దరఖాస్తులు స్వీకరించడంతోపాటు పరిశీలనను సమర్థంగా, వేగంగా నిర్వర్తించి ముందంజలో నిలిచింది. ఉమ్మడి రాష్ట్రంలో 2009-13 మధ్య ఐదేండ్లలో 58వేల దరఖాస్తులు రాగా కేవలం 38వేల దరఖాస్తులకే అనుమతులు ఇచ్చారు. ఇప్పుడు కేవలం రెండేండ్లలో 1.75 లక్షల దరఖాస్తులను హెచ్ఎండీఏ అధికారులు క్లియర్ చేసి రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు అద్దం పట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 14 వేల దరఖాస్తులను సైతం హెచ్ఎండీఏ పరిగణనలోకి తీసుకొని వాటికి పరిష్కారం చూపడం విశేషం. ఎక్కడా అక్రమాలు, అవినీతికి తావులేకుండా ఆన్‌లైన్‌లో పారదర్శకంగా అనుమతులు మంజూరుచేశారు. నకిలీ ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్, నాలుగు వేలకు పైగా దొంగ డీడీలతో ఎంట్రీ అయిన దరఖాస్తులను గుర్తించి వెంటనే తొలిగించారు. పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ నిరంతర పర్యవేక్షణ, సంస్థ ఉద్యోగుల కృషి, విశ్రాంత తహసీల్దార్ల సేవలు వినియోగించుకోవడం, డిప్యూటేషన్‌పై ఇతర శాఖల నుంచి ఇంజినీర్లను (ఏఏఈ) తీసుకురావడం, పనితీరును బట్టి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం, ప్రతి సోమవారం పథకం పురోగతిపై సమీక్ష ఇలా పలు కార్యక్రమాలు పథకం విజయంలో కీలకపాత్ర పోషించాయి.

ఎల్ఆర్ఎస్ పథకం పురోగతి

	దరఖాస్తులు	అనుమతి	తిరస్కరణ	పెండింగ్
హెచ్ఎండీఏ	1,75,406	90,201	76,913	8,292
జీహెచ్ఎంసీ	80,729	14,376	12,750	53,603
డీటీసీపీ(అన్ని మున్సిపాలిటీలు)	93,107	48,303	8,860	35,944


కండ్ల ముందు రాచకొండ వైభవం

నేటి నుంచి పర్యాటక ఉత్సవాలు.. మూడు రోజులు నిర్వహించనున్న రాష్ట్ర పర్యాటకశాఖ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/మంచాల: శతాబ్దాల చరిత్ర కలిగిన రాచకొండ ప్రాంత వైభవం సోమవారం నుంచి మరోసారి ప్రజల ముందు ఆవిష్కృతం కానున్నది. రాష్ట్ర పర్యాటకశాఖ సహకారంతో రాచకొండ చారిత్రక, పర్యావరణ, పర్యాటక పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 12, 13, 14 తేదీల్లో వైభవంగా పర్యాటక ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు పర్యాటకశాఖ రూ.2 లక్షలు విడుదల చేసింది. హైదరాబాద్‌కు 35కి.మీ దూరంలో ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో విస్తరించిన ఈ గుట్టలను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయగా తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నది.

రాజులేలిన చరిత్ర

తొలుత రాజాచలంగా పిలిచిన ఈ ప్రాంతం క్రమంగా రాచకొండగా మారింది. రేచర్ల పద్మనాయక వంశీయులు రాచకొండను రాజధానిగా చేసుకొని 12వ శతాబ్దం సమయంలో సుమారు 152 ఏండ్లు పాలించారు. రేచర్ల సింగభూపాలుడి పాలనలో శత్రు దుర్భేద్యంగా కట్టడాలు, ప్రహరీలు నిర్మించారు. సంకెళ్లబావి గుట్ట చుట్టూ పటిష్ఠమైన గోడలు నిర్మించారు. అపురూప శిల్పకళతో నిర్మించిన దేవాలయాలు, గోపురాలు రాచకొం డ వైభవానికి ప్రతీకలు. వీటిలో కొన్ని శిథిలం కాగా, మరికొన్ని ఆనవాళ్లుగా కనిపిస్తాయి. అప్పట్లో రాజులు ప్రజలకు తాగు, సాగునీరు అందించేందుకు ప్రత్యేక కృషిచేసినట్టు అనపోత సముద్రం, రాయ సముద్రం, దేవలమ్మ నాగారం, నాగాంబిక ఉదాహరణాలుగా నిలుస్తాయి. కాలభైరవులు అనేక చోట్ల శిలాశాసనాలను చెక్కించారు. ఇటీవల తవ్వకాల్లో ఎనిమిది అడుగుల శివలింగం బయటపడింది. ఈ స్వామిని స్వయంభు శంభులింగేశ్వరుడిగా కొలుస్తున్నారు.



చరిత్ర కండ్లకు కట్టేలా..

ఉత్సవాల సందర్భంగా అలనాటి వైభవాన్ని కండ్లకు కట్టేలా చాటి చెప్పడానికి ఏర్పాట్లు చేశారు. సోమవారం గణపతిపూజ, హోమం, రెండోరోజు రాచకొండలోని శివలింగాలకు ప్రత్యేక పూజలు, మూడోరోజు శివరాత్రి సందర్భంగా శివలింగాలకు పాలాభిషేకాలు, ప్రత్యేక పూజలు ఉంటాయి. అదేరోజు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, రాచకొండ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలుంటాయి. సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు, ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అధికారులు చెప్తున్నారు.

పర్యాటక ప్రదేశాలివే..

ఉత్సవాల సందర్భంగా దేవాలయాలతో పాటు పర్యాటకప్రాంతాలను దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. రామాలయం, సంకెళ్ల గుట్ట (రాజుగారి గుట్ట), వీరభద్రుని గుట్ట, కోనేరు, శివలింగం, పాత శివాలయం, భూపతి ఆలయం, గుర్రాలగుట్ట (సైనిక స్థావరాలు), విష్ణుఆలయం, కాలభైరవులు ఏర్పాటుచేసిన శాసనాలు, మూడు దర్గాలు, పెద్దమ్మ తల్లి, సరళమైసమ్మ దేవాలయాలు, ఆది మహావిష్ణువు దేవాలయం (నాగాంబిక చెరువు పక్కన), శాసనాలు, కోనేరు ఆనవాళ్లు, నరసింహస్వామి గుట్ట, బోగందాని మంచం, చాకలి బండ తదితర ప్రదేశాలను సందర్శించవచ్చు.

ప్రజల్లో సంతోషం నెలకొన్నది



రాచకొండ రామాలయానికి భద్రాచలం ఆలయమంత చరిత్ర ఉన్నది. ఈ ప్రాంత వైభవాన్ని చాటి చెప్పేందుకు సీఎం కేసీఆర్ ఆశీస్సులతో ఉత్సవాలు నిర్వహిస్తుండటంతో ప్రజల్లో సంతోషం నెలకొన్నది.
- సూరపెల్లి వెంకటేశం, రాచప్ప కమిటీ ప్రధాన కార్యదర్శి

భవిష్యత్ తరాలకు అవసరం



ఘన చరిత్ర కలిగిన రాచకొండ ప్రాంతాన్ని గత పాలకులు పట్టించుకోలేదు. మనకే ప్రత్యేకమైన చరిత్రను ప్రపంచానికి పరిచయం చేసేందుకు సీఎం కేసీఆర్ నడుంబిగించారు. ఇందులో భాగంగా రాచకొండ పేరుతో పోలీస్ కమిషనరేట్‌ను ఏర్పాటుచేశారు. మన ప్రాంత వైభవాన్ని నేటి సమాజానికి, భవిష్యత్ తరాలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. - కర్నె ప్రభాకర్, ఎమ్మెల్సీ

కేసీఆర్ శ్రద్ధతో పూర్వ వైభవం



ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గతంలో ప్రభుత్వాలకు విన్నవించినా పట్టించుకోలేదు. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో ఈ ప్రాంతానికి పూర్వ వైభవం వస్తున్నది. పర్యాటకశాఖ సహకారంతో రెండోసారి రాచకొండ పర్యాటక ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. ఉత్సవాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరుతున్నాం.
- బద్దుల కృష్ణకుమార్, రాచప్ప కమిటీ చైర్మన్



పూజలో పాల్గొన్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కలెక్టర్ ఎంవీ రెడ్డి

కీసరలో మొదలైన బ్రహ్మోత్సవాలు

ప్రారంభించిన రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి

మహాశివరాత్రికి 1,500 అదనపు బస్సులు

మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి: సుప్రసిద్ధ శైవక్షేత్రమైన మేడ్చల్ జిల్లా కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఉదయం 11 గంటలకు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కలెక్టర్ ఎంవీ రెడ్డి తదితరులు విఘ్నేశ్వరపూజలో పాల్గొన్నారు. కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా గ్రామీణ క్రీడోత్సవాలను, ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభించిన మంత్రి క్రీడలకు సంబంధించిన జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. హైదరాబాద్‌కు అతిసమీపంలో ఉన్న కీసర దేవాలయ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ క్రమంలోనే కలెక్టర్ ఎంవీ రెడ్డి సుమారు రూ.75 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అందించారన్నారు. 16వ తేదీ వరకు జరుగనున్న కీసర బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వపరంగా ఏర్పాట్లు చేశామన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీశైలంతోపాటు రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలకు అదనంగా 1,500 బస్సులను నడుపనున్నామని, ఇందులో శ్రీశైలానికి 800 బస్సులు, కీసరగుట్టకు 308, వేములవాడకు 200, ఏడుపాయలకు 150 ప్రత్యేక బస్సులను నడుస్తాయని తెలిపారు. యాదాద్రి, వేములవాడ, భద్రాచలం దేవాలయాలను ప్రభుత్వం ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్నదని మేడ్చల్ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు సుమారు ఆరు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నదని, ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశామని కలెక్టర్ ఎంవీ రెడ్డి పేర్కొన్నారు.

నేడు స్వచ్ఛ సర్వేక్షణ్-2018

బాగ్‌లింగంపల్లి వేదికగా గిన్నిస్ రికార్డు యత్నం

స్వచ్ఛత కోసం పది సూత్రాల ప్రతిజ్ఞ

ముషీరాబాద్, నమస్తే తెలంగాణ: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా గిన్నిస్ రికార్డు సొంతం చేసుకునే కార్యక్రమానికి హైదరాబాద్ రాంనగర్ మున్సిపల్ డివిజన్ వేదిక కాబోతున్నది. బాగ్‌లింగంపల్లి అంబేద్కర్ కాలేజ్‌లో సోమవారం జీహెచ్ఎంసీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న స్వచ్ఛ సర్వేక్షణ్-2018 'స్వచ్ఛతకై పది సూత్రాల ప్రతిజ్ఞ' కార్యక్రమానికి సర్కిల్-15 అధికారులు, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వీ శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. వేలాది మంది విద్యార్థులతోపాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానికులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కాబోతున్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా గుజరాత్‌లోని వడోదర మున్సిపల్ కార్పొరేషన్ గత ఏడాది మే నెలలో 5,058 మంది విద్యార్థులతో రోడ్లను ఊడ్చే ప్రక్రియ చేపట్టి రికార్డు సృష్టించింది. ఇప్పుడు జీహెచ్ఎంసీ ఆ రికార్డును తిరుగరాయనున్నది. అంబేద్కర్ కళాశాలలో దాదాపు 15 వేల మందితో రోడ్లు ఊడ్చే కార్యక్రమం, స్వచ్ఛ తకై పది సూత్రాల ప్రతిజ్ఞ నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. కార్య క్రమంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు కేటీఆర్, నాయిని నర్సింహారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, టీ పద్మారావు పాల్గొననున్నారు.

గర్భిణి హత్య కేసులో పురోగతి

- హంతకుల్లో ఒక పురుషుడు, ఒక స్త్రీ ఉన్నట్టు గుర్తింపు
- శవాన్ని బైక్‌పై తెచ్చి పడేసినట్టు ఆధారాలు లభ్యం
- మరో రెండు రోజుల్లో కేసు కొలిక్కి వచ్చే అవకాశం

హైదరాబాద్ సిటీబ్యూరో/శేరిలింగంపల్లి, నమస్తే తెలంగాణ: గర్భిణిని ముక్కలుగా నరికి సంచుల్లో కుక్కి బొటానికల్ గార్డెన్ సమీపంలో పడేసిన కేసులో పోలీసులకు హంతకుల ఆనవాళ్లు దొరికాయి. శవాన్ని బైక్‌పై తీసుకొచ్చి పడేసినట్టు సీసీ ఫుటేజీలు లభ్యమయ్యాయి. గత నెల 30న వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించి పోలీసులు 10కి పైగా వీడియోలను విశ్లేషించి హంతకుల్లో ఒక మహిళ, ఒక పురుషుడు ఉన్నట్టు గుర్తించారు. వారికి మరొకరు సహాయం చేసి ఉంటారని భావిస్తున్నారు. గర్భిణిని గత నెల 28న రాత్రి హత్యచేసి, మృతదేహం నుంచి రక్తం మొత్తం పోయిన తర్వాత నరికి సంచుల్లో పెట్టి బొటానికల్ గార్డెన్ వద్ద పడేసినట్టు అనుమానిస్తున్నారు. తెల్లవారుజామున 3:27 గంటలకు యమహా బ్లూ కలర్ బైక్‌పై హెల్మెట్లు ధరించిన ఇద్దరు సంచులు తీసుకొని వెళ్తున్నట్టు, 3.36 గంటలకు బొటానికల్ గార్డెన్ జంక్షన్‌లో, 3.48 గంటలకు మజీద్‌బండా జంక్షన్ నుంచి బయటకు వెళ్తున్న దృశ్యాలను పోలీసులు సేకరించారు. సీసీ ఫుటేజీని బట్టి మృతురాలు స్థానికురాలై ఉంటుందనే అనుమానంతో బైక్‌ను పట్టుకునేందుకు పోలీసులు ఆదివారం తెల్లవారుజామున గచ్చిబౌలి సమీపంలోని సిద్ధిక్‌నగర్, అంజయ్యనగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుడి ఫొటో, బైక్ ఫొటోను అందరికీ చూపిస్తూ ఆరా తీశారు. అయినా ఎటువంటి క్లూ లభించలేదని తెలిసింది. ఈ ప్రాంతంలో ఎక్కువగా మహారాష్ట్ర, అస్సాంవాసులే ఉండటంతో హంతకులు, మృతురాలు ఈ రెండు రాష్ట్రాలకు చెందినవారై ఉంటారని భావిస్తున్నారు.



మజీద్‌బండా జంక్షన్‌లోని సీసీ కెమెరాల్లో రికార్డయిన అనుమానితుల దృశ్యం

వాహనం నంబర్ ఆధారంగా..

బైక్ నంబర్‌ను సేకరించి దాని ఆధారంగా విచారణ జరుపుతున్నారు. వాహనం రిజిస్ట్రేషన్ వివరాల మేరకు యజమాని విచారించగా తాను ఆ బైక్‌ను 2007లో కొని ఆ తర్వాత అమ్మానని చెప్పాడు. ఆ తర్వాత బైక్ మరో ముగ్గురు నలుగురి చేతులు మారినట్టు తేలింది. చివరగా ఎవరు వాడారో తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ బైక్‌పై 2014 నుంచి 2017 జూలై వరకు ఎనిమిది ట్రాఫిక్ ఉల్లంఘనల చాలాన్లు ఉన్నాయి. చివరిది మియాపూర్ పీఎస్ పరిధిలో హెల్మెట్ లేకపోవడంతో పోలీసులు పట్టుకొని నేరుగా చలాన్ విధించారు. శవాన్ని తరలించేటప్పుడు వాహనం రంగును, నంబర్‌ప్లేట్ మార్చే అవకాశాలు ఉన్నాయని పోలీసులు భావిస్తున్నారు. ఘటన వెలుగులోకి రావడంతో బైక్‌ను విచ్ఛిన్నం చేసే అవకాశాలు సైతం ఉన్నాయన్నారు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్టు అనుమానిస్తున్నారు. మరోవైపు ముగ్గురు అనుమానితులను పోలీసులు విచారిస్తున్నట్టు సమాచారం. రెండు రోజుల్లో కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నదని సీనియర్ అధికారి తెలిపారు.

8.05 కోట్లతో స్టేట్ ఫుడ్ లేబొరేటరీ ఆధునికీకరణ

అంబర్‌పేట, నమస్తే తెలంగాణ: ఆహార పదార్థాల కల్తీని నివారించేందుకు హైదరాబాద్ నాచారంలోని స్టేట్ ఫుడ్ లేబొరేటరీని మరింత ఆధునికీకరించనున్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం రూ.8.05 కోట్ల నిధులను విడుదల చేసింది. ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ నిధులను మంజూరు చేసిందని ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శంకర్ తెలిపారు. ఈ నిధులతో ల్యాబ్‌లో అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే కమిటీ టెండర్ల ప్రక్రియను ముగించనున్నదన్నారు. ఇవి ఏర్పాటైతే ఎలాంటి కల్తీనైనా ఇట్టే కనిపెట్టవచ్చన్నారు.

9.33 లక్షల విలువైన బంగారం పట్టివేత

శంషాబాద్: ఓ ప్రయాణికుడు అక్రమంగా తీసుకొస్తున్న 300 గ్రాముల బంగారాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో ఆదివారం కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. జెడ్డా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ ప్రయాణికుడు తన ప్యాంట్‌లో ఉన్న ప్రత్యేక జేబులో నాలుగు బంగారు గాజులను తీసుకొచ్చినట్టు గుర్తించారు. అతడిపై కస్టమ్స్ అధికారులు అనుమానం రావడంతో తనిఖీ చేయగా, రూ.9.33 లక్షల విలువైన 30 తులాల బంగారం లభించింది.





హైదరాబాద్ రెడ్‌హిల్స్ డివిజన్ బజార్‌ఘాట్ పరిధిలోని ఫిన్ హోండా షోరూంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో షోరూంలో ఉన్న 40 వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. కోటి రూపాయల వరకు నష్టం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.
- బేగంబజార్



హైదరాబాద్ రోడ్లపై ఎలక్ట్రికల్ బస్సులు

48 వాహనాలను తేనున్న ఆర్టీసీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నగర రోడ్లపై ఎలక్ట్రికల్ బస్సులు పరుగులు తీయనున్నాయి. కాలుష్య నివారణ, పర్యావరణ హితంలో భాగంగా బ్యాటరీతో నడిచే బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేయనున్నది. మొదటిదశలో 48 బస్సులను కొనుగోలు చేసి సిటీ బస్సులుగా తిప్పాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ఈ నెల 15న ఆర్టీసీ అధికారులు సమీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఎలక్ట్రికల్ వాహన పాలసీ తీసుకొస్తున్న క్రమంలో ఆర్టీసీ కూడా బ్యాటరీతో నడిచే బస్సులను కొనుగోలు చేస్తున్నది. ఇప్పటికే ఎలక్ట్రికల్ వాహనాలకు రాయితీలుంటాయని కేంద్రం ప్రకటించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పన్ను రాయితీ ఇస్తామని చెప్పడంతో వీటిని తీసుకురావాలని నిర్ణయించారు. రూ.2 కోట్ల విలువైన బస్సును 50 శాతం రాయితీతో అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే బెంగళూరులో ఎలక్ట్రికల్ బస్సులు విజయవంతంగా నడుస్తున్న నేపథ్యంలో ఇక్కడ కూడా ఆదరణ లభిస్తుందని భావిస్తున్నారు. కాలుష్యాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఇప్పటికే ఆర్టీసీ సీఎన్జీ వాహనాలను నగరంలో తిప్పుతున్నది. డీజిల్ బస్సులతో పోలిస్తే ఈ వాహనాలు కాలుష్యం విషయంలో మెరుగైన ఫలితాలిస్తుండటంతో ఎలక్ట్రికల్ వాహనాలు మరింత ప్రయోజనకరంగా ఉంటాయని అధికారులు నిర్ణయించారు. ఒక్కసారి పూర్తిగా చార్జి చేస్తే 200 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టే ఎలక్ట్రికల్ వాహనాలు మెట్రోకు అనుసంధానించడంతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి నడిపించనున్నట్టు వివరించారు.

కల్తీ.. ఇక చల్తానయ్

ఆహార కల్తీ తనిఖీ సంచార వాహనంతో క్షేత్రస్థాయిలో తనిఖీలు

నేడు కీసరలో సేవలు ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆహార కల్తీకి చెక్ పెట్టేందుకు ఆహార కల్తీ తనిఖీ సంచార వాహనంతో క్షేత్రస్థాయికే వెళ్లి తనిఖీలు జరిపి కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కల్తీపై ప్రజలను చైతన్యపర్చేందుకు వైద్యారోగ్యశాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నది. ఈ సంచార వాహన సేవలు కీసరలో సోమవారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) ఆధ్వర్యంలో ఏర్పాట్లుచేశారు. వాహనంలోనే ఆహార పదార్థాలను పరీక్షించి, కల్తీ అని తేలితే బాధ్యులపై అక్కడే చర్యలు చేపట్టాలన్నదే ఈ వాహన ప్రధాన ఉద్దేశం. ఇందులో పాలు, వంటనూనెలు, నెయ్యి , మసాలాలు తదితర 54 రకాల ఆహార పదార్థాల నాణ్యతను పరీక్షించొచ్చు. ఈ వాహన సేవలను జిల్లాలవారీగా విస్తృతం చేయనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఐపీఎం అధికారులు వాహనం ద్వారా ప్రజలకు ఆహార కల్తీపై అవగాహన కల్పించనున్నారు. మరిన్ని వాహనాలకోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు.

వాహనం ప్రత్యేకతలు

ఈ వాహనం విలువ రూ.50 లక్షలని, ఆహార తనిఖీ, వాహన నిర్వహణకు కేంద్రం ఏటా రూ.5 లక్షలు అందిస్తుందని ఐపీఎం డైరెక్టర్ కే శంకర్ తెలిపారు. వాహనంలో మైక్రోబయోలజీ సాంకేతిక నిపుణులు, ఆహార పరిరక్షణాధికారి, ఇతర సిబ్బంది ఉంటారన్నారు. నిల్వ ఆహార పదార్థాలను, ఆహారంలో కలిపే రంగులను పరీక్షించి అప్పటికప్పుడే ఫలితాలను ప్రకటిస్తారన్నారు. వాహనాన్ని జిల్లాలకు పంపేందుకు షెడ్యూల్ రూపొందించామన్నారు. సాంకేతిక సిబ్బందిని ఏర్పాటుచేసుకొని సోమవారం నుంచి సేవలు ప్రారంభిస్తామన్నారు. 12న కీసరతోపాటు పరిసర గ్రామాల్లో తనిఖీలు చేస్తామని వివరించారు.

Life is Beautiful

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
సోమవారం 12 ఫిబ్రవరి 2018

వైకల్యాన్ని ఓడించి.. అనుకున్నది సాధించి

శ్రమించాలంటే శరీరం సహకరించాలి. సాధించాలంటే తపన ఉండాలి. గమ్యం చేరాలంటే అడుగు ముందుకేయాలి. ఇవన్నీ సన్మతి చేయలేదు. కానీ అనుకున్నది సాధించింది. ఎలా?



సన్మతి అందరమ్మాయిల్లా కాదు. ప్రత్యేకం. వైకల్యం అని చెప్పలేం. ఎందుకంటే ఆమె ముందు వైకల్యం కూడా మోకరిల్లింది. అడుగు తీసి అడుగు కూడా ముందుకు వేయలేని ఆమె అడుగు గమ్యాన్ని ముద్దాడింది. పాఠశాలలో చదివేటప్పుడు ఫీజుల్లో రాయితీ కావాలంటే ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని చెప్పారు. ఇంటికెళ్లి తల్లిదండ్రులకు చెప్పింది సన్మతి. అప్పుడు వాళ్లు జిల్లా కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించి ధ్రువీకరణ పత్రాన్ని కూడా పొందలేని పరిస్థితి. అలాంటి పరిస్థితుల నుంచి ఎన్నో ఒడిదుడుకులు వైకల్యం వల్ల ఏ పని చేయాలన్న కష్టం అయ్యేది. అప్పుడు అనుకున్నదో మాట. ఆ నిర్ణయమే సన్మతిని వార్తల్లో వ్యక్తిగా నిలిపింది. పదిమందిలో ప్రత్యేక మహిళగా నిలబెట్టింది. స్వశక్తి బతుకుతూ పదిమందికి చేయూతనివ్వాలనుకున్నది. తనలాంటి దివ్యాంగులకు అండగా నిలబడాలనుకున్నది. 2009లో డిప్లొమా పూర్తి చేసింది. చదువు పూర్తవగానే కర్ణాటకలోని బోర్‌గావ్‌లో టీచర్‌గా ఉద్యోగంలో చేరింది. గణితం, ఇంగ్లీష్, కన్నడ వంటి భాషలను మూడో తరగతి పిల్లలకు భోదించేది. అటు చదువులు చెప్తూనే బెంగళూరుకు చెందిన సోలార్ సంస్థకు బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా కూడా పనిచేసింది. ఓ వైపు పని చేస్తూనే కర్ణాటక యూనివర్సిటీలో సోషియాలజీలో మాస్టర్ పూర్తి చేసింది. ప్రస్తుతం బోర్‌గావ్‌వాడి ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తుంది. ప్రతి రోజూ 300 మంది చిన్నారుల పాఠాలు చెప్తున్నది. తనలాంటి దివ్యాంగులకు ఉద్యోగాలు ఇప్పించడం కోసం ప్రయత్నిస్తున్నది.

వంట చిట్కాలు



- ఆకు కూరలు వండేటప్పుడు ఒక స్పూన్ చక్కెర కలిపిన నీటిలో నానబెట్టి వండితే రుచి అదిరిపోతుంది.
- పూరీల పిండిని సిద్ధం చేసేటప్పుడు నీటిలో నానబెట్టిన బ్రెడ్ ముక్కలను కలిపి చేస్తే కరకరలాడుతాయి.
- కూరగాయలు, పండ్లను కాసింత వెనిగర్ కలిపి, చల్లటి నీటిలో కొన్ని నిమిషాలుంచితే క్రిములు చనిపోతాయి.



సక్సెస్ మంత్ర

ఆమె తన లక్ష్యాన్ని నిర్దేశించుకోవడంలో విఫలమయ్యానని ఏనాడూ బాధపడలేదు. కానీ ఆ తర్వాత ట్రిలియన్ డాలర్ల సంస్థకు సీఈవో అవుతానని మాత్రం ఊహించలేదు. ఒకనాడు బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో టైంపాస్ కోసం చదివిన వ్యాసం చివరలో ఉన్న 'మీరు ఈ రోజు ఏం చేయాలనుకుంటున్నారో ఈ రోజే చేయండి. రేపటి కోసం వేచి చూడకండి' అనే వాక్యం ఆమెను ఆకర్షించింది. యుక్తవయస్సులో అనేక ఆలోచనలతో ఉన్న ఆమెలో ఆ మాట మంత్రదండంగా పనిచేసింది. అప్పడే అమె జీవిత ప్రయాణం పూర్తిగా మారిపోయి ఒక ట్రాక్ మీదకు వచ్చింది. పూర్తి బిజినెస్ ఉమన్‌గా తనను తాను తీర్చిదిద్దుకోవడానికి అవకాశం ఏర్పడింది. పట్టుదలతో 2.1 ట్రిలియన్ డాలర్ల కంపెనీకి సీఈఓగా పనిచేసే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. అంతేకాదు అంతర్జాతీయ వ్యాపార రంగంలో అత్యంత శక్తివంతమైన మహిళగా గుర్తింపునూ సొంతం చేసుకున్నారు. అనేక అంతర్జాతీయ సంస్థల్లో పనిచేసి ద కంప్లీట్ బిజినెస్ ఉమన్‌గా పేరుగాంచారు. ఆమె అమెరికన్ కంపెనీ జెపి మోర్గాన్ సీఈవోగా సేవలందిస్తున్న కల్పనా మోర్పరియా.

సాధారణ జీవితం.. అసామాన్య విజయం

కల్పనా మోర్పరియా

కల్పనా మొర్పారియా.. 2.1 ట్రిలియన్ డాలర్ అమెరికన్ కంపెనీ జెపి మోర్గాన్ భారత చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్. ప్రపంచవ్యాప్తంగా అరవై దేశాల్లో 140 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థ జెపి మోర్గాన్. కల్పన.. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, అసెట్ మేనేజ్‌మెంట్, ట్రెజరీ సర్వీసెస్, ప్రిన్సిపల్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ వంటి పోర్ట్‌ఫోలియోలను నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ వ్యాపారంలో రాణిస్తున్న యాభై మంది అత్యంత శక్తివంతమైన మహిళలలో కల్పన ఒకరిగా ఫార్చ్యూన్ పత్రిక గుర్తించింది. కల్పన ఈ స్థాయిలో నిలవడానికి చేసిన కృషి అందరికీ ఉత్తేజితంగా, ఆకట్టుకునేదిగానూ ఉంటుంది.

కష్టాలను అధిగమించి..

కల్పనా మోర్పారియా 1949 మే 30 న లోహానా కుటుంబంలో భవాండాస్, లక్ష్మిబెన్ తన్నా దంపతులకు జన్మించారు. కల్పన తన ముగ్గురు తోబుట్టువులలో పిన్న వయస్కురాలు. ఆమె యుక్తవయస్సులో ఉండగానే తండ్రి కాలం చేశారు. దీంతో ఆమె తన చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టడంతో పాటు ఎలాంటి లక్ష్యాలు నిర్దేశించుకునే అవకాశం కలుగలేదు. ఆ తర్వాత 16 సంవత్సరాల వయస్సులో ఆమె ఉన్నత విద్యను పూర్తి చేసి సోఫియా కాలేజ్ ఫర్ ఉమెన్‌లో చేరి 1979లో కెమిస్ట్రీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. డిగ్రీ అయ్యాక కొంతకాలం టీచర్‌గా పని చేశారు. ఆ తర్వాత కొంతకాలం విరామం తీసుకుని ఎలాంటి బెరుకు లేకుండా మాట్లాడే విధానాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ఇంటి బాధ్యతలు తన మీద పడినప్పటికీ వాటిని తన భుజాలపై మోస్తూనే తన భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు.

ఉపాధి చూసిన న్యాయవిద్య

ఆమె సోదరి పరుల్ థాకెర్ న్యాయవిద్య అభ్యసించి ఒక న్యాయ సంస్థలో పనిచేస్తుండడంతో కల్పన కూడా ఆ మార్గంలోనే వెళ్లాలని నిర్ణయించుకుని లా చదివేందుకు కళాశాలలో చేరారు. తన న్యాయవిద్య పూర్తిచేసి 1974లో మటుభాయ్ జమీయాత్రం అండ్ మాడన్ అనే న్యాయ సంస్థలో చేరారు. అదే సమయంలో ఏదైన పెద్ద సంస్థలో చేరి తన కెరీర్‌ను తీర్చిదిద్దుకోవాలని సంకల్పించారు. అదే సమయంలో ఐసీఐసీఐ తన సొంత లీగల్ విభాగాన్ని కలిగి ఉందని అందులో ప్రయత్నించమని కొంత మంది చెప్పినప్పటికీ అంతగా పట్టించుకోలేదు. కానీ ఆ బస్సు ప్రయాణంలో చదివిన ఆర్టికల్‌తో ఇంటికి రాగానే ఐసీఐసీకి దరఖాస్తు పంపింది. మూడు నెలల తర్వాత అక్కడి నుంచి సమాచారం వచ్చింది. 1975లో తొలిసారి ఇంటర్వ్యూకు హాజరైన కల్పన ఆ తర్వాత అనేక రౌండుల ఇంటర్వ్యూలు ఎదుర్కొన్నారు. పది నెలల తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో మేనేజ్‌మెంట్‌ను సూటిగా ప్రశ్నించారు. 'నేను చాలా కాలంగా ఈ ఉద్యోగం కోసం వేచి ఉన్నాను. నేను దాన్ని పొందుతున్నానా? లేదా? ఒక వేళ కాదనుకుంటే మేం మరో మార్గం చూసుకుంటాం' అని నిలదీశారు. ఆ నిష్పాక్షికత మేనేజ్‌మెంట్‌ను ఆశ్చర్యపరిచింది. అదే సమయంలో 'మీరు ఈ ఉద్యోగాన్ని పొందుతున్నారు'అనే సమాధానం కూడా వచ్చింది.

పదోన్నతులతో పతాక స్థాయికి

ఐసీఐసీలో అనేక బాధ్యతలను కల్పనకు అప్పగించారు. 1991లో అమెరికాలో మార్కెట్ల అధ్యయనం చేయడానికి ఆమెను అమెరికాకు పంపారు. అక్కడ ఆమె న్యూయార్క్ డేవిడ్ పోల్క్, వార్డ్‌వెల్ వద్ద మూడు నెలలపాటు పనిచేశారు. అమెరికాలో ఐసీఐసీఐ బ్యాంక్ న్యూయార్క్ ఎక్చ్సేంజ్‌లో లిస్ట్ అవుతున్న సమయంలో కల్పన అక్కడే ఉండి స్వయంగా పర్యవేక్షించారు. కల్పనా 1975 నుండి 1994 వరకు ఐసీఐసీఐ న్యాయ విభాగంలో పనిచేశారు. 1996లో ఆమె జనరల్ మేనేజర్‌గా నియమియామకం పొందారు. అప్పుడు ఆమె లీగల్, ప్రణాళిక, ట్రెజరీ, కార్పొరేట్ కమ్యూనికేషన్ విభాగాలకు బాధ్యత వహించారు. 1998లో ఐసీఐసీఐ సీనియర్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందారు. ఆ తర్వాత మే 2001లో ఐసీఐసీఐ డైరెక్టర్ల బోర్డులో చేరారు. మే 2002లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మోర్పరియాను నియమించారు. మళ్ళీ 2006 ఏప్రిల్‌లో డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా, అనంతరం జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. అప్పుడు ఆమె టోకు, రిటైల్, గ్రామీణ, అంతర్జాతీయ బ్యాంకింగ్, స్ట్రాటజీ, రిస్క్ మేనేజ్‌మెంట్, ఆడిట్, లీగల్, ఫైనాన్స్, ట్రెజరీ, సెక్రెటరీ, హ్యూమన్ రీచర్చ్ మేనేజ్‌మెంట్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్, లావాదేవీ ప్రాసెసింగ్‌లతో కూడిన కార్పొరేట్ సెంటర్‌కు బాధ్యత వహించారు. జూన్ 1, 2007 నుండి ఐదేళ్ల కాలం వరకు ఆమె చీఫ్ స్ట్రాటజీ అండ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్‌గా పనిచేశారు.



జేపీ మోర్గాన్‌లో చేరిక.

ముప్పైమూడు సంవత్సరాల పాటు ఐసీఐసీఐలో పనిచేసిన మోర్పారియా ఆ తర్వాత అమెరికాకు చెందిన జేపీ మోర్గాన్ సంస్థలో ఇండియా సీఈవోగా చేరారు. నేటికి ఆ సంస్థకు సేవలందిస్తున్నారు. అలా అంచెలంచెలుగా ఎదిగిన కల్పన నేడు జేపీ మోర్గాన్ సీఈఓగా సేవలందిస్తున్నారు. అదే సమయంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, బెన్నెట్ అండ్ కోల్మన్, టాటా కన్సల్టెన్సీవారి సీఎంసీ లిమిటెడ్‌లకు స్వతంత్ర డైరెక్టర్‌గా ఉన్నారు. హిందూస్థాన్ యునీ లీవర్ (హెచ్‌యూఎల్)కు తొలి మహిళ డైరెక్టర్‌గా పగ్గాలు చేపట్టారు.

వ్యక్తిగత హాబీలు..

మోర్పారియా తన బిజినెస్‌లో బిజీగా ఉన్నప్పటికీ తనకున్న హాబీలను మాత్రం వదలలేదు. కల్పనకు పాత హిందీ పాటలు, బాలీవుడ్ సినిమాలంటే ఇష్టం. అలాగే బిగ్ బి, షారుక్. హృతిక్‌లు ఇష్టమైన నటులు. కేకేకెజి (కభి ఖుషీ కబి గమ్) తన అభిమాన చిత్రం. సంజీవ్ కుమార్, అమితాబ్ నటించిన త్రిశూల్ కూడా ఇష్టమైన చిత్రం. పండుగల సమయంలో కుటుంబ సభ్యులు అందరూ ఒకే చోట కూర్చుని కార్డ్స్ ఆడుతుంటారు. ఆమె శ్రీనాథ్‌జీ భక్తురాలు. పాక కళ నేర్చుకోవడంతో వంటలు బాగా చేస్తారు. ఒక రకంగా ఆమె ఈ రంగంలో చాలా నిపుణురాలు. ప్రయాణాలు, షాపింగ్ అంటే కూడా ఇష్టపడుతారు. వ్యాపార పర్యటనలో కూడా సమయం దొరికితే షాపింగ్ కోసం కొంత సమయం కేటాయిస్తారు.




సామాజిక సేవలోనూ..

కల్పన బిజినెస్ లైఫ్‌లో బిజీగా ఉన్నప్పటికీ ఎయిర్‌టెల్ సంస్థకు చెందిన సునీల్ మిట్టల్ నిర్వహిస్తున్న భారతీ ఫౌండేషన్ కార్యకలపాలను కూడా ఆమె చూస్తున్నారు. ఈ సంస్థ ద్వారా ఇది పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాలలో పాఠశాలల నిర్మాణానికి కృషి చేస్తున్నారు. అలాగే నిర్లక్ష్యానికి గురైన పాఠశాలల పునరుద్ధరణకు కృషి చేస్తున్నారు. ఫౌండేషన్ 250కి పైగా పాఠశాలలను దత్తత తీసుకుంది.

ఫిట్స్‌కి ఆపరేషన్ ఉందా?


అడుగండి చెబుతా



నా మిత్రుడికి 24 సంవత్సరాలు. గత 14 ఏళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. చాలా మంది డాక్టర్లకు చూపించి, ఎన్ని రకాల మందులు వాడినా ఫలితం లేదు. వారానికి 4-6సార్లు ఫిట్స్ వస్తాయి. ఈమధ్య ఫిట్స్‌కు ఆపరేషన్ చేసి తగ్గిస్తున్నారని స్నేహితుల ద్వారా తెలుసుకున్నాను. ఆపరేషన్ ద్వారా ఫిట్స్ తగ్గించేందుకు వీలవుతుందా?
- కిషన్, జగిత్యాల

మీ స్నేహితుడి సమస్యను ఎపిలెప్సీ అంటారు. ఇది సర్వసాధారణమైన సమస్య. వందమందిలో ఒకరికి ఉంటుంది. అందులో మూడోవంతు వ్యాధిగ్రస్థులకు ఎన్ని మందులు వాడినా ఫలితం ఉండదు. ఇలాంటప్పుడు శస్త్రచికిత్స ద్వారా మంచి ఫలితం ఉంటుంది. ఫిట్స్ ఉన్న ఆ పేషెంట్ శస్త్రచికిత్సకు సరిపోతాడో లేదో ముందుగా మెదడుకు ఎంఆర్ఐ, ఎపిలెప్సీ ప్రొటోకాల్ వంటి పరీక్షలు చేసి తెలుసుకుంటారు. మొదట ఎంఆర్ఐ తీసిన తరువాత వీడియో ఈఈజీ పరీక్ష చేస్తారు. దీని కోసం పేషెంట్‌ను 24 గంటలు హాస్పిటల్‌లో ఉంచి, ఈఈజీ యంత్రంతో గమనిస్తారు. దాని ద్వారా అతనిలో వచ్చే మార్పులను ఆ వీడియోలో రికార్డు చేస్తారు. ఈ విధంగా ఎంఆర్ఐ, వీడియో ఇఇజి పరీక్ష రిపోర్టుల ఆధారంగా పేషెంట్‌కు ఆపరేషన్ సరిపోతుందో లేదో తెలుసుకోవచ్చు. ఆపరేషన్ చేయడం వల్ల చాలామందిలో అతి తక్కువ వ్యవధిలో ఫిట్స్ పూర్తిగా తగ్గిపోతాయి.

ఫిట్స్ వచ్చినప్పుడు అకస్మాత్తుగా పడిపోవడం, దానివల్ల తల, వెన్నెముకకు గాయాలు కావడం సర్వసాధారణం. ఎపిలెప్సీకి వాడే మందుల వల్ల పేషెంట్లలో చురుకుదనం తగ్గుతుంది. ఇలాంటప్పుడు మందులు ఆపేసి, ఆపరేషన్ చేయడం వల్ల ఫిట్స్ తగ్గడమే కాకుండా వారిలో ఉత్సాహం పెరిగి, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మీరు కూడా మీ మిత్రుడిని మంచి ఎపిలెప్టాలజిస్ట్ దగ్గరకు తీసుకువెళ్లండి. అతను ఆపరేషన్‌కు సరిపోతాడనుకుంటే ఆపరేషన్ చేయించడమే మంచిది.



డాక్టర్ టివిఆర్‌కె మూర్తి
సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్
కేర్ హాస్పిటల్స్, హైదరాబాద్

శాకాహారం ప్రమాదమా?

మాంసాహారం శరీరాన్ని దెబ్బ తీస్తుంది.. శాకాహారం తినాలని చాలామంది చెప్తుంటారు. కానీ ఇప్పడొచ్చిన చిక్కేంటంటే.. శాకాహారమూ ప్రమాదమట. అదెలా?

బరువెక్కడం.. రోగాల బారిన పడటం.. సౌందర్యం దెబ్బతినడం వంటి సమస్యల నుంచి బయటపడాలంటే మాంసాహారం తగ్గించాలని నిపుణులు చెప్తుంటారు. శాకాహారం ఎక్కువగా తీసుకోవాలంటారు. కొవ్వులను తగ్గించడం.. కొలెస్ట్రాల్‌ను నిరోధించడమే కాకుండా మెదడు చురుగ్గా పనిచేయాలంటే కూరగాయలే ఉత్తమం అని సలహా ఇస్తుంటారు. కానీ అతిగా కూరగాయలు అసలుకే ఎసరు తీసుకొస్తాయంటున్నారు హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన నిపుణులు. ఏకరీతి కూరగాయల వల్ల పెద్దగా పోషక ప్రయోజనమేమీ ఉండదట. వారానికి సరిపడా కూరగాయలు తెచ్చుకుంటాం.. అవి అయిపోగానే మళ్లీ వారానికి సరపడా తెచ్చుకుంటాం. కూరగాయల..ఆకు కూరల సంఖ్య మారుతుందే తప్ప.. వాటి స్థానం ఎప్పటికీ ఒకేలా ఉంటుంది. తిన్నవే మళ్లీ మళ్లీ తినడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అందవట. శాకాహారపు వేపుళ్లు ఎక్కువగా తినడం వల్ల శరీరానికి ప్రమాదమని నిపుణుల అభిప్రాయం. క్రమం తప్పిన శాకాహారం తీసుకోవడం వల్ల మొదటగా తల వెంట్రుకలు రాలిపోతాయట. తల వెంట్రుకల గట్టిదనానికి ఏకరీతి ఆహారం కాకుండా అన్ని రకాలా పోషకాలున్న ఆహారం తీసుకోవడం మంచిది. శాకాహారం వల్ల మూడ్ మారుతుందట. శాకాహారం వల్ల 25శాతం గుండెకు మంచి జరిగితే 35 శాతం ప్రమాదకరమని సర్వేలు చెప్తున్నారు. ఎక్కువగా ప్రతికూల ధోరణితో ఆలోచిస్తారట. కాబట్టి తక్కువ మోతాదులో మాంసాహారం తీసుకోవడం శ్రేయస్కరమట. ధాన్యాలు.. పండ్లు.. నట్స్.. లెగ్యూమ్స్ వంటివి శరీరానికి మంచివని సూచిస్తున్నారు.



మోచేతి రంగును మార్చేయండిలా..!



కొంతమంది మంచి కలర్‌ఫుల్ డ్రెస్ వేసుకొని అందంగా తయారైనా.. మోచేతులు నల్లగానే కనిపిస్తాయి. నల్లబడిన మోచేతుల కారణంగా మంచి డ్రెస్ వేసుకోలేకపోతుంటారు. ఆ సమస్యతో బాధపడేవారు ఈ చిట్కాలను ఓసారి ప్రయత్నించండి.

- పిడికెడు పుదీనా ఆకుల్ని అరకప్పు నీటిలో మరిగించాలి. ఆ నీటిలోనే అరచెక్క నిమ్మకాయను పిండాలి. ఆ మిశ్రమాన్ని దూదితో మోచేతులకు పట్టించి, 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి.
- ఆలివ్ నూనె, చక్కెర కలిపి పేస్టులా తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఐదు నిమిషాల పాటు మోచేతులపై రుద్ది, కొంచెం సబ్బు నీళ్లతో కడుగాలి.
- వంటసోడా, పాలను కలిపి పేస్టులా కలుపాలి. దానిని మోచేతులకు పట్టించాలి. 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి.
- ఒక చెంచా కొబ్బరినూనె, అరచెంచా నిమ్మరసాన్ని కలిపి మోచేతులకు రాయాలి. 15 నిమిషాల తర్వాత టిష్యూతో శుభ్రంగా తుడువాలి.
- రెండు చెంచాల పెరుగు, వెనిగర్ కలిపి మోచేతులకు రాయాలి. 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేయాలి.
- రెండు చెంచాల నిమ్మరసం, మూడు చెంచాల శనగ పిండిలో కలుపాలి. ఆ మిశ్రమాన్ని మోచేతులపై రాసి, ఎండిపోయిన తర్వాత నీటితో కడుగాలి.

ప్యాడ్ ఉమన్!



సూపర్‌మ్యాన్, స్పైడర్‌మ్యాన్, బ్యాట్‌మ్యాన్, ప్యాడ్‌మ్యాన్ పేర్లన్నీ వినే ఉంటారు. ఇప్పుడు వార్తల్లో సరికొత్త పేరు ప్యాడ్ ఉమన్ వినిపిస్తున్నది. ఇది సినిమా పేరు కాదు. ప్యాడ్‌వాలీ దాది కహానీ.

దేశమే కాదు.. ప్రపంచమంతా ప్యాడ్‌ల మీద స్పందిస్తున్నది. అటు ప్యాడ్ మ్యాన్ సినిమా హిట్ అయింది. ప్యాడ్ క్యాంపెయిన్ హీట్ ఎక్కింది. సానిటరీ న్యాప్‌కిన్స్ గురించి జరుగుతున్న చర్చలో భాగంగా ప్యాడ్‌వాలీ దాది ఇప్పుడు వార్తల్లో వ్యక్తిగా నిలిచింది. సూరత్‌కు చెందిన అరవై రెండేళ్ల మీనా మెహతా ప్యాడ్ వాలీ దాదిగా బిరుదు దక్కించుకున్నది. 2012 సంవత్సరం నుంచి సానిటరీ న్యాప్‌కిన్స్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న తోచినకాడికి న్యాప్‌కిన్స్ పంచుతున్నది. నెలసరి సమస్యలతో బాధపడే అమ్మాయిల్లో చైతన్యం కల్పిస్తున్నది. అవి వాడాల్సిన ఆవశ్యకతను వివరిస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో మ్యాజికల్ కిట్‌ల పేరుతో ఓ కిట్‌ను అందజేస్తున్నది. ఈ కిట్‌లో న్యాప్‌కిన్స్, షాంపూలు, సబ్బులు ఉంటాయి. మీనా మెహతా సుధా మూర్తిని ఆదర్శంగా తీసుకొని ఈ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆమె నివసిస్తున్న ప్రాంతంతో పాటు చుట్టుపక్కల బస్తీల్లో కూడా ఈ కిట్‌లు పంచుతున్నది. దాతల, బ్యాంక్ సహకారంతో కొంత డబ్బును సేకరించి మనుని ఫౌండేషన్ పేరుతో ఓ ట్రస్ట్ ఏర్పాటు చేసింది. మనుని సంస్థ ద్వారా న్యాప్‌కిన్స్ వాడకం.. దాని లాభనష్టాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. న్యాప్‌కిన్స్ వాడకంపై ప్రచారం ఊపందుకున్న క్రమంలో ప్యాడ్‌వాలీ దాది మళ్లీ వార్తల్లోకి వచ్చింది.

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 12 ఫిబ్రవరి 2018



జాతీయ కోటాలోకి తెలుగు రాష్ట్రాలు

ఎట్టకేలకు తెలుగు రాష్ట్రాలు వైద్యకోటాలో నేషనల్ పూల్‌లో చేరాయి. దేశంలోని వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో ఒకే పరీక్ష నీట్‌ను నిర్వహిస్తున్న విషయం విదితమే. దీంతో ఇప్పటివరకు ఆర్టికల్ 371 డీ కారణంగా నేషనల్ పూల్‌లో చేరలేదు. ఈ ఆర్టికల్ వల్ల తెలుగు రాష్ట్రాల వారికి ఇతర రాష్ట్రాల్లో సీట్లు ఇవ్వరు. ఇతరులకు ఈ రెండు రాష్ట్రాల్లో సీట్లు ఇవ్వరు. జాతీయస్థాయిలో నిర్వహించే పరీక్షలో విద్యార్థులకు నష్టం వాటిల్లుతుండటంతో రెండురాష్ట్రాలు జాతీయ కోటాలో చేరుతామని కేంద్రాన్ని కోరాయి. ఈసారి నుంచి రెండురాష్ట్రాలకు జాతీయ కోటాలో స్థానం లభించింది. దీంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు 15 శాతం కోటా కింద అదనపు సీట్లు వస్తాయి. రెండు రాష్ట్రాల్లో 450 సీట్లు జాతీయ కోటాకు వదులుకున్నా సుమారు 1100 సీట్లు అదనపు కోటాలో తెలుగు విద్యార్థులకు లాభం చేకూరే అవకాశాలు ఉన్నాయి.

పరీక్షల్లో 'ఇంగ్లిష్'తో ఈజీగా

పోటీ పరీక్షల్లో ఇంగ్లిష్‌కు అత్యంత ప్రాధాన్యం ఉంది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) నిర్వహించే సీజీఎల్, సీహెచ్ఎస్ఎస్ వంటి వివిధ స్థాయిల ఉద్యోగాలతోపాటు బ్యాంకింగ్ ఉద్యోగాల భర్తీ, బీమా రంగ పరీక్షల్లో అలాగే వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పరీక్షల్లోనూ ఇంగ్లిష్ తప్పనిసరిగా ఉంటుంది. అన్ని స్థాయి పరీక్షల్లో అంశాలు ఒకటే అయినా అడిగే తీరు మాత్రం భిన్నంగా ఉంటుంది. గ్రామర్, వొకాబులరీ, కాంప్రహెన్షన్ అంశాలే అన్ని పరీక్షల్లో ఉంటాయి. అయితే ప్రశ్నల కాఠిన్యం పరీక్ష స్థాయిని బట్టి ఉంటుంది. గ్రాడ్యుయేట్లకు నిర్వహించే పరీక్షల్లో ప్రశ్నపత్రం కొంతవరకు కఠినంగా ఉంటుంది.



గ్రామర్ నేర్చుకోండిలా..

గ్రామర్ ఎక్కువగా నియమాలపై ఆధారపడి ఉంటుంది. అయితే వీటి అన్వయానికి అభ్యర్థులు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంగ్లిష్‌పై పట్టు రావాలంటే కేవలం గ్రామర్ నియమాలు చదివితే సరిపోదు. వాటిని సందర్భోచితంగా ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలి. ఇంగ్లిష్ వాక్య నిర్మాణం ఆధారంగా చదువుకుంటే తేలికగా ఉంటుంది. ఇంగ్లిష్‌లో వాక్య నిర్మాణం (సబ్జెక్ట్ + వెర్బ్ + ఆబ్జెక్ట్) రూపంలో ఉంటుంది. అయితే తెలుగులో వాక్య నిర్మాణం సబ్జెక్ట్ + ఆబ్జెక్ట్ + వెర్బ్ రూపంలో ఉంటుంది. ఈ మౌలికమైన తేడాను తెలుసుకుని చదువుకోవాలి. తెలుగులో ఉండే నియమాలే ఇంగ్లిష్‌కు వర్తిస్తాయి. ఉదాహరణకు ఏకవచనం, బహువచనం.. ఇలాంటివి ఉంటాయి.

- ఉదాహరణకు Academicsలో 'It is I who is responsible' అని ఉంటే, ప్రవేశ పరీక్షలో 'It is I who am responsible' అనేది కరెక్ట్ అంటారు. సబ్జెక్ట్ ఇక్కడ I ఉంది. కాబట్టి 'am' కచ్చితంగా సరిపోతుంది. దీన్నే 'I' అనేది First Person Singular Pronoun కాబట్టి దాని Verb 'am'. కానీ, 'is' కాదు. ఇలా సబ్జెక్టును పరిశీలించి దానికి సరిపోయే వెర్బ్‌ను గుర్తించే నేర్పును పెంచుకోవాలి.
- ఇంగ్లిష్‌లో ప్రిపోజిషన్‌కు సంబంధించి అభ్యర్థులు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. ఏ స్థాయి పరీక్షలో అయినా ప్రిపోజిషన్‌కు వెయిటేజీ ఉంటుంది. అలాగే ఇంగ్లిష్‌కు సంబంధించినంత వరకు టెన్సెస్ చాలా కీలకం. కాంప్రహెన్షన్‌ను అర్థం చేసుకోవడంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయి.


వొకాబులరీ

కేవలం డిక్షనరీ అర్థాలు తెలుసుకుంటే సరిపోదు. వివిధ పదాలను సందర్భోచితంగా ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలి. పదాల వాడకం ముఖ్యమైనది. అభ్యర్థులు నిత్యం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లలో వచ్చే సంపాదకీయాలు (ఎడిటోరియల్స్) చదవాలి. ఇందులో వచ్చే కొత్తగా, తెలియని పదాలు ఉంటే డిక్షనరీలో వెతకకుండా సందర్భోచితంగా ఎలా వాడుతున్నారో అర్థం చేసుకోవాలి. దీంతో పరీక్షలో వచ్చే కొత్త పదాలు కూడా అర్థం చేసుకోవడంలో ఇబ్బంది ఉండదు. సాధారణ వ్యక్తులకు వొకాబులరీ అంటే కేవలం సమానార్థాలు. అయితే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి మాత్రం వ్యతిరేకపదాలు, ఇడియమ్స్, ఫ్రేజల్ వెర్బ్స్, ప్రోవెర్బ్స్ (సామెతలు).. ఇలా అన్ని అంశాలపై పట్టుసాధించాలి. అయితే బట్టీ పట్టకుండా వీటిని వివిధ సందర్భాల్లో ఎలా ఉపయోగిస్తున్నారో అధ్యయనం చేయాలి. ఎడిటోరియల్స్ చదవడం ద్వారా అభ్యర్థులకు కరెంట్ అఫైర్స్ కూడా ఉపయోగపడుతాయి. అలాగే ఆర్థిక, రాజకీయ, శాస్త్ర-సాంకేతిక, క్రీడా, సాహిత్య తదితర అంశాలు ఉండేలా జాగ్రత్తపడాలి. ఇది కాంప్రహెన్షన్‌కు కూడా ఉపయోగపడుతుంది.

కాంప్రహెన్షన్

ఏ పోటీ పరీక్షలో అయినా కాంప్రహెన్షన్ కీలకం. అభ్యర్థికి ఇంగ్లిష్ ఎంతవరకు అర్థమవుతుందో తెలుసుకోవడానికి వీటిని ఇస్తారు. ఇది అన్నింటికంటే కష్టమైనదిగా చెప్పుకోవచ్చు. అయితే పదాలను ఎలా అర్థం చేసుకుంటున్నారో తెలుస్తుంది. ఇందులో కాంప్రహెన్షన్ రాసిన రచయిత, దాని లక్ష్యం, అది రాయడానికి కారణం, ఏం చెప్పాలనుకుంటున్నాడు, అతడి మనోభావాలు.. ఇలా ప్రశ్నలు వేసుకుంటూ చదవాలి.

- సాధమైనన్ని ఎక్కువగా ప్రాక్టీస్ చేయడంతో ఉపయోగం ఉంటుంది. బ్యాంకింగ్ పరీక్షలతోపాటు, సివిల్స్‌లో కూడా కాంప్రహెన్షన్ చాలా పెద్దదిగా ఉంటుంది. అయితే స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఎన్‌డీఏ, సీడీఎస్ తదితర పరీక్షల్లో మాత్రం ఇవి కొంతవరకు సులభంగా ఉంటాయి.
- ఆయా పరీక్షల్లో ఏ ప్రశ్నలు ఎంత లోతుగా అడుగుతున్నారో అధ్యయనం చేసి దానికి తగ్గట్టుగా ప్రిపేరవడం
- పాత పేపర్లన్నీ చదివి వాటి సమాధానాలు చూసుకోవడం
- కేవలం 'కీ' పరిశీలిస్తే సరిపోదు. ఎక్కడ తప్పులు చేస్తున్నామో గుర్తించి ఆ అంశాల్లో ప్రాథమికమైనవాటిని మరోసారి చదవాలి.
- ప్రిపరేషన్‌ను ప్రాథమిక వ్యాకరణ అంశాలతో మొదలుపెట్టి కాంప్రహెన్షన్‌కు వెళ్లాలి. అయితే పాఠశాల స్థాయి నుంచే ఇంగ్లిష్ ఉంటుంది. కాబట్టి పట్టున్న అభ్యర్థులు నేరుగా కాంప్రహెన్షన్‌ను ప్రిపేర్‌కావచ్చు.



ఆరోన్ ఎం
క్లాస్‌మేట్ అకాడమి
18002082016

సుడోకు

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

డైలీ సుడోకు 124 సమాధానం

6	5	8	1	4	3	2	9	7
9	4	3	7	8	2	1	6	5
1	2	7	5	6	9	8	4	3
2	1	9	3	5	7	6	8	4
8	7	4	2	9	6	5	3	1
3	6	5	4	1	8	7	2	9
7	9	6	8	3	5	4	1	2
5	8	1	9	2	4	3	7	6
4	3	2	6	7	1	9	5	8

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -125

			5		8	4		6
	8			9		3		
9			3		4	1		
	6	7						
2								7
						5	6	
		5	7		1			3
		8		2			1	
7		1	8		3			

తక్కువ విద్యార్హతలు ఉన్న నిరుద్యోగులకు కల్పతరువుగా కొనసాగుతున్న భారతీయ రైల్వే మరోసారి భారీగా ఉద్యోగా భర్తీకి పూనుకున్నది. పదోతరగతి, ఐటీఐ కనీస అర్హతలతో 62,907 గ్రూప్-డీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. దక్షిణమధ్య రైల్వే పరిధిలో 6523 పోస్టులు ఉన్నాయి. రాష్ట్రంలోని నిరుద్యోగులకు గొప్ప అవకాశంగా లభించిన ఈ నోటిఫికేషన్ వివరాలు మీకోసం...

మొత్తం పోస్టుల సంఖ్య: 62,907
- జనరల్-31,889, ఓబీసీ-16502, ఎస్సీ-9453, ఎస్టీ-5061

అత్యధిక పోస్టులు ఉన్న ఆర్ఆర్‌బీలు
- చండీగఢ్ ఆర్ఆర్‌బీ -7832,
- సికింద్రాబాద్ ఆర్ఆర్‌బీ-6523,
- పాట్నా ఆర్ఆర్‌బీ-5981,
- అలహాబాద్ ఆర్ఆర్‌బీ-4762,
- ముంబై ఆర్ఆర్‌బీ-4625



దక్షిణ మధ్య రైల్వే (సికింద్రాబాద్)
- మొత్తం పోస్టులు- 6,523. జనరల్-3,254, ఓబీసీ-1,723, ఎస్సీ-1,016, ఎస్టీ-530.
- **వివరాలు:** హెల్పర్ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లోని జనరల్ సర్వీసెస్-165, టీఆర్‌డీ-165, టీఆర్ఎస్-79, బ్రిడ్జ్-119, పీ అండ్ వే-188, ట్రాక్ మెయింటెనర్ గ్రేడ్ 4లో-3940, హెల్పర్ మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లోని క్యారేజ్ అండ్ వ్యాగన్-451, డీజిల్ ఎలక్ట్రికల్-54, మెకానికల్ డీజిల్-172, హెల్పర్ (ఎస్ అండ్ టీ -237, సిగ్నల్-16), హాస్పిటల్ అటెండెంట్-53, అసిస్టెంట్ పాయింట్స్‌మెన్-884 ఖాళీలు ఉన్నాయి.

62,907 గ్రూప్ -డి జాబ్స్

భారతీయ రైల్వే భారీ నోటిఫికేషన్

భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా ఉన్న 16 రైల్వే బోర్డుల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-డి పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- **భర్తీచేసే ఆర్ఆర్‌బీ బోర్డులు:** అహ్మదాబాద్, అజ్మీర్, అలహాబాద్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గోరఖ్‌పూర్, గువాహటి, కోల్‌కతా, ముంబై, పాట్నా, రాంచీ, సికింద్రాబాద్.
- **అర్హత:** పదోతరగతి లేదా ఏదైనా ఐటీఐ ట్రేడ్‌లో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2018 జూలై 1 నాటికి 18 నుంచి 31 ఏండ్ల మధ్య ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 18,000/- (7వ వేతన కమిషన్, లెవల్ -1 పే స్కేల్, అనుసరించి ఇతర సౌకర్యాలు ఉంటాయి)
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులు రూ. 500, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్, మహిళ, ట్రాన్స్ జెండర్, మైనారిటీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థులకు రూ. 250.
- **ఎంపిక:** రెండు దశల్లో జరుగుతుంది. మొదటిది రాతపరీక్ష, రెండోది ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పీఈటీ), ఈ రెండు పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు చివరగా డాక్యుమెంటేషన్ వెరిఫికేషన్ చేసి తుదిఫలితాలను ప్రకటిస్తారు.
- రాతపరీక్షను ఆన్‌లైన్‌లో (కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్- సీబీటీ) ద్వారా నిర్వహిస్తారు.
- పీఈటీ పరీక్షకు ప్రకటించిన మొత్తం ఖాళీలకు 1: 2 నిష్పత్తిలో అనుమతిస్తారు.
- జనరల్ అభ్యర్థులు 40 శాతం, ఓబీసీ/ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 30 శాతం కనీస అర్హత మార్కులను సాధించాల్సి ఉంటుంది. పీహెచ్‌సీ అభ్యర్థులకు 2 శాతం వరకు మినహాయింపు ఉంటుంది.
- రాతపరీక్ష ఇంగ్లిష్/ హిందీ లేదా తెలుగులో ఉంటుంది. అభ్యర్థులు నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు.
- సికింద్రాబాద్‌తోపాటు భువనేశ్వర్ బెంగళూరు, చెన్నై ఆర్ఆర్‌బీల్లోనూ తెలుగులో పరీక్ష రాయవచ్చు.
- పీఈటీ పరీక్షలో పురుషులు 35 కేజీల బరువును రెండు నిమిషాల్లో 100 మీ. వరకు కింద పెట్టకుండా తీసుకెళ్లాలి, 4 నిమిషాల 15 సెకండ్లలో 1000 మీ. దూరాన్ని పరుగెత్తాలి. మహిళలు 20 కేజీల బరువును రెండు నిమిషాల్లో 100 మీ. వరకు తీసుకెళ్లాలి, 5 నిమిషాల 40 సెకండ్లలో 1000 మీ. దూరాన్ని పరుగెత్తాలి.

రాత పరీక్ష విధానం
- ఈ సీబీటీ పరీక్షలో 100 ప్రశ్నలు ఇస్తారు. 90 నిమిషాల్లో పూర్తిచేయాల్సి ఉంటుంది.
- **సిలబస్:** మ్యాథమెటిక్స్‌లో నంబర్ సిస్టమ్, బాడ్‌మాస్, డెసిమల్స్, భిన్నాలు, కసాగు గసాభా, నిష్పత్తి అనుపాతం, శాతాలు, క్షేత్ర గణితం, పని కాలం, పని దూరం, చక్రవడ్డీ, బారువడ్డీ, లాభనష్టాలు, ఆల్‌జీబ్రా, జామెట్రీ, త్రికోణమితి, ఎలిమెంటరీ స్టాటిస్టిక్స్, వర్గమూలాలు, వయస్సుపై, క్యాలెండర్స్, గడియారాలు, పైపులు-గొట్టాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్‌లో అనాలిసిస్, ఆల్ఫాబెటికల్ అండ్ నంబర్ సిరీస్, కోడింగ్ డికోడింగ్, మ్యాథమెటిక్ ఆపరేషన్స్, సంబంధాలు, సిలాజిసమ్, జంబ్లింగ్, వెన్ డయాగ్రమ్, డాటా ఇంటర్‌ప్రిటేషన్, డాటా సఫిషియన్సీ, కన్‌క్లూజన్ అండ్ డెసిషన్ మేకింగ్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనలిటికల్ రీజనింగ్, క్లాసిఫికేషన్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్, ఆర్గ్యుమెంట్స్ అండ్ అసంప్షన్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి.
- జనరల్ సైన్స్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ అండ్ లైఫ్ సైన్సెస్ అంశాల నుంచి పదోతరగతి స్థాయిలో ప్రశ్నలను ఇస్తారు.
- జనరల్ అవేర్‌నెస్, కరెంట్ అఫైర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, స్పోర్ట్స్, కల్చర్, పర్సనాలిటీస్, ఎకనామిక్స్, పాలిటీ, ముఖ్యమైన ఏదైనా ఆంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- ప్రతి తప్పు సమాధానానికి 1/3 మార్కులను తగ్గిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో.
- **నోట్:** అర్హత కలిగిన అభ్యర్థులు కేవలం ఏదైనా ఒక ఆర్ఆర్‌బీ నుంచి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- **చివరితేదీ:** మార్చి 3
- **వెబ్‌సైట్:** www.rrbsecunderabad.nic.in

... తన్నీరు వెంకటేశ్వర్లు

గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామ్ (జీఆర్ఈ)

అమెరికాలో మాస్టర్స్ చేయడం కోసం (ఇంజినీరింగ్, డిగ్రీ తర్వాత) ఎక్కువ మంది విద్యార్థులు రాసేది గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామ్ (జీఆర్ఈ). అమెరికాలోని కొన్ని బిజినెస్ స్కూళ్లు కూడా ఈ పరీక్షలో వచ్చే స్కోర్ ఆధారంగా అడ్మిషన్ ఇస్తాయి. కొంత మంది వైద్య విద్యార్థులు కూడా ఈ పరీక్ష రాస్తుంటారు. యూనివర్సిటీలో అడ్మిషన్, ఫెలోషిప్, స్కాలర్‌షిప్‌ల కోసం జీఆర్ఈ స్కోర్ ఆధారమవుతుంది. అందరికీ కామన్ పరీక్ష కాబట్టి ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. యూనివర్సిటీకి దరఖాస్తు చేసిన విద్యార్థులందరూ రాస్తారు కాబట్టి పోల్చడం కూడా తేలిక. దీంతోపాటు విద్యార్థికి డిగ్రీ దశలో వచ్చిన మార్కులు, రికమండేషన్ ఆధారంగా అడ్మిషన్ ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా 5 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాస్తుంటారు. భారత్ నుంచి 75 వేల నుంచి లక్ష మంది వరకు రాస్తుంటారు. ఏ పరీక్షకు సిద్ధమవుతున్నా సంబంధిత సబ్జెక్టుకు అవసరమైన జ్ఞానం, పరీక్షలో స్పష్టంగా రాయడం అనే అంశాలపై శ్రద్ధ వహించాలి. జీఆర్ఈ కూడా అంతే.



జీఆర్ఈ పరీక్ష నమూనా

టాపిక్ పశ్న	సమయం	స్కోర్
ఇష్యూ టాస్క్, ఆర్గ్యుమెంట్ టాస్క్	ప్రతిటాస్క్‌కి 30 నిమిషాలు	0-6
ప్రతి సెక్షన్‌లో 20 పశ్నలు	ప్రతి సెక్షన్‌కి 30 నిమిషాలు	130-170
ప్రతి సెక్షన్‌లో 20 ప్రశ్నలు	ప్రతి సెక్షన్‌కి 35 నిమిషాలు	130-170
మారుతుంది	మారుతుంది.	
మారుతుంది	మారుతుంది.	

- పరీక్షలో అన్‌స్కోర్డ్ సెక్షన్ మొత్తం అనలిటికల్ రైటింగ్ అసెస్‌మెంట్ తర్వాత ఎప్పుడైనా రావొచ్చు. కానీ, రిసర్చ్ సెక్షన్ చివరగా వస్తుంది.

పరీక్షలో కింది సదుపాయాలు
- ఒక సెక్షన్ లోపల ప్రివ్యూ, రివ్యూ చేయొచ్చు.
- మార్క్, రివ్యూ కూడా ఒక సెక్షన్ లోపల ఉంటాయి. కష్టమైన ప్రశ్న స్కిప్ చేసి వాటిని మార్క్ చేసి, చివరలో సమయం ఉన్నప్పుడు మళ్లీ చూడవచ్చు.
- సెక్షన్‌కి కేటాయించిన సమయం లోపల సమాధానాలు మార్చవచ్చు.
- క్వాంటిటేటివ్ సెక్షన్‌కి ఆన్‌స్క్రీన్ క్యాలిక్యులేటర్ కూడా అందుబాటులో ఉంటుంది.
- అనలిటికల్ రైటింగ్ అసెస్‌మెంట్: దీనితోనే పరీక్ష ప్రారంభమవుతుంది. ఇందులో ఇష్యూ అండ్ ఆర్గ్యుమెంట్ టాస్క్ ఉంటాయి. ప్రతి టాస్క్‌కి 30 నిమిషాల సమయం ఉంటుంది. ఇక్కడ ఎలాంటి చాయిస్ లేదు. ఇచ్చిన టాస్క్‌కి సమాధానం రాయాలి. అనలిటికల్ రైటింగ్ అసెస్‌మెంట్ స్కోర్ 0-6 మధ్యలో ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా జీఆర్ఈ రాసిన విద్యార్థుల సగటు స్కోర్ 3.5. విద్యార్థులు కనీసం 3.5 స్కోర్ టార్గెట్ చేయాలి.

అనలిటికల్ రైటింగ్ అసెస్‌మెంట్‌లో మార్కులు ఎలా పెంచుకోవాలి?
- ప్రతి టాస్క్‌లో ఒక స్పెసిఫికేషన్ ఉంటుంది. దాన్ని పూర్తిగా చదివి దానికి తగిన జవాబు రాయాలి. ఇష్యూ టాస్క్‌లో మీ అభిప్రాయం వ్యక్తపర్చాలి. ఆర్గ్యుమెంట్ టాస్క్‌లో ఇచ్చిన ఆర్గ్యుమెంట్‌ని విశ్లేషించి సమాధానం రాయాలి.
- ప్రతి టాస్క్‌కి మీకున్న 30 నిమిషాలు కేటాయించుకోవాలి. ముందుగా సమాధానం ఎలా రాయాలి? అనేది నిర్ణయించుకుని ముఖ్యమైన పాయింట్లు ఒక కాగితంలో రాసుకోవాలి. ఆ తర్వాత దానినే మరింత వివరంగా రాసి తర్వాత మరోసారి పూర్తిగా చదువుకోవాలి.
- స్పెల్లింగ్, గ్రామర్ పొరపాట్లు లేకుండా చెక్ చేసుకోవాలి. చెప్పాల్సిన పాయింట్లకు సరైన ఉదాహరణలు ఇవ్వాలి.
- నోట్‌పాడ్‌తో కనీసం ఒక ఇష్యూ, ఐదు ఆర్గ్యుమెంట్ టాస్క్‌లు ప్రాక్టీస్ చేయాలి.
- **వెర్బల్ రీజనింగ్:** ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. ప్రతి సెక్షన్‌లో 20 పశ్నలు ఉంటాయి. కేటాయించిన 30 నిమిషాల్లో సెక్షన్ పూర్తిచేయాలి. వెర్బల్ రీజనింగ్ స్కోర్ 130 నుంచి 170 ఉంటుంది. అంటే తక్కువలో తక్కువ 130, ఎక్కువలో ఎక్కువ 170 వస్తాయి. మన దేశంలో జీఆర్ఈ రాసిన విద్యార్థుల సగటు స్కోరు 143.9. ఇందులో అమెరికన్ విద్యార్థులు మనకంటే ఎక్కువగా మార్కులు సాధిస్తారు. ఇంజినీరింగ్ విద్యార్థులు కనీసం 148 స్కోరు చేయాలి. స్కోరింగ్ గురించి ఎక్కువగా ఆలోచించవద్దు. ఎందుకంటే ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష కాబట్టి, నార్మలైజ్ చేసి స్కోర్ ఇస్తారు. ఎన్ని ఎక్కువగా కరెక్ట్ చేస్తే అంత ఎక్కువ వస్తాయి.

ప్రశ్నలు- రకాలు
- **సెంటెన్స్ ఈక్వాలెన్స్:** ఇందులో ఇచ్చిన వాక్యంలో ఒక ఖాళీ ఉంటుంది. ఆ ఖాళీకి సరిపడే రెండు పదాలను, అక్కడ ఇచ్చిన 6 ఆప్షన్ల నుంచి సెలెక్ట్ చేయాలి. సెలెక్ట్ చేసిన రెండు పదాలను సెంటెన్స్‌లో పెట్టిన తర్వాత, ఆ సెంటెన్స్ అర్థం ఒకే విధంగా ఉండాలి. మీరు సెలెక్ట్ చేసిన జవాబులో రెండు ఆప్షన్స్ సరైనవి అయితేనే మార్కులు వస్తాయి.
- **టెక్ట్స్ కంప్లీషన్:** ఇందులో ఒకటి నుంచి ఐదు సెంటెన్సులు, ఒకటి నుంచి మూడు ఖాళీలు ఉండవచ్చు. ఒక ఖాళీ ఉంటే ఐదు ఆప్షన్స్ ఇస్తారు. ఒక జవాబు సెలెక్ట్ చేయాలి. ఎక్కువ ఖాళీలు ఉంటే, ఖాళీకి మూడు ఆప్షన్స్ ఇస్తారు. అన్ని ఖాళీలకు సరైన జవాబు సెలెక్ట్ చేస్తేనే మార్కు ఇస్తారు.
- **రీడింగ్ కాంప్రహెన్షన్:** ఒక పేరా ఇచ్చి దానికి సంబంధించి ప్రశ్న అడుగుతారు. ఒక ప్రశ్న ఐదు ఆప్షన్స్, ఒక జవాబు లేదా ఒక ప్రశ్న మూడు ఆప్షన్స్ ఒకటి లేదా ఎక్కువ జవాబులు (అన్ని జవాబులు కరెక్ట్ అయితే మార్కులు ఇస్తారు) ఒక ప్రశ్న - ఆప్షన్స్ ఉండవు. ప్యాసేజ్‌లో ఆ ప్రశ్నకు ఉన్న జవాబు ఉన్న సెంటెన్స్‌పై క్లిక్ చేయాలి.



Sirisha Reddy Dubbudu
Director,
Abhyaas
Hyderabad & Warangal

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 12 ఫిబ్రవరి 2018


ఆసియాలో అత్యుత్తమ వర్సిటీలు

ఆసియాలోనే అత్యుత్తమ యూనివర్సిటీల జాబితాను టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీహెచ్ఈ) విడుదల చేసింది. 'ఏషియన్ యూనివర్సిటీస్-2018' పేరుతో రూపొందించిన ఈ లిస్ట్‌లో భారత్‌కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) 29వ ప్లేస్‌లో, ఐఐటీ బాంబే 44వ, ఐఐటీ ఖరగ్‌పూర్ 60వ, ఐఐటీ రూర్కీ 65వ, ఐఐటీ కాన్పూర్ 81వ, ఐఐటీ ఢిల్లీ 86వ, తేజ్‌పూర్ యూనివర్సిటీ 100వ ర్యాంక్‌తో టాప్-100లో నిలిచాయి. మొత్తం 25 దేశాల్లోని 350కిపైగా యూనివర్సిటీలు ఈ జాబితాలో ఉన్నాయి. ఇందులో సింగపూర్‌కు చెందిన నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్, చైనాకు చెందిన సింగువా యూనివర్సిటీ, పెకింగ్ వర్సిటీలు తొలి మూడు స్థానాల్లో నిలువగా, హాంకాంగ్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్ (4వ), హాంకాంగ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (5వ), చైనీస్ యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్ (7)లు టాప్-10లో ఉన్నాయి. మన దేశానికి చెందిన 42 వర్సిటీలు ఇందులో స్థానం సంపాదించగా గతేడాది 46వ స్థానంలో ఉన్న మద్రాస్ ఐఐటీ 103వ స్థానానికి పడిపోయింది. కొత్తగా ర్యాంకులు పొందిన ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ (141వ), బెనారస్ హిందూ యూనివర్సిటీ (194వ)లు టాప్ 200లో నిలిచాయి.



ఫిజిక్స్

టీఆర్టీ ఫిజికల్ సైన్స్



గతేడాది తరహాలో...

45. ధ్వని తరంగాలు గాలిలో ప్రదర్శించని ధర్మం?
1) వివర్తనం 2) పరావర్తనం
3) వక్రీభవనం 4) ధృవణం

46. కిందివాటిలో సరికానిది?
1) చంద్రునిపై గల ఇద్దరు వ్యక్తులు ఒకరి శబ్దాన్ని మరొకరు వినలేరు
2) గాలి పీడనంలో మార్పు, గాలిలో ధ్వని వేగంపై ఏ ప్రభావాన్ని చూపదు
3) గాలి ఉష్ణోగ్రతలో మార్పు, గాలిలో ధ్వని వేగంపై ఏ ప్రభావాన్ని చూపదు
4) నీటిలో ధ్వనివేగం గాలిలో ధ్వని వేగం కంటే ఎక్కువ

47. విస్పందనాలు ఏర్పడటానికి కారణం?
1) అసంబద్ధ తరంగాల అధ్యారోపణం
2) సంబద్ధ తరంగాల అధ్యారోపణం
3) తరంగాల పరావర్తనం
4) తరంగాల వక్రీభవనం

48. ఒక చివర మూసిన ఆర్గానె గొట్టం నీటితో నిండి ఉంది. గొట్టం పౌనఃపున్యం?
1) తగ్గుతుంది
2) పెరుగుతుంది 3) మారదు
4) మొదట పెరిగి తరువాత తగ్గుతుంది

49. ఒక సమతల దర్పణ తలంపై కేంద్రీకరణ కాంతి పుంజం పతనమైనప్పుడు ఏర్పడే ప్రతిబింబం?
1) తలకిందులుగా ఉండే నిజ ప్రతిబింబం
2) తలకిందులుగా ఉండే మిథ్యా ప్రతిబింబం
3) నిటారుగా ఉండే నిజ ప్రతిబింబం
4) నిటారుగా ఉండే మిథ్యా ప్రతిబింబం

50. ఒక తరంగం ఒక యానకం నుంచి మరొక యానకంలోకి ప్రయాణించినప్పుడు దాని...?
1) వేగం, పౌనఃపున్యం మారుతాయి
2) తరంగ దైర్ఘ్యం పౌనఃపున్యం మారుతాయి
3) వేగం, తరంగదైర్ఘ్యం మారుతాయి
4) పౌనఃపున్యం, తరంగదైర్ఘ్యం, వేగం మారుతాయి

51. ఒక వస్తువు పారదర్శక ద్రవంలో మునిగి ఉంది. ఆ వస్తువు ఆ ద్రవంలో కనబడకుండా ఉండాలంటే?
1) ఆ వస్తువు పరిపూర్ణ పరావర్తకంగా పనిచేయాలి
2) ఆ వస్తువు తనపై పతనం చెందే మొత్తం కాంతిని శోషించుకోవాలి
3) ఆ వస్తువు వక్రీభవన గుణకం విలువ ద్రవం వక్రీభవన గుణకానికి సమానం కావాలి
4) వస్తువు వక్రీభవన గుణకం విలువ గాలి వక్రీభవన గుణకానికి (=1) సమానం కావాలి

52. ఒక యానకంలో ప్రయాణించే కాంతి వేగం?
1) ఆ యానకం జడత్వంపై మాత్రమే ఆధారపడుతుంది
2) ఆ యానకం స్థితిస్థాపకతపై మాత్రమే ఆధారపడుతుంది
3) ఆ యానకం జడత్వం, స్థితిస్థాపకతలపై ఆధారపడుతుంది
4) ఆ యానకం జడత్వం, స్థితిస్థాపకతలపై ఆధారపడదు

53. కాంతి ఒక యానకం నుంచి వేరొక యానకంలోకి వక్రీభవనం చెందినప్పుడు మారనిది దాని...?
1) వేగం 2) పౌనఃపున్యం
3) కంపన పరిమితి 4) తరంగదైర్ఘ్యం

54. బీకరులో గల నీటి అడుగు తలం నుంచి పైకి చలిస్తున్న గాలి బుడగ బీకరు దగ్గర నిలబడి ఉన్న పరిశీలకునికి వెండి వర్ణంలో కనిపిస్తే దీనిలో ఇమిడి ఉన్న దృగ్విషయం?
1) కాంతి సంపూర్ణాంతర పరావర్తనం
2) కాంతి వివర్తనం
3) కాంతి పరిక్షేపనం 4) కాంతి వక్రీభవనం

55. గాలిలో నుంచి గాజులోకి కాంతి ప్రవేశించినప్పుడు దాని తరంగదైర్ఘ్యం?
1) తగ్గుతుంది 2) పెరుగుతుంది
3) మారదు 4) అనంతం

56. సన్నని, తెల్లని కాంతి కిరణ పుంజం సమాంతర తలాలుగల గాజు దిమ్మె ద్వారా ప్రయాణిస్తుంది. అప్పుడు?
ఎ. బహిర్గామి కిరణ పుంజం తెల్లగా ఉంటుంది
బి. కాంతి విభిన్న వర్ణాలుగా ఎప్పటికీ విడిపోదు
సి. గాజు దిమ్మెలోని కాంతి తెల్లని కాంతి
డి. గాజు దిమ్మెలోని కాంతి విభిన్న వర్ణాలుగా విడిపోతుంది
1) ఎ, డి 2) ఎ, బి
3) ఎ, బి, సి 4) సి

57. ఖగోళ ప్రయోగాల్లో ఉపయోగించేవి?
1) సూక్ష్మదర్శినిలు
2) దృశ్య దూర దర్శినులు
3) రేడియో దూరదర్శిని 4) 2, 3

58. ఖగోళ దూరదర్శినిలో వస్తుకటక నాభ్యాంతరం విలువ?
1) అక్షికటక నాభ్యాంతరం విలువలో సగం
2) అక్షికటక నాభ్యాంతరానికి సమానం
3) అక్షికటక నాభ్యాంతరం కంటే తక్కువ
4) అక్షికటక నాభ్యాంతరం కంటే ఎక్కువ

59. దూరదర్శినుల్లో హెచ్చు ద్వారం గల వస్తుకటకాలను ఉపయోగించడానికి కారణం?
1) కాంతివంతమైన ప్రతిబింబాన్ని పొందడం
2) హెచ్చు పృథక్కరణాన్ని పొందడం
3) తయారు చేయడంలో సులభతరం
4) చూడటానికి అందంగా ఉండటం

60. మనుషుల్లో ఏర్పడే హ్రస్వదృష్టికి కారణం?
1) ముసలితనం
2) అసమానమైన కంటి కటకం నాభ్యాంతరంలో మార్పు
3) కంటి గుడ్డు చిన్నది కావడం
4) కంటి గుడ్డు ఆకృతి పెరగడం

61. దూరదృష్టి కలిగిన కంటి విషయంలో?
1) దగ్గరగా ఉన్న వస్తువు ప్రతిబింబం రెటీనాకు వెనుక భాగంలో ఏర్పడుతుంది
2) దూరంగా ఉన్న వస్తువు ప్రతిబింబం రెటీనాకు వెనుక భాగంలో ఏర్పడుతుంది
3) దోషాన్ని పుటాకార కటకాన్ని ఉపయోగించి సరిచేయవచ్చు
4) దోషాన్ని నివారించడానికి ద్వినాభ్యాంతర కటకాలను ఉపయోగిస్తారు

62. కాంతి నిలకడ వ్యతికరణానికి, రెండు కాంతి జనకాలకు ఉండవలసిన ఆవశ్యకత నిబంధన?
1) అవి మారుతున్న దిశాభేదం కలిగి ఉండాలి
2) అవి సన్నగా ఉండాలి
3) అవి ఒకదానికొకటి సమీపంగా ఉండాలి
4) అవి సమాన దశను లేదా స్థిరదశ భేదం కలిగి ఉండాలి

63. కింది వాటిలో సరైన దాన్ని గుర్తించండి.
1) కాంతి తరంగాలు మాత్రమే వ్యతికరణం చెందుతాయి, ధ్వని తరంగాలు వ్యతికరణం చెందవు
2) అనుదైర్ఘ్య, తిర్యక్ తరంగాలు రెండు వ్యతికరణం చెందుతాయి
3) తిర్యక్ తరంగాలు మాత్రమే వ్యతికరణం చెందుతాయి. కానీ అనుదైర్ఘ్య తరంగాలు కాదు
4) అనుదైర్ఘ్య తరంగాలు మాత్రమే వ్యతికరణం చెందుతాయి, తిర్యక్ తరంగాలు కాదు

64. యంగ్ ద్విచీలిక ప్రయోగంలో తెల్లని కాంతిని ఉపయోగిస్తే కింది వాటిలో సరికాని ప్రవచనం?
1) కేంద్ర పట్టీ తెల్లగా ఉంటుంది
2) కేంద్ర పట్టీకి పక్కన ఉన్న పట్టీ ఎరుపుగా ఉంటుంది
3) కేంద్ర పట్టీకి పక్కన ఉన్న పట్టీ ఊదారంగులో ఉంటుంది
4) మొత్తం వ్యూహంలో పూర్తి చీకటి పట్టీ ఉండదు

65. వివర్తన వ్యూహంలో?
1) అన్ని పట్టీల వెడల్పు సమానం
2) అన్ని పట్టీల వెడల్పు సమానం కాదు
3) అన్ని పట్టీలను ఏర్పర్చలేం
4) అన్ని పట్టీల వెడల్పు సమానంగా ఉండవచ్చు లేదా లేకపోవచ్చు

66. కింది వాటిలో సరైన ప్రవచనం?
1) కాంతి తరంగాల వ్యతికరణం లేకుండా వివర్తనం జరుగదు
2) కాంతి తరంగాల వివర్తనం లేకుండా వ్యతికరణం జరుగదు
3) కాంతి తరంగాల ధృవణం ఫలితమే వ్యతికరణం వివర్తనాలు
4) యంగ్ ద్విచీలిక ప్రయోగంలో పట్టీ వెడల్పు ఉపయోగించిన కాంతి తరంగ దైర్ఘ్యాలపై ఆధారపడదు

67. రుణ బిందు ఆవేశం చుట్టూ ఉండే విద్యుత్ బలరేఖలు?
1) త్రిజ్యా బహిర్గతాలు
2) త్రిజ్యా అంతర్గతాలు
3) సవ్యదిశలో వృత్తాకారం
4) అపసవ్య దశలో వృత్తాకారం

68. ఏకరీతి విద్యుత్ క్షేత్రంలో ఒకే విలువగల బలాన్ని ఎదుర్కొనే కణాల జంట?
1) ప్రోటాన్, డ్యుటిరాన్
2) డ్యుటిరాన్, ఆల్ఫాకణం
3) ఎలక్ట్రాన్, ప్రోటాన్
4) ప్రోటాన్, డ్యుటిరాన్, ఎలక్ట్రాన్, ఆల్ఫాకణం

69. కింది వాటిలో తప్పు ప్రవచనం ఏది?
1) ఆవేశాలు ద్రవ్యరాశి లేకుండా ఉండలేవు
2) వస్తువు ఆవేశం దాని వేగంపై ఆధారపడుతుంది
3) కూలుంబ్ బలం కేంద్రీయ బలం
4) ఆవేశం తనపై తాను బలాన్ని ప్రయోగించుకోదు

70. నిశ్చలంగా ఉండే విద్యుదావేశం?
1) అయస్కాంత క్షేత్రాన్ని మాత్రమే ఉత్పత్తి చేస్తుంది
2) విద్యుత్‌క్షేత్రాన్ని మాత్రమే ఉత్పత్తి చేస్తుంది
3) విద్యుత్, అయస్కాంత క్షేత్రాలు రెండింటిని ఉత్పత్తి చేస్తుంది
4) విద్యుత్, అయస్కాంత క్షేత్రాలు రెండింటినీ ఏర్పర్చదు

71. ఒక కూలుంబ్ ఆవేశం?
1) ఎలక్ట్రాన్ ఆవేశం కంటే ఎక్కువ
2) ఎలక్ట్రాన్ ఆవేశం కంటే తక్కువ
3) ఎలక్ట్రాన్ ఆవేశానికి సమానం
4) ఎలక్ట్రాన్ ఆవేశంతో సబంధం లేనిది

72. ఒక నియుక్త వాహక గోళానికి ధనావేశాన్ని ఇస్తే దాని ద్రవ్యరాశి?
1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
3) మారదు 4) ద్రవ్యరాశి ప్రమేయం లేదు

73. రెండు సమాన ధనావేశాలను A, B బిందువుల వద్ద ఉంచారు. A నుంచి Bకి కదులుతున్నప్పుడు ఆ బిందువుల మధ్య పొటెన్షియల్ తేడాను అధ్యయనం చేశారు. పొటెన్షియల్.....?
1) అవిచ్ఛిన్నంగా పెరుగుతుంది
2) అవిచ్ఛిన్నంగా తగ్గుతుంది
3) మొదట పెరిగి తరువాత తగ్గుతుంది
4) మొదట తగ్గి తరువాత పెరుగుతుంది

74. అంతరాళంలో ఒక బిందువు వద్ద విద్యుత్ పొటెన్షియల్ V సున్నా. దీని అర్థం?
1) ఆ బిందువు వద్ద విద్యుత్ క్షేత్రం తప్పకుండా సున్నా కావాలి
2) ఆ బిందువువద్ద విద్యుత్ క్షేత్రం తీవ్రత అనంతం
3) ఆ బిందువు వద్ద విద్యుత్ క్షేత్రం సున్నా కాకుండా ఉండాలి
4) ఆ బిందువు వద్ద విద్యుత్ క్షేత్రం సున్నా కావచ్చు లేదా కాకపోవచ్చు

75. ప్రవచనం A: విద్యుత్‌క్షేత్రం సున్నా అయిన బిందువు వద్ద విద్యుత్ పొటెన్షియల్ ఉండవచ్చు
ప్రవచనం B: విద్యుత్ పొటెన్షియల్ సున్నా అయినచోట విద్యుత్ క్షేత్రం ఉండవచ్చు
ప్రవచనం C: ఆవేశపూరిత వాహక గోళం లోపల విద్యుత్ పొటెన్షియల్ స్థిరంగా ఉంటుంది
1) A, B 2) B, C
3) A, C 4) పైవన్నీ

76. సమ పొటెన్షియల్ తలంపై ఏకాంక ధనావేశం ఒక బిందువు నుంచి వేరొక బిందువు వైపు కదిలింది?
1) ఆవేశంపై పని జరిగింది
2) ఆవేశంపై పని జరుగలేదు
3) ఆవేశం వల్ల బాహ్య కారకంపై పని జరిగింది
4) జరిగిన పనిని ఊహించలేం

77. బిందు ఆవేశం వల్ల సమపొటెన్షియల్ తలం ఆకారం?
1) సమతలం 2) గోళాకారం
3) స్తూపాకారం 4) పరావలయం

78. విద్యుత్ ప్రవాహం, కాలం వక్ర వైశాల్యం?
1) విద్యుత్ పొటెన్షియల్‌ను ఇస్తుంది
2) విద్యుత్ ఆవేశాన్ని ఇస్తుంది
3) విద్యుత్ నిరోధాన్ని ఇస్తుంది
4) విద్యుత్ క్షేత్ర తీవ్రతను ఇస్తుంది

79. ఏకరీతిగా లేని విద్యుచ్ఛేదం గల తీగ గుండా విద్యుత్ ప్రవహిస్తున్నప్పుడు దాని పొడవు అంతా కూడా స్థిరంగా ఉండే రాశి లేదా రాశులు?
1) విద్యుత్ ప్రవాహం, విద్యుత్‌క్షేత్రం అపసరవడి
2) అపసరవడి మాత్రమే
3) విద్యుత్ ప్రవాహం, అపసర వడి
4) విద్యుత్ ప్రవాహం

80. వివృత (తెరచి ఉన్న) వలయం విద్యుత్ నిరోధం?
1) అనంతం 2) సున్న
3) రుణాత్మకం 4) కొన్నిసార్లు ధనాత్మకం

81. తీగ నిరోధకత ఆధారపడే అంశాలు?
1) తీగపొడవు 2) తీగ మధ్యచ్ఛేద వైశాల్యం
3) తీగ ఆకారం 4) తీగ పదార్థం

82. ఓమ్ నియమాన్ని కింది వాటిలో దేనికి అనువర్తించలేం?
1) ఇనుము 2) జర్మేనియం
3) బంగారం 4) వెండి

83. కాన్‌స్టాటన్ తీగను ప్రామాణిక నిరోధాలను తయారుచేయడానికి ఉపయోగించడానికి కారణం?
1) విశిష్ట నిరోధ గుణకం
2) సాంద్రత ఎక్కువ
3) ఉష్ణోగ్రత నిరోధ గుణకం ఉపేక్షణీయం
4) ద్రవీభవన స్థానం చాలా ఎక్కువ

84. అతి వాహక స్థితిలో విద్యుత్ వాహకత్వం?
1) అనంతం
2) ఉష్ణోగ్రతపై ఆధారపడుతుంది 3) సున్నా
4) ఆకారంపై ఆధారపడుతుంది

85. ప్రామాణిక నిరోధకాలను చేయడానికి ఉపయోగించే లోహం?
1) రాగి 2) వెండి
3) మాంగనీస్ 4) నిక్రోమ్

86. పరమ శూన్య ఉష్ణోగ్రత వద్ద జర్మేనియం?
1) వాహకంగా ప్రవర్తిస్తుంది
2) బంధకంగా ప్రవర్తిస్తుంది
3) అతి వాహకంగా ప్రవర్తిస్తుంది
4) అర్ధవాహకంగా ప్రవర్తిస్తుంది

87. వాహకం ఉష్ణోగ్రత పెరిగేకొద్ది నిరోధకత, వాహకత్వాల లబ్ధం?
1) పెరుగుతుంది
2) అదేవిధంగా ఉంటుంది 3) తగ్గుతుంది
4) తగ్గవచ్చు లేదా పెరగవచ్చు

ANSWERS

45-4	56-1	67-2	78-2
46-3	57-4	68-3	79-4
47-2	58-4	69-2	80-1
48-2	59-1	70-2	81-4
49-3	60-4	71-2	82-2
50-3	61-1	72-2	83-3
51-3	62-4	73-4	84-1
52-4	63-2	74-4	85-4
53-2	64-2	75-4	86-2
54-1	65-2	76-2	87-2
55-1	66-1	77-2	



P. Sreenivas
Physics Sr.Faculty,
Hyderabad
9700724464

కెమిస్ట్రీ

గతేడాది తరహాలో...



45. ప్రయోగశాలలో రాగి ముక్కలను గాఢ సల్ఫ్యూరిక్ ఆమ్లంలో వేడిచేసే చర్య జరపడంవల్ల వచ్చే వాయువు?
1) CO_2 2) NH_3
3) Cl_2 4) SO_2

46. H_2SO_4తో సంబంధం లేనిది?
1) రసాయనాల్లో రాజు 2) నిర్జల కారణి
3) ఒక ఆక్సీకారణి 4) త్రిక్షారత ఆమ్లం

47. SO_2 వాయువు తడి సమక్షారంలో ఏ ప్రక్రియ ద్వారా విరంజన చర్యను జరుపుతుంది?
1) క్షయకరణం 2) ఆక్సీకరణం
3) పైరెండూ
4) విరంజన కారిణిగా పనిచేయదు

48. సల్ఫ్యూరిక్ ఆమ్లం కింది ఏ లోహాలతో చర్యజరుపవు?
1) బంగారం 2) ప్లాటినం
3) పైరెండు 4) జింక్

49. సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని విలీనపరిచేటప్పుడు?
1) H_2SO_4ను నీటికి చుక్కలు, చుక్కలుగా కలపాలి
2) H_2SO_4కు నీటిని చుక్కలు, చుక్కలుగా కలపాలి
3) ఏ విధంగా కలిపినా సరైనదే
4) అసలు కలుపకూడదు

50. H_2S వాయువును సేకరించే పద్ధతి?
1) ఊర్ధ్వముఖ స్థానచలనం
2) అధోముఖ స్థానచలనం
3) పైరెండు
4) ఏదీకాదు

51. అమ్మోనియా వాయువును సేకరించే పద్ధతి?
1) అధోముఖ స్థాన చలనం
2) ఊర్ధ్వముఖ స్థానచలనం
3) పైరెండు
4) ఏ పద్ధతి అవసరం లేదు

52. బ్రౌన్ వలయ పరీక్షలు బ్రౌన్ వలయ రసాయనం ఏది?
1) $FeSO_4$ 2) $FeSO_4.NO_2$
3) $FeSO_4.NO$ 4) $FeSO_4.NO_3$

53. కాపర్‌పై సజల నైట్రిక్ ఆమ్ల చర్యవల్ల ఏర్పడే నైట్రోజన్ ఆక్సైడ్స్?
1) NO 2) NO_2
3) N_2O_3 4) N_2O

54. నైట్రైట్‌లను నైట్రేట్లుగా మార్చే బ్యాక్టీరియా?
1) నైట్రిఫయింగ్ 2) నైట్రోసోఫయింగ్
3) అమ్మోనిఫయింగ్ 4) డీనైట్రిఫైయింగ్

55. వాతావరణపు నైట్రోజన్, నైట్రేట్లు లవణాలుగా మార్చడాన్ని ఏమంటారు?
1) నత్రజని వలయం
2) నత్రజని స్థాపన
3) నైట్రిఫయింగ్ 4) డీనైట్రిఫయింగ్

56. కింది వాటిలో యూరియా?
1) NH_2-O-NH_2
2) $NH_2-\overset{O}{\overset{\|}{C}}-NH_2$
3) $NH_2-\overset{S}{\overset{\|}{C}}-NH_2$
4) NO_2-C-NO_2

57. కృత్రిమ సిల్క్ అనేది?
1) నైట్రోగ్లిజరిన్ 2) సెల్యులోజ్
3) సెల్యులోజ్ నైట్రేట్
4) సెల్యులోజ్ నైట్రయిల్

58. $I_2 + 10\ HNO_3 \rightarrow 2IO_3 + 10NO_2 + 4H_2O$ ఈ చర్యలో అయోడిన్?
1) క్షయీకరించబడింది
2) రంగు పోగొట్టబడింది
3) ఆక్సీకరించబడింది
4) తటస్థీకరించబడింది

59. $NH_3 + 3Cl_2 \rightarrow X + Hcl$ ఈ చర్యలో 'X' అనేది పేలుడు పదార్థం?
1) NO_2 2) CO_2
3) NCl_3 4) N_2O_3

60. అమ్మోటాల్ అంటే?
1) NH_4NO_3 + TNT
2) NH_4NO_3 + Al
3) $NH_4NO_3 + C_6H_6$
4) $NH_4NO_3 + C_6H_5-NH_2$

61. ఫాస్పరస్ ఎందులో లభిస్తుంది?
1) కోడిగుడ్డు 2) ఎముకలు
3) మెదడు, ఎముక మజ్జ 4) పైవన్నీ

62. వెల్లుల్లి వాసన కలిగి, విష స్వభావం ఉన్నది?
1) సల్ఫర్ 2) ఫాస్పరస్
3) ఫ్లోరిన్ 4) నైట్రోజన్

63. మెటా ఫాస్పరిక్ ఆమ్లం, ఆర్థోఫాస్పరిక్ ఆమ్లం ఫార్ములాలు వరుసగా?
1) H_3PO_4, H_3PO_3
2) HPO_3, H_3PO_4
3) HPO_3, H_3PO_3
4) H_3PO_4, H_3PO_2

64. $H_3PO_4 + x\ NaOH \rightarrow Y + 2H_2O$ ఇందులో X, Yలు వరుసగా?
1) 3, NG_2HPO_4
2) 2, NG_2HPO_4
3) 2, NG_3PO_4 4) ఏదీకాదు

65. కింది వాటిలో సరికానిది?
1) జిప్సం ఫార్ములా- $CaSO_4\ 2H_2O$
2) సూపర్ ఫాస్ఫేట్- $[Ca(H_2PO_4)_2\ H_2O]$
3) H_3PO_2 అనేది త్రిక్షారత ఆమ్లం
4) H_3PO_4 అనేది త్రిక్షారత ఆమ్లం

66. ఫాస్పరస్ పరిశ్రమలో పనిచేసే శ్రామికులకు దవడ ఎముకలు నశిస్తాయి. దీన్ని ఏ జబ్బు అంటారు?
1) పాసీజో 2) జాసీపా
3) సీపాజా 4) ఏదీకాదు

67. ఎముకల బూడిద ఫార్ములా?
1) $Ca_3(PO_4)_4$ 2) $Ca_3(PO_4)_2$
3) $Ca_2(PO_4)_5$ 4) ఏదీకాదు

68. కింది వాటిలో నిర్జల కారణి ఏది?
1) H_2SO_4 2) Al_2O_3
3) P_2O_5 4) పైవన్నీ

69. H_3PO_4, H_3PO_3, H_3PO_2ల క్షారతలు వరుసగా?
1) 3, 1, 2 2) 1, 2, 3
3) 3, 2, 1 4) 1, 2, 2

70. తెల్ల బాస్వరాన్ని గాలిలో ఉంచితే ఏర్పడేది?
1) ఫాస్ఫరిక్ ఆమ్లం 2) ఫాస్పరస్ ట్రైఆక్సైడ్
3) మెటాఫాస్ఫరిక్ ఆమ్లం
4) ఫాస్పరస్ పెంటాక్సైడ్

71. నెల్సన్ ఘటం ద్వారా బ్రైన్ ద్రావణాన్ని విద్యుత్ విశ్లేషణం చేసినప్పుడు ఏర్పడే పదార్థాలు?
1) NaOH 2) Cl_2
3) H_2 4) పైవన్నీ

72. నెల్సన్ ఘటంలో ఆనోడ్స్, క్యాథోడ్స్‌లు వరుసగా..?
1) గ్రాఫైట్ ఆనోడ్స్‌గా, U- ఆకారపు కాథోడ్స్‌గా
2) U- ఆకారపు పాత్ర ఆనోడ్స్‌గా, గ్రాఫైట్ క్యాథోడ్స్
3) 1, 2 4) ఏదీకాదు

73. టర్పంటైన్ ఫార్ములా?
1) $C_{10}H_{16}$ 2) $C_{10}H_{18}$
3) $C_{10}H_{20}$ 4) $C_{10}H_{22}$

74. విరంజన చూర్ణం (బ్లీచింగ్ పౌడర్) ఫార్ములా?
1) $CaOcl_2$ 2) $Cacl_2$
3) $Ca(OH)_2$ 4) $CaSO_4$

75. బ్రైన్ ద్రావణం అంటే?
1) NaCl ద్రావణం 2) KCl ద్రావణం
3) $NaNO_3$ ద్రావణం 4) చక్కెర ద్రావణం

76. దూది, కాగితం, సిల్క్ మొదలైన వాటిని నిరంజనం చేయడానికి ఉపయోగించేది?
1) SO_2 2) Cl_2
3) $CaOCl_2$ 4) $COCl_2$

77. నెల్సన్ ఘట పద్ధతిలో బ్రైన్ ద్రావణ విద్యుత్ విశ్లేషణలో ఆనోడ్స్ వద్ద వెలువడేది?
1) H_2 2) NaOH
3) H_2O 4) Cl_2

78. గది ఉష్ణోగ్రత పీడనాల వద్ద 1 మి.లీ. నీటిలో ఎన్ని మి.లీ. HCl వాయువు కరుగుతుంది?
1) 158 ml 2) 168 ml
3) 178 ml 4) 188 ml

79. HClను సేకరించే పద్ధతి?
1) ఊర్ధ్వముఖ స్థానచలనం
2) అధోముఖ స్థానచలనం
3) పైరెండూ 4) ఏదీకాదు

80. కాస్టిక్ సోడా, బట్టల సోడా, వంట సోడా ఫార్ములాలు?
1) NaOH, Na_2CO_3, $NaHCO_3$
2) $NaHCO_3$, Na_2CO_3, NaOH
3) Na_2CO_3, NaOH, $NaHCO_3$
4) ఏదీకాదు

ANSWERS

45-4	54-1	63-2	72-1
46-4	55-2	64-2	73-1
47-1	56-2	65-3	74-1
48-3	57-3	66-1	75-1
49-1	58-3	67-2	76-3
50-1	59-3	68-4	77-4
51-1	60-1	69-3	78-1
52-3	61-4	70-4	79-1
53-1	62-1	71-4	80-1



కెమిస్ట్రీ చంద్రం
కెమిస్ట్రీ సీనియర్ ఫ్యాకల్టీ
నల్లగొండ. 9848 595 085

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
సోమవారం 12 ఫిబ్రవరి 2018

ఒప్పించాలంటే.. మెప్పించాలి!


మన చిత్రసీమ మొత్తం కథానాయకుల చుట్టూనే పరిభ్రమిస్తుంటుంది. పారితోషికాలు మొదలుకొని వసూళ్ల వరకు వాణిజ్య లెక్కలన్నీ వారి చుట్టూనే కేంద్రీకృతమై ఉంటాయి. అయితే ఇటీవలకాలంలో దక్షిణాది చిత్రసీమలో గణనీయమైన మార్పులొస్తున్నాయి. హీరోలతో సమానంగా నాయిక ప్రధాన చిత్రాల రూపకల్పన జరుగుతున్నది. కమర్షియల్ సినిమాల్లో కూడా కథానాయికల కోసం బలమైన పాత్రల్ని సృష్టిస్తున్నారు. దీంతో చక్కటి పతిభాసంపత్తులు కలిగిన నాయికల డేట్స్ కోసం దర్శకనిర్మాతలు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. రెమ్యునరేషన్‌లు, నిర్మాణ సంస్థల పేరుప్రతిష్టలకు అతీతంగా సదరు నాయికలు కథాంశాల్లోని నవ్యతకు, తమ పాత్ర చిత్రణలోని వైవిధ్యానికే ప్రాధాన్యతనిస్తూ సినిమాల్ని ఎంపికచేసుకుంటారు. ప్రయోగాలు కొన్ని సందర్భాల్లో జనాదరణ పొందలేకపోయినా తమలోని నట జిజ్ఞాసను సంతృప్తిపరచుకునేందుకు వినూత్న కథలకే సై అంటున్నారు. ఈ కథానాయికల్ని ఒప్పించాలంటే మంచి కథతో వారి మనసుల్ని గెలవాల్సిందే . అలా సాధారణ సినీ సమీకరణాలకు అతీతంగా తమ కెరీర్‌లో దూసుకుపోతున్న నాయికల మీద ప్రత్యేక కథనం..



అనుష్క

అనుష్క: ఈ బెంగళూరు సోయగం తొలుత గ్లామర్ నాయికగానే ప్రేక్షకులకు చేరువైంది. 'అరుంధతి' ఆమె సినీ గమనాన్నే మార్చివేసింది. జేజమ్మగా తిరుగులేని అభినయంతో సినీ ప్రియుల హృదయాల్ని గెలుచుకుంది. ఇక అక్కడి నుంచి కథాంశాల ఎంపికలో అనుష్క ప్రాధామ్యాలు పూర్తిగా మారిపోయాయి. ఓ వైపు వాణిజ్య చిత్రాలు చేస్తూనే 'వేదం' 'నాగవల్లి' వంటి చిత్రాల్లో ప్రయోగాత్మక పాత్రల్లో అలరించింది. 'బాహుబలి' సిరీస్ చిత్రాలు అనుష్కను జాతీయస్థాయి తారగా నిలబెట్టాయి. దేవసేనగా ఆమె అసమాన అభినయం అందరినీ మంత్రముగ్ధుల్ని చేసింది. 'రుద్రమదేవి' చిత్రంలో కాకతీయసామ్రాజ్ఞిగా అత్యంత శక్తివంతమైన పాత్రలో రాణించింది. 'సైజ్ జీరో' చిత్రం నటిగా అనుష్కలోని మరో కోణాన్ని ఆవిష్కరించింది. 'బాహుబలి' సిరీస్‌తో దేశవ్యాప్తంగా వచ్చిన కీర్తిప్రతిష్టల్ని సద్వినియోగం చేసుకునే పనిలో ఉన్న అనుష్క సినిమాల ఎంపికలో ఆచి తూచి అడుగులు వేస్తున్నది. ఇటీవలే విడుదలైన 'భాగమతి' చిత్రం యాభైకోట్ల వసూళ్లను సాధించి అనుష్క కమర్షియల్ స్టామినా ఏమిటో నిరూపించింది. ఓ కథానాయిక చిత్రానికి ఈ స్థాయిలో వసూళ్లు రావడం ఇదే ప్రథమమని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. అనుష్కతో సినిమా అంటే ఓ అగ్ర కథానాయకుడితో సినిమా చేసినట్టేననే భావన దక్షిణాది పరిశ్రమలో నెలకొంది. 'భాగమతి' తర్వాత మరే చిత్రానికి అంగీకరించలేదు అనుష్క. ఆమె ఇమేజ్‌కు అనుగుణమైన కథలతో దర్శకనిర్మాతలు సంప్రదిస్తేనే సినిమాల గురించి ఆలోచిస్తాననే భావనలో అనుష్క వుందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు.

నయనతార: ప్రస్తుతం దక్షిణాదిలో మహిళా ప్రధాన చిత్రాలనగానే ఠక్కున గుర్తుకొచ్చే పేరు నయనతారే. గత కొన్నేళ్లుగా ప్రధాన స్రవంతి కథానాయిక చిత్రాలకు దూరంగా వుంటోందామె. కేవలం నాయిక ప్రధాన చిత్రాలకే ఓకే చెబుతున్నది. తమిళంలో 'మాయ' 'అరమ్' 'డోరా'..మలయాళంలో 'పుథియ నియమం', తెలుగులో 'అనామిక' వంటి చిత్రాలు నయనతార ప్రతిభకు అద్దంపట్టాయి. ప్రస్తుతం ఆమె తమిళంలో 'కొలైయుథిర్ కాలమ్' 'కొలమావు కోకిల' వంటి మహిళా ప్రధాన చిత్రాల్లో నటిస్తున్నది. తెలుగులో 'సైరా'లో చిరంజీవి సరసన కనిపించనుంది. పలు కమర్షియల్ చిత్రాల్లో నాయికగా నయనతారను సంప్రదించినప్పటికీ కథాంశాల్లో కొత్తదనం లేకపోవడంతో ఆమె తిరస్కరించిందని చెబుతారు.



నయనతార

సమంత: 'మనం' చిత్రాన్ని సమంత కెరీర్‌లో మేలిమలుపుగా అభివర్ణించవొచ్చు. అంతకుముందు చక్కటి ప్రేమకథా చిత్రాల్లో అభినయప్రధాన చిత్రాల్లో నటించినప్పటికీ 'మనం' నటిగా ఆమెకు కొత్త ఇమేజ్‌ను తీసుకొచ్చింది. ప్రస్తుతం సినిమాల ఎంపికలో సమంత చక్కటి ప్రమాణాల్ని పాటిస్తున్నది. ముఖ్యంగా వివాహానంతరం ఆమె ప్రయారిటీస్ పూర్తిగా మారిపోయాయి. 'రంగస్థలం' చిత్రంలో రామలక్ష్మి పాత్రలో పల్లెటూరి అమ్మాయిగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల విడుదల చేసిన ఆమె ఫస్ట్‌లుక్ టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. పాత్రలపరంగా సమంత దృక్పథంలో వచ్చిన మార్పుకు ఇదే నిదర్శనమని విశ్లేషకులు అంటున్నారు. ప్రస్తుతం సమంత తెలుగులో 'మహానటి' చిత్రంలో జర్నలిస్ట్ పాత్రలో కనిపించనుంది. తమిళంలో 'సూపర్‌డీలక్స్' అనే ప్రయోగాత్మక చిత్రంలో కనిపిస్తున్నది. ఇందులో ఆమె ప్రతినాయిక ఛాయలున్న పాత్రలో కనిపించనుందని తెలుస్తున్నది. కన్నడ చిత్రం 'యూ టర్న్' తెలుగు, తమిళ రీమేక్‌లో సమంతా నటించనుంది. కథలో ఏదో ఒక ఎక్సైటింగ్ ఎలిమెంట్ లేనిదే సమంత సినిమాలకు అంగీకరించడం లేదని ఆమె సన్నిహితులు అంటున్నారు.



సమంత

నిత్యామీనన్: కెరీర్ ఆరంభం నుంచి నిత్యామీనన్‌ది విభిన్న ప్రయాణమే. 'అలా మొదలైంది' 'ఇష్క్' 'మళ్లీ మళ్లీ ఇదిరాని రోజు' 'రుద్రమదేవి' 'ఓకే బంగారం' చిత్రాలు ఆమె ప్రతిభకు తార్కాణంగా నిలిచాయి. తెలుగులో ఎక్కువగా ప్రధాన స్రవంతి చిత్రాల్లో నటించిన ఆమె తమిళం, మలయాళంలో మాత్రం అందుకు భిన్నంగా ప్రయోగాలకే మొగ్గు చూపింది. ప్రస్తుతం నిత్యామీనన్ తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో 'ప్రాణ' అనే పేరుతో రూపొందుతున్న ఓ చిత్రంలో నటిస్తున్నది. హిల్‌స్టేషన్ నేపథ్యంలో సాగే విభిన్న థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ సినిమాలో నిత్యామీనన్ రచయిత్రి పాత్రలో కనిపించనుంది. ప్రస్తుతం ఆమె తెలుగులో 'అ!' చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నది. కమర్షియల్ చిత్రాలకు దూరంగా నిత్యామీనన్ ప్రయోగాత్మక కాన్సెప్ట్స్ వైపు మొగ్గుచూపుతున్నదని, ముఖ్యంగా సోలో నాయిక చిత్రాలకు ప్రాధాన్యతనిచ్చే ఉద్దేశంతో వుందని చెబుతున్నారు. ఇదే పంథాలో యువ కథానాయిక సాయి పల్లవి సైతం వినూత్న కథా చిత్రాలకే ప్రాధాన్యతనిస్తూ కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్నది. 'ఫిదా' 'ఎంసీఏ' చిత్రాలతో యువ ప్రేక్షకుల హృదయాల్ని గెలుచుకున్న ఈ తమిళ సోయగం ప్రస్తుతం పలు ప్రతిష్టాత్మక చిత్రాల్లో నటిస్తున్నది. సాయిపల్లవి తెలుగు, తమిళ భాషల్లో నటిస్తున్న 'కణం' చిత్రం కోసం దక్షిణాది పరిశ్రమ ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. ఈ సినిమాలో సాయిపల్లవి అమ్మ పాత్రలో కనిపిస్తుందని తెలిసింది.



నిత్యామీనన్

సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా వ్యవహరిస్తున్న ఈ కథానాయికల కోసం దర్శకనిర్మాతలు సరికొత్త కథల్ని సృజించే పనిలో ఉన్నారు. కేవలం ఇతివృత్తాలో నవ్యత వుంటేనే వారిని ఒప్పించగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. సమకాలీన చిత్ర పరిశ్రమకు ఇదొక శుభపరిణామని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

కొంతమంది వార్నింగ్ ఇచ్చారు!

'స్నేహగీతం' సినిమాతో నటుడిగా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి 'తొలి ప్రేమ' సినిమాతో దర్శకుడిగా మారారు వెంకీ అట్లూరి. తొలి ప్రయత్నంలోనే విజయాన్ని సొంతం చేసుకున్న ఆయనపై ప్రస్తుతం ప్రశంసల జల్లు కురుస్తున్నది. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'తొలిప్రేమ'. వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటించారు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో దర్శకుడు వెంకీ అట్లూరి పాత్రికేయులతో ముచ్చటించారు.



వెంకీ అట్లూరి

'తొలిప్రేమ' ప్రీరిలీజ్ వేడుకను భీమవరంలో నిర్వహించాం. అక్కడికి వచ్చిన మెగా అభిమానులకు గతంలో వచ్చిన 'తొలిప్రేమ' గౌరవాన్ని పెంచే స్థాయిలో తాజా చిత్రాన్ని రూపొందిస్తానని ప్రామిస్ చేశాను. ఆ మాటను నిలబెట్టుకున్నానని అనుకుంటున్నాను. దర్శకుడిగా సక్సెస్‌ని సాధించాలని కోరుకున్నానే కానీ ఈ స్థాయిలో సినిమా విజయాన్ని సొంతం చేసుకుంటుందని మాత్రం ఊహించలేదు. దేవి థియేటర్‌లో ప్రేక్షకుల మధ్య సినిమా చూశాను. చిన్న చిన్న డైలాగ్‌లను కూడా ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్న తీరు ఆనందాన్ని కలిగించింది.

అసహనానికి లోనయ్యాను..

దర్శకుడిగా అవకాశం కోసం చాలా ఏళ్లు ఎదురుచూశాను. ఓ దశలో చిన్న అసహనానికి లోనయ్యాను. 'తొలిప్రేమ' సినిమా అనుకున్న తరువాత వరుణ్‌కు ప్రమాదం జరిగింది. దాంతో అతను అంగీకరించిన సినిమాల చిత్రీకరణ ఆగిపోయింది. అలా జరిగి వుండకపోతే ఈ చిత్రం ముందే బయటికి వచ్చేది. ఆలస్యం కావడమే మంచిది అయిందేమో. 'ముకుంద' టీజర్ చూసినప్పుడు మన కథకు ఇలాంటి హీరో అయితే బాగుంటుందని అనిపించింది. అయితే మెగా ఫ్యామిలీ నుంచి వస్తున్న హీరో ప్రేమకథ చేస్తాడా ? అనే చిన్న భయం వుండేది. 'కంచె' విడుదల తరువాత చేయగలడనే ధైర్యం ఏర్పడింది.

ఎక్కువ రోజులు వేచిచూడలేకే..

ముందు ఈ కథను దిల్‌రాజుగారికి వినిపించాను. ఆ సమయంలో ఆయన ఎక్కువ సినిమాలు నిర్మిస్తూ బిజీగా వుండటంతో ఎక్కువ రోజులు వేచిచూడాల్సి వస్తుందనే కారణం వల్ల ఈ కథను బీవీఎస్ఎన్ ప్రసాద్‌కు చెప్పాను. ఆయన తనయుడు బాపినీడు నాకు మంచి మిత్రుడు కావడంతో నా పని మరింత సులువు అయింది. సినిమాలో కథానుగుణంగా మూడు భిన్నమైన పార్శ్వాల్లో పాత్రలు కనిపించాలి. అందుకు అనుగుణంగానే వరుణ్‌తేజ్, రాశీఖన్నా బరువు తగ్గడం జరిగింది.

కొంత మంది జాగ్రత్త అన్నారు..

'తొలిప్రేమ' టైటిల్ అనుకున్నప్పుడు అభిమానుల నుంచి వ్యతిరేకత వస్తుందేమోనని ముందు భయపడ్డాను. కానీ ఫస్ట్‌లుక్ ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకోవడంతో ఆ భయం పోయింది. అయితే కొంత మంది మాత్రం 'తొలిప్రేమ' టైటిల్ పెట్టావు జాగ్రత్తగా సినిమా తీయమని వార్నింగ్ ఇచ్చారు. తదుపరి చిత్రాన్ని కూడా బీవీఎస్ఎన్ ప్రసాద్‌గారికే చేస్తున్నాను. దీని తరువాత దిల్‌రాజుగారి సంస్థలో సినిమా వుండే అవకాశం వుంది.



నితిన్, మేఘా ఆకాష్

ఛల్ మోహన్‌రంగ

నితిన్, మేఘా ఆకాష్ జంటగా పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, శ్రేష్ఠ్ మూవీస్ పతాకాలపై ఓ చిత్రం తెరకెక్కుతున్నది. కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి 'ఛల్ మోహన్‌రంగ' అనే పేరును ఖరారు చేశారు. ఆదివారం ట్విట్టర్ ద్వారా ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను కథానాయకుడు పవన్‌కల్యాణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'త్రివిక్రమ్ శైలిలో సాగే అందమైన ప్రేమకథా చిత్రమిది. నితిన్ నటిస్తున్న 25వ సినిమా కావడం విశేషం. నటుడిగా అతణ్ణి కొత్త పంథాలో ఆవిష్కరిస్తుంది. చిత్ర ఫస్ట్‌లుక్‌ను పవన్‌కల్యాణ్ విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రేమికుల రోజు కానుకగా ఫిబ్రవరి 14న ఈ చిత్ర టీజర్, ఏప్రిల్ 5న సినిమాను విడుదలచేయనున్నాం. ఒక పాట మినహా సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ గీతాన్ని ఈ నెల 14 నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరించనున్నాం' అని తెలిపారు. 'ప్రేమ, కుటుంబ విలువలకు ప్రాధాన్యమున్న చిత్రమిది. ఆద్యంతం సరదాగా సాగుతుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుతున్నాం' అని దర్శకుడు చెప్పారు. నరేష్, లిజి, రోహిణి, రావురమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్. ఎస్. తమన్, కెమెరా: నటరాజ సుబ్రమణియన్ కూర్పు: ఎస్.ఆర్.శేఖర్, సమర్పణ: శ్రీమతి నిఖితారెడ్డి.



అల్లు అర్జున్

రాజధానిలో పోరాటం

'సైనికుడిగా పనిచేసే సూర్యకు దేశమంటే అమితమైన ప్రేమ. కానీ తన కోపమే అతడి పాలిట శత్రువుగా మారుతుంది. తన స్వభావాన్ని మార్చుకోకపోతే చచ్చిపోతావని హెచ్చరించినా లెక్కచేయడు. తాను చచ్చిపోతాను కానీ ఇక్కడ కాదు సరిహద్దుల్లో అంటూ సమాధానం చెబుతుంటాడు. సూర్య ఫైటర్ మాత్రమే కాదు మంచి లవర్ కూడా. ఇంతకీ ఈ సూర్యకథేమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే' అంటున్నారు అల్లు అర్జున్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై కె. నాగబాబు సమర్పణలో లగడపాటి శిరీష, శ్రీధర్ నిర్మిస్తున్నారు. వక్కంతం వంశీ దర్శకుడు. అను ఇమ్మాన్యుయేల్ కథానాయిక. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. నిర్మాతలు మాట్లాడుతూ 'యాక్షన్, భావోద్వేగాలకు ప్రాధాన్యమున్న చిత్రమిది. సైనికుడిగా అల్లు అర్జున్ పాత్ర నవ్యపంథాలో సాగుతుంది. ఇటీవల విడుదలైన చేసిన సైనిక గీతానికి, టీజర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది. ప్రేమికుల రోజు సందర్భంగా ఈ నెల 14న 'లవర్ ఆల్సో..ఫైటర్ ఆల్సో' అనే గీతాన్ని విడుదలచేయనున్నాం. నేటి నుంచి హైదరాబాద్‌లో పతాక ఘట్టాల్ని చిత్రీకరించబోతున్నాం. యాక్షన్ అంశాలతో భారీగా సాగే ఈ సన్నివేశాలు ప్రేక్షకుల్ని అలరిస్తాయి. ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం' అని తెలిపారు. అర్జున్, శరత్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: విశాల్-శేఖర్, సినిమాటోగ్రఫీ: రాజీవ్‌రవి, ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు.

● మేడారం హుండీ ఆదాయం రూ.9.64 కోట్లు



మేడారం సమ్మక్క-సారక్క మహాజాతర హుండీల లెక్కింపు హన్మకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో జరుగుతున్నది. ఆదివారం పగిడిద్దరాజు, గోవిందరాజుల హుండీల్లోని నాణేలను లెక్కించగా రూ.3,43,435 ఆదాయం వచ్చింది. దీంతో కలిపి ఇప్పటివరకు రూ.9,64,92,630 ఆదాయం సమకూరింది. సోమవారం సమ్మక్క-సారక్క హుండీల్లోని నాణేలతో పాటు బంగారం, వెండి, 27 దేశాలకు చెందిన కరెన్సీ వివరాలను వెల్లడిస్తామని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేశ్‌బాబు తెలిపారు.

- రెడ్డి కాలనీ(వరంగల్)

రాష్ట్ర ఆర్థిక కమిషన్ ఆదర్శంగా నిలువాలి

- ఆర్థిక కమిషన్ ఆవిర్భావ సదస్సులో మంత్రి జూపల్లి కృష్ణారావు
- కేసీఆర్ బీసీల పక్షపాతి: స్వామిగౌడ్
- చైర్మన్ రాజేశంగౌడ్, సభ్యుడు చెన్నయ్యకు సన్మానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఆర్థిక కమిషన్ దేశానికే ఆదర్శంగా పనిచేయాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకాంక్షించారు. రవీంద్రభారతిలో రాష్ట్ర ఆర్థిక కమిషన్ ఆవిర్భావ, పరిచయసదస్సు ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆర్థిక కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్, సభ్యుడు చెన్నయ్యను స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన జూపల్లి మాట్లాడుతూ మంత్రిగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా విశేష అనుభవం ఉన్న రాజేశంగౌడ్‌ను ఆర్థికకమిషన్ చైర్మన్‌గా సీఎం కేసీఆర్ నియమించడం అభినందనీయమన్నారు. స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కమిషన్ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఆర్థిక కమిషన్ చైర్మన్ పదవి ఆశామాషీది కాదని, అయితే ఇది రుణాలు ఇస్తుందనే అపోహలో చాలా మంది ఉన్నారని శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి, ఆర్థిక కమిషన్ చైర్మన్ పదవులు బీసీలకే ఇవ్వడం ద్వారా బడుగు బలహీనవర్గాలపై తనకున్న ప్రేమను సీఎం కేసీఆర్ వెల్లడించారని స్వామిగౌడ్ కొనియాడారు. తాము యువకులుగా ఉన్నప్పుడే మంత్రిగా పనిచేసిన అపార అనుభవశాలి రాజేశంగౌడ్ అని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. సీనియర్ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ఆర్థిక కమిషన్ చైర్మన్ బాధ్యతలను రాజేశంగౌడ్ ఆదర్శంగా నిర్వహిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.

సీఎం కేసీఆర్ నమ్మకాన్ని నిలబెడుతా: రాజేశంగౌడ్

సీఎం కేసీఆర్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా బాధ్యతలను నిర్వహిస్తానని ఆర్థిక కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్ తెలిపారు. ప్రజల సొమ్మును సద్వినియోగం చేసే లక్ష్యంతో పనిచేస్తానని చెప్పారు. తనను అభినందించేందుకు వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన స్థానికసంస్థల ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్, ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, రాములు నాయక్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేషన్ చైర్మన్లు బాపురెడ్డి, రాకేశ్, ధర్మపురి దేవస్థానం కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశం, కురుమ సంఘం ట్రస్టు బోర్డు వైస్‌చైర్మన్ దేవర రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్‌ను సన్మానిస్తున్న శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ రాములు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

ధరణి వెబ్‌సైట్ రూపకల్పనకు కసరత్తు

- నేడు సీసీఎల్ఏ కార్యాలయంలో సమావేశం
- హాజరుకానున్న రెవెన్యూ, ఐటీ శాఖల అధికారులు
- మార్చి 11న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూరికార్డుల డేటా సమగ్ర నిర్వహణ కోసం ధరణి పేరిట రూపొందించనున్న వెబ్‌సైట్ రూపకల్పనకు కసరత్తు ప్రారంభమైంది. దీనిపై సోమవారం కీలక సమావేశం జరుగనుంది. భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత రెవెన్యూ రికార్డుల సమర్థవంతమైన నిర్వహణపై దృష్టి సారించిన ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ధరణి వెబ్‌సైట్‌ను రూపొందించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ధరణి వెబ్ డిజైన్, సైట్ అభివృద్ధి, దాని అమలు- నిర్వహణ తదితర అంశాలకు షార్ట్ సర్క్యులేషన్ పద్ధతిలో క్యాబినెట్ ఆమోదం కూడా తెలిపింది. ఈ వెబ్‌సైట్ అభివృద్ధి, అమలు, నిర్వహణ తదితరాల కోసం ప్రభుత్వం రూ.116.5 కోట్లు ఖర్చు చేయనుంది. దీనిని మార్చి 11న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్నారు.రిజిస్ట్రేషన్ శాఖ డేటాకు, సీసీఎల్ఏలోని ల్యాండ్ రికార్డు డేటాను జోడించి సమగ్ర, సమీకృత భూ సమాచారాన్ని ధరణి వెబ్‌సైట్‌లో పొందుపరిచి ప్రభుత్వం అందుబాటులో ఉంచనుంది. ఢిల్లీకి చెందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఐఎల్ అండ్ ఎఫ్ఎస్) టెక్నాలజీస్‌కు ధరణి బాధ్యతలు అప్పగించారు. వెబ్‌సైట్ రూపకల్పన కోసం సోమవారం ఉదయం 11 గంటలకు సీసీఎల్ఏ ప్రధాన కార్యాలయంలో సమీక్షా సమావేశం జరుగనుంది. రెవెన్యూ, ఐటీ అధికారులు, ఐఎల్ఎఫ్ఎస్ టెక్నాలజీస్ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు.

టెక్నాలజీ వాడకంతోనే ఉత్పత్తుల వృద్ధి

- వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నీటిపారుదల, క్షీణించిన నేల ఆరోగ్యం, శీతోష్ణస్థితి మార్పు వంటి సమస్యలతో రైతులకు ఆదాయం తగ్గిపోతున్నదని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు చెప్పారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇండస్ట్రీ, తెలంగాణ ప్రభుత్వం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా రాజేంద్రనగర్‌లో నిర్వహిస్తున్న సీఐఐ అగ్రిటెక్ సౌత్- 2018 ఎగ్జిబిషన్, కాన్ఫరెన్స్ ఆదివారం ముగిసింది. మూడురోజులపాటు జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి 10 వేల మంది రైతులు హాజరయ్యారు. నూతన వ్యవసాయ యంత్రాలను, పనిముట్లను, సాంకేతిక పరిజ్ఞానంపై ఏర్పాటుచేసిన స్టాళ్లను రైతులు ఆసక్తిగా తిలకించారు. సదస్సులో యునైటెడ్ సాధికారిక రైతు సంఘం అధ్యక్షుడు నలుస నరేశ్‌రెడ్డి, మహారాష్ట్రకు చెందిన గుణ్వంత్ పాటిల్ మాట్లాడారు.

కొత్త పారిశ్రామిక పార్కులపై
టీఎస్ఐఐసీ నజర్

రూ.55కోట్లతో మౌలిక సదుపాయాలకు టెండర్లు.. టీఐఎఫ్ ఎమ్మెస్ఎంఈకి బీటీ రోడ్డు నిర్మాణం

వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ ప్రధాన రహదారికి రూ.15 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొస్తున్న పారిశ్రామికవేత్తల అవసరాలకు అనుగుణంగా పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంపై తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ) దృష్టి సారించింది. మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన అనుమతులు వచ్చిన మూడు పార్కుల్లో దాదాపు రూ.55 కోట్లతో టెండర్లను పిలిచింది. టెండర్లు పూర్తి కాగానే వెంటనే పనులు ప్రారంభించడానికి కార్యాచరణను సిద్ధంచేశారు. దీంతోపాటు, టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పలు పార్కులకు శంకుస్థాపన చేయించే దిశగా అడుగులు పడుతున్నాయి. సీడ్ పార్క్, ఎల్ఈడీ పార్కు, దండు మల్కాపూర్ టీఐఎఫ్ సహా పలు పార్కులు శంకుస్థాపనకు సిద్ధంగా ఉన్నాయి. యాదాద్రి జిల్లా దండు మల్కాపురంలో నిర్మించనున్న టీఐఎఫ్ గ్రీన్ ఇండస్ట్రియల్ ఎమ్మెస్ఎంఈ పార్కు వరకు అప్రోచ్‌రోడ్ నిర్మించడానికి టీఎస్ఐఐసీ పనులు వేగవంతమయ్యాయి. జాతీయ రహదారి 65 నుంచి పార్కుస్థలం వరకు బీటీ రోడ్ వేయడానికి రూ.18.73 కోట్లతో అంచనాలు రూపొందించి, టెండర్లను పిలిచారు. దాదాపుగా 400 ఎకరాల్లో ఈ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో దాదాపుగా 400 యూనిట్లు ఇందులో రానున్నాయి. ఇక్కడ పరిశ్రమలు స్థాపించే వారి జాబితా కూడా సిద్ధమైంది. ఈ పార్కుకు సంబంధించి పర్యావరణ అనుమతులకు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీవోఆర్) కు ఆమోదం లభించింది. లేఅవుట్‌ను కూడా సిద్ధంచేశారు. హెచ్ఎండీఏ అనుమతులు రాగానే పార్కులో అంతర్గత మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు ప్రారంభించనున్నారు. వరంగల్ రూరల్ జిల్లా శాయంపేటలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా టెక్స్‌టైల్ పార్కులో ప్రధాన రహదారి, మౌలిక సదుపాయాలకు రూ.15 కోట్లతో టెండర్లను పిలిచారు. క్రాస్ డ్రైనేజీ వర్క్స్ (సీడీ వర్క్స్) ఇతర పనులు చేపట్టనున్నారు. పార్కు ప్రతిపాదిత స్థలంలో ఇప్పటికే ప్రహరీగోడ పూర్తయింది. అంతర్గత రహదారుల నిర్మాణం చురుగ్గా సాగుతున్నది. చింతలపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి సాధ్యాసాధ్యాలపై నివేదిక రూపొందించేందుకు రిక్వెజేషన్ ఫర్ ప్రపోజల్(ఆర్ఎఫ్‌పీ) అందించింది. విద్యుత్, నీటి సరఫరా పనులు చేపట్టేందుకు ఆయాశాఖలకు బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే కామన్ ఎఫ్లూయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(సీఈటీపీ) ఏర్పాటుకు కార్యచరణ సిద్ధంచేశారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో ఏర్పాటుచేయనున్న ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)లో రోడ్ల నిర్మాణానికి రూ.20.88కోట్లతో టెండర్లను పిలిచారు. వీటిలో పెట్టుబడులకు పలు కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. పలుసంస్థలు పార్కు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు పూర్తయ్యాక కంపెనీలకు స్థలాలు కేటాయిస్తారు. మేడ్చల్ జిల్లా కాలకల్ గ్రామంలోని కాన్ఫిడరేషన్ ఆఫ్ వుమెన్ ఎంటర్‌ప్రైన్యూర్స్ (కోవీ) సంస్థ ఫెసిలిటేషన్ సెంటర్‌ను రూ.1.29కోట్లతో నిర్మించనున్నారు.





మాజీసీఎం రోశయ్యకు పురస్కారం అందజేస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ, ఎంపీ సుబ్బరామిరెడ్డి, ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు రమణాచారి తదితరులు కూడా ఉన్నారు.

ఆరాటం కాదు.. పోరాటం చేయాలి

రోశయ్యకు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేటికాలంలో చట్టసభలు నడుస్తున్న తీరు చూస్తుంటే బాధాకరంగా ఉందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో గెలిచి సభలో ప్రజాసమస్యలపై పోరాటం చేయాల్సింది పోయి వాకౌట్లు, నిరసనలతో విలువైన కాలాన్ని వృథా చేస్తున్నారని చెప్పారు. ప్రజాప్రతినిధులు పోరాటం చేయాలి కానీ.. ప్రచారం కోసం ఆరాటపడొద్దని సూచించారు. ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే ప్రజాప్రతినిధులు స్థిరంగా ఉండాలని, పార్టీలుమారే విధానం మంచిది కాదని అన్నారు. రాగసప్తస్వరం, టీ సుబ్బరామిరెడ్డి లలితకళాపరిషత్ సంయుక్తంగా అందిస్తున్న జీవిత సాఫల్యపురస్కారాన్ని ఆదివారం మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు వెంకయ్యనాయుడు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోశయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి, కార్యదక్షుడని కొనియాడారు. రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా వెంకయ్య గుర్తుచేశారు. పురస్కారగ్రహీత రోశయ్య మాట్లాడుతూ ఏనాడూ ఇది కావాలనే లక్ష్యం పెట్టుకోలేదని, రాజకీయాల్లో తనకు వచ్చిన అవకాశాలన్నీ యాదృచ్ఛికమే అని తెలిపారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఎంపీ టీ సుబ్బరామిరెడ్డి, ప్రభుత్వ సాంస్కృతిక సలహాదా రు కేవీ రమణాచారి, పర్యాటకశాఖకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాత్రికేయుడు పీ విజయ్‌బాబు, రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి, రాగసప్తస్వరం అధ్యక్షురాలు వీఎస్ రాజ్యలక్ష్మి, స్పీల్‌వెల్ బండారు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు సంకల్పం నెరవేరాలి

తిరుమలలో శ్రీవారిని కోరుకొన్న మంత్రి హరీశ్‌రావు.. తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పదమూడు కొత్త జిల్లాలను సస్యశ్యామలం చేయనున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం సంకల్పం నెరవేరాలని, తెలంగాణ కోటి ఎకరాల మాగాణం కావాలనే సీఎం కేసీఆర్ కల సాకారం కావాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు.. తిరుమల శ్రీనివాసుడిని కోరుకున్నారు. తిరుమలలో ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి మంత్రి హరీశ్‌రావు శ్రీవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. రెండు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని, పరస్పర అవగాహనతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ తిరుమల తరహాలోనే తెలంగాణలోని యాదాద్రిని అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. కాగా కుటుంబసమేతంగా శనివారం రాత్రి తిరుమలకు చేరుకున్న మంత్రికి టీటీడీ రిసెప్షన్ డిప్యూటీ ఈవో బాలాజీ స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులతో ఆశీర్వాదంతోపాటు, స్వామివారి తీర్థ ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.



ఆదివారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న మంత్రి హరీశ్‌రావు కుటుంబసభ్యులకు జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ అధికారి

తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తమే లక్ష్యం

- 17 వేల కిలోమీటర్ల మేర నలుగురు మహిళల బైక్ యాత్ర
- తూర్పు ఆసియా దేశాల్లో తెలంగాణ విశేషాల ప్రచారం
- యాత్రను ప్రారంభించిన మంత్రి చందూలాల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేందుకు నలుగురు మహిళలు నడుంబిగించారు. 17వేల కిలోమీటర్ల బైక్‌యాత్రకు శ్రీకారం చుట్టారు. జైభారతి, ప్రియ బండారు, ఏఎస్డీ శాంతి, శిల్ప బాలక్రిష్ణన్.. 17వేల కిలోమీటర్ల మేర దేశ విదేశాల్లో పర్యటించి తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటాలని నిర్ణయించుకొన్నారు. మోటర్‌సైకిళ్లపైనే ఈ సాహసయాత్ర కొనసాగుతుంది. ఆదివారం పర్యాటకభవన్‌లో తెలంగాణ మహిళల బైక్‌పై సాహసయాత్రను మంత్రి అజ్మీరాచందూలాల్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. యాత్రకు శ్రీకారం చుట్టిన నలుగురు మహిళలు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలోనే కాకుండా ప్రపంచదేశాల్లో సైతం తెలంగాణ విశిష్టతను చాటిచెప్పడం తమ లక్ష్యమన్నారు. తెలంగాణ విశేషాలను ప్రచారం చేయడంతోపాటు.. ఆయా ప్రాంతాల విశేషాలను తెలుసుకొంటామని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన వీరియాత్ర 50రోజులపాటు కొనసాగనుంది. దేశంలోని పలు రాష్ట్రాలతోపాటు బంగ్లాదేశ్, మయన్మార్, థాయ్‌లాండ్, లావోస్, కంబోడియా, వియత్నాం దేశాల్లో వీరి యాత్ర కొనసాగుతుంది. వివిధ దేశాల్లోని 19 యునెస్కో వారసత్వ కట్టడాలను సందర్శించనున్నారు.



మహిళల బైక్‌యాత్రను ప్రారంభిస్తున్న మంత్రి చందూలాల్, బీ వెంకటేశం

సీఎం కేసీఆర్ బీసీల పక్షపాతి

- కురుమ మహావేదిక ఆవిర్భావసభలో మంత్రి జోగురామన్న

చిక్కడపల్లి: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు బీసీల పక్షపాతి అని బీసీ సంక్షేమ మంత్రి జోగురామన్న అన్నారు. బీసీలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడం కోసం కులవృత్తులకు ప్రోత్సాహం అందిస్తున్నట్టు పేర్కొన్నారు. కురుమ మహావేదిక అధ్యక్షుడు రవీందర్ కురుమ అధ్యక్షతన ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కురుమ మహావేదిక ఆవిర్భావ సభకు మంత్రి జోగురామన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 90 శాతం ఉన్న ఎస్సీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరు శ్రీనివాస్, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, ఎంబీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్, ఎంబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు కేసీ కాలప్ప, కరీంనగర్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు తుల ఉమ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌తో ఉండవల్లి అరుణ్‌కుమార్ భేటీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నిధులపై ఏపీ, కేంద్ర ప్రభుత్వాల వైఖరి సరిగా లేదని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ మండిపడ్డారు. ఈ విషయంలో ఏపీ లేదంటే కేంద్రప్రభుత్వం ఎవరో ఒకరు అబద్ధమాడుతున్నారనే విషయం స్పష్టమవుతుందని అన్నారు. దీనిపై ఈ నెల 15 లోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకతీతంగా ఉండవల్లి అరుణ్‌కుమార్, జయప్రకాశ్ నారాయణతో నిజనిర్ధారణ కమిటీ వేసినట్టు పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఆదివారం ప్రశాసన్‌నగర్‌లోని జనసేన కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌తో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సమావేశమయ్యారు.

కర్ణాటకలో టీభవన్ ఏర్పాటుకు ముందడుగు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కర్ణాటకలో తెలంగాణభవన్ ఏర్పాటుకు కన్నడ రాష్ట్ర తెలంగాణ అసోసియేషన్ (కేఆర్టీయే) ప్రతినిధి బృందం ప్రయత్నాలను వేగవంతం చేసింది. ఇటీవల కర్ణాటక సీఎస్‌ను కలిసిన కేఆర్టీఏ బృందం.. రాబోయే ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను కలుస్తున్నది. తాజాగా మహదేవపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఏసీ శ్రీనివాస్‌తో కేఆర్టీయే అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాల నేతృత్వంలో బృందం సమావేశమైంది. భవన్‌పై కర్ణాటక ప్రభుత్వంతో చర్చిస్తానని స్థలం కేటాయింపులో జాప్యం జరిగితే.. తానే సొంత ఖర్చుతో స్థలం కొనుగోలు చేసి ఇస్తానని శ్రీనివాస్ వారికి హామీ ఇచ్చారు.

తీపి తెలుగు మాగాణం

› మొదటిపేజీ తరువాయి...

పరిగణనలోకి తీసుకొని, ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించింది. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తెలుగును తప్పనిసరి చేసేందుకు సాధ్యాసాధ్యాలను తెలియజేస్తూ సిఫారసులు చేసింది. ఎన్సీఈఆర్టీ, సీబీఎస్ఈ, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ఐసీఎస్ఈ పాఠ్య ప్రణాళికలలోని మెరుగైన అంశాలను, వదిలేయాల్సిన విషయాలను తన నివేదికలో పేర్కొన్నది. ఈ సిఫారసుల మేరకు కేంబ్రిడ్జ్, ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలతోసహా అన్ని ఇంటర్నేషనల్ సీబీఎస్ఈ వంటి పాఠ్యప్రణాళిక అమలులో ఉన్న విద్యాలయాలన్నింటిలోనూ తెలుగుతప్పనిసరి చేస్తూ చట్టాన్ని రూపొందించారు. త్వరలో విధాననిర్ణయానికి సంబంధించిన ఆర్డినెన్స్ వెలువడనున్నది. ముసాయిదా ఆర్డినెన్స్‌ను న్యాయశాఖ పరిశీలనకు పంపించారు. రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తర్వాత ఇది అమల్లోకి వస్తుంది.

పరిపాలనా భాషగా తెలుగు

పాఠశాల స్థాయిలోనే తెలుగును మూడోభాషగా చదువుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి రాష్ట్రంలో పరిపాలనాభాషగా తెలుగును అమలు చేసేందుకు శ్రీకారంచుట్టారు. తెలంగాణ ప్రజలందరూ మాట్లాడుకునే భాషలోనే పరిపాలనా వ్యవహారాలు ఉండాలని, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరువ చేయాలని ఉన్నతాధికారులందరికీ స్పష్టంగా ఆదేశాలిచ్చారు. ఇంగ్లీషుతోపాటు తెలుగులో తప్పనిసరిగా పాలనా వ్యవహారాలు ఉండాలని సూచించారు. భాషా సాంస్కృతిక, పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి అధర్‌సిన్హా వంటి సీనియర్ అధికారులతో సమావేశమై తెలుగు అమలును ప్రజల్లోకి తీసుకొనిపోవాలని ఆదేశించారు. ప్రత్యేకంగా దుకాణ సముదాయాల నామ ఫలకాలన్నీ తెలుగులోనే ఉండాలనే నిబంధనను కచ్చితంగా పాటించేలా చర్యలను చేపట్టారు. కార్మికశాఖ ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు.

మన తెలంగాణ - మన సంస్కృతి

ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ సారథ్యంలో ఎన్సీఈఆర్టీ, మన తెలంగాణ - మన సంస్కృతి పుస్తకాన్ని తీసుకొస్తున్నది. ఉగాదిరోజున కోటిమందికి ఈ పుస్తకాలను పంపిణీ చేస్తారు. తెలంగాణ భౌగోళిక స్వరూపం, చరిత్ర, భాషాసాహిత్యం, సంస్కృతి, పర్యావరణం, ఆరోగ్యం వంటి అధ్యాయాలను ఇందులో ప్రచురించారు. తెలుగు తిథి, వార, నక్షత్రాలు, రాశులు, అయనాలు, మన కళలు, కళాకారుల సంక్షిప్త జీవిత చరిత్రలు, తెలంగాణ తేజోమూర్తుల వివరాలు ఇందులో ఉంటాయి.

తెలుగుభాషా విశిష్ట కేంద్రం

తెలుగుభాషా విశిష్ట కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటుచేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. సాంస్కృతిక, పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం.. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఆర్ట్ గ్యాలరీలో కొంత భవనాన్ని ఈ కేంద్రానికి కేటాయించనున్నారు. సాధారణంగా అన్ని విషయాలలో కొర్రీలు వేయడంలో సిద్ధహస్తులైన ఏపీ సర్కార్ పెద్దలు ఈ విషయంలో అడ్డుపడ్డప్పుడు కేంద్ర ప్రభుత్వం.. ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపింది. రెండు రాష్ట్రాల్లో కూడా తెలుగుభాషా విశిష్ట కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చునని సూచించింది.

ప్రపంచ తెలుగు మహాసభలే స్ఫూర్తి



ప్రపంచ తెలుగు మహాసభల స్ఫూర్తితో బడ్జెట్ సమావేశాల కన్నా ముందుగానే పరిపాలనా భాషగా తెలుగు అమలు, పాఠశాలస్థాయి నుంచి ఇంటర్‌వరకు తెలుగు తప్పన సరి వంటి అంశాలన్నింటిపైన స్పష్టంగా ఆదేశాలు రానున్నాయి. తెలంగాణలో తెలుగువెలుగుల ప్రస్థానం ప్రారంభమైంది.

- కేవీ రమణాచారి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు

శుభపరిణామం



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే తెలుగుభాషకు శుభపరిణామం ఈ ప్రస్థానంలోనే తొలి అడుగు తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ. అకాడమీని ఏర్పాటుచేయగానే ప్రపంచ తెలుగు మహాసభలకు రాష్ట్రముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం చేశారు. తద్వారా తెలుగుభాష ఔన్నత్యాన్ని పరిరక్షించేందుకు ఒక మహాదీక్ష ప్రారంభమైంది. ఈ కార్యాచరణలో భాగమే ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు తెలుగును తప్పనిసరి చేయడం. పాలనాభాషగా ఉత్వర్వులన్నింటిని తెలుగులోనే జరుపాలని నిర్ణయించడం. ఇంటింటికీ తెలుగు భాషా పరిమళాలను పుస్తకరూపంలో పంపిణీ చేయడం. ఈ నిర్ణయాలన్నీ కూడా తెలుగు భాషపైన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉన్న మమకారానికి నిదర్శనాలు.

- నందిని సిధారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు

కోటి పుస్తకాలు పంపిణీచేస్తాం



రాష్ట్రంలో తొలిసారి జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల స్ఫూర్తితో తెలుగును ప్రజలకు చేరువ చేసేందుకు గొప్ప ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలుగుభాషపైన సాధికారిక ప్రజ్ఞగల రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ సంస్కృతి భాషా వికాసాల ప్రాథమిక పరిచయాన్ని తెలియచేసే విధంగా పుస్తకాల వితరణకు కార్యాచరణ రూపొందించాం. ఉగాదిరోజున కోటి పుస్తకాల పంపిణీ జరగాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సంకల్పం. ఆ దిశలో కష్టపడి పనిచేస్తున్నాం

- దేశపతి శ్రీనివాస్, ముఖ్యమంతి కార్యాలయం ప్రత్యేకాధికారి

అందరికీ తెలుగు తెలియాలి



తెలంగాణలో చదువుకుంటున్న ప్రతీ విద్యార్థికి తెలుగు రాయడం, చదవడం తెలియాలనేది ప్రభుత్వ సంకల్పం. రాష్ట్ర ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో అనేక రాష్ట్రాలు పర్యటించాం. వివిధ రాష్ట్రాలలో మాతృభాషను తప్పనిసరిగా చదువుకుంటున్న పరిస్థితులను గమనించాం. రాష్ట్ర ముఖ్యమంత్రికి తుది నివేదికను అందించాం. ముఖ్యమంత్రి తుది నిర్ణయం తీసుకుంటారు.

-ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి

పదోతరగతి వరకు చాలు



ప్రాథమిక స్థాయి నుంచి పదో తరగతి వరకు తెలుగును తప్పనిసరి చేయడం సమర్థనీయం. దశాబ్దాలుగా విద్యాప్రణాళికలలో వస్తున్న మార్పుల కారణంగా ఇంటర్మీడియట్ ఇప్పుడు కీలకంగా మారింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడుతున్న విద్యార్థులకు తెలుగు భారం కాకూడదు. అందుకని పదోతరగతి వరకు మాత్రమే తెలుగును తప్పనిసరి చేయాలని ప్రభుత్వానికి మా విజ్ఞప్తి.

- పీ మధుసూదన్‌రెడ్డి, తెలంగాణ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు



ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్ దంపతులను కలిసి తన వివాహానికి ఆహ్వానిస్తున్న కలెక్టర్ ఆమ్రపాలి



ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్ దంపతులను కలిసి యాదాద్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తున్న యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ వీసీ కిషన్‌రావు, దేవస్థానం ఈవో గీత

ఫలించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రయోగం!

- పౌరసరఫరాలశాఖలో అక్రమాలకు అడ్డుకట్ట
- ఏడాదిలో 843 ప్రాంతాల్లో తనిఖీలు, దాడులు
- 71 క్రిమినల్ కేసులు, 165 6ఏ కేసులు
- అవినీతిని అరికడుతున్నామంటున్న పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పౌరసరఫరాలశాఖ చేసిన ప్రయోగం విజయవంతమైంది. ఏడాది క్రితం పలు విభాగాలకు చెందిన విశ్రాంత ఉన్నతాధికారుల నేతృత్వంలో ఏర్పాటుచేసిన నిఘావ్యవస్థ ప్రజా పంపిణీలో అక్రమాలను అదుపుచేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నది. అవినీతికి అడ్డుకట్ట వేయడం, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్ల ఆగడాలను అరికట్టడం, నాణ్యత విషయంలో రాజీపడకుండా చూసేందుకు పౌరసరఫరాలశాఖ ఫిబ్రవరి 1, 2017న ప్రత్యేక నిఘా బృందం 'ఎన్‌ఫోర్స్‌మెంట్'ను ఏర్పాటుచేసింది. విశ్రాంత పోలీసు, రెవెన్యూ, కమర్షియల్ ట్యాక్స్ తదితర విభాగాలకు సంబంధించిన 20 మంది సభ్యులుగా ఐదు బృందాలను నియమించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహణకు ఏడాదికి రూ. 1.25 కోట్లు వెచ్చిస్తుండగా.. దాదాపు రూ.500 కోట్ల మేరకు అక్రమాలను వారు అరికట్టారు. నిత్యావసర సరుకులు దారిమళ్లకుండా చూడటం, ప్రభుత్వ ప్రైవేట్ గోడౌన్ల తనిఖీ, స్టేజ్ 1, స్టేజ్ 2 రవాణా తనిఖీలు, ఈ పాస్ యంత్రాల వాడకానికి ముందు, తర్వాత లావాదేవీల్లో వచ్చిన మార్పులు, జీపీఎస్ పనితీరు వంటి బాధ్యతలను ఈ బృందాలు సమర్థంగా నిర్వర్తిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి కేసులు కూడా నమోదు చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్లకు, పౌరసరఫరాల సంస్థకు నివేదికలు అందజేస్తున్నాయి. దీంతో జిల్లా కలెక్టర్లు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. 2017 ఫిబ్రవరి నుంచి 2018 జనవరి 31 దాకా రాష్ట్రవ్యాప్తంగా 843 ప్రాంతాల్లో ఈ బృందాలు ఆకస్మికదాడులు, తనిఖీలు నిర్వహించి రూ.3కోట్ల 60లక్షల విలువచేసే 12, 915 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 2,619 క్వింటాళ్ల సీఎంఆర్ ధాన్యాన్ని, అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 3.90 లక్షల విలువగల చక్కెర, ఎల్పీజీ సిలిండర్లు, కిరోసిన్‌ను స్వాధీనం చేసుకున్నాయి. 165 మందిపై 6ఏ కేసులు, 71 మందిపై క్రిమినల్ కేసులను నమోదు చేశాయి.



మంచి ఫలితాలు వస్తున్నాయి

ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. దాడులు నిర్వహించడంవల్ల అక్రమాలు చేసేవారిలో భయం ఏర్పడింది. ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ముగ్గురిపై పీడీ కేసులు నమోదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమార్కులపై కేసులు నమోదు చేశారు.

- సీవీ ఆనంద్, పౌరసరఫరాలశాఖ కమిషనర్

రబ్బర్ తొడుగులతో బయోమెట్రిక్

- ఫ్యాకల్టీ, ఎంటెక్ విద్యార్థులకు అటెండెన్స్
- ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల అక్రమాలు
- సిలికాన్ స్టాంప్స్‌ను ఉపయోగించే అవకాశం: జేఎన్టీయూహెచ్
- ఆధారాలుంటే చర్యలు: ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని కొన్ని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం స్థానంలో.. రబ్బరు (సిలికాన్)తో తయారుచేసిన వేలిముద్రల తొడుగులను ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలొస్తున్నాయి. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాల పరిధిలోని కొన్ని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు ఇలాంటి రబ్బరు తొడుగుల ద్వారా అటెండెన్స్‌ను స్వీకరిస్తున్నట్టు అనుమానాలున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ – విజయవాడ హైవే రోడ్డు వైపు ఏర్పాటైన కొన్ని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్టు సమాచారం. బీటెక్, ఎంటెక్‌తోపాటు ఎంబీఏ, ఎంసీఏ వంటి అన్నిరకాల వృత్తి విద్యా కాలేజీల్లో బయోమెట్రిక్ అటెండెన్స్ స్వీకరణను జేఎన్టీయూహెచ్ తప్పనిసరిగా అమలుచేస్తున్నది. దీనిని అమలు చేయని ఇంజినీరింగ్ కాలేజీలకు అఫిలియేషన్ నిరాకరించాలని జేఎన్టీయూహెచ్ నిర్ణయించింది. రాష్ట్రంలోని 60శాతానికి పైగా ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు ఈ విధానాన్ని చిత్తశుద్ధితో అమలుచేస్తున్నాయి. అయితే హైదరాబాద్ శివార్లలోని కొన్ని కాలేజీలు, వివిధ జిల్లాల్లోని కొన్ని కాలేజీల్లో ఫ్యాకల్టీకి, ఎంటెక్ విద్యార్థుల కోసం రబ్బరు తొడుగుల(సిలికాన్ స్టాంప్స్) సహాయంతో అటెండెన్స్‌ను స్వీకరిస్తూ రికార్డుల్లో చూపిస్తున్నారని జేఎన్టీయూహెచ్ అధికారులు భావిస్తున్నారు. యూజీసీ స్కేళ్లతో జీతాలు చెల్లించలేని కొన్ని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు ఇలాంటి దొడ్డిదారులను వెతుకుతున్నట్టు అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బీటెక్ పూర్తిచేసిన కొంతమంది ఇతర ఉద్యోగాలు చేసుకుంటూ ఎంటెక్, ఎంఫార్మసీ కాలేజీల్లో ప్రవేశం పొందుతున్నారు. హాజరు పట్టికలను నిర్వహిస్తూ.. కాలేజీలకు రాకుండా ఉండేందుకు యాజమాన్యాలతో బేరాలు చేసుకుంటారు. గతంలో మాన్యువల్‌గా అటెండెన్స్‌ను నిర్వహించేవారు. ఇప్పుడు బయోమెట్రిక్ అటెండెన్స్‌ను ప్రవేశపెట్టడంతో విద్యార్థి వేలిముద్రల ద్వారా రబ్బరు తొడుగులను తయారుచేయించి, వాటి సహాయంతోనే అటెండెన్స్‌ను స్వీకరిస్తున్నారు. రబ్బరు తొడుగులతో విద్యార్థుల వేలిముద్రలను తయారుచేసే కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవడానికి కాలేజీలు క్యూ కడుతున్నాయన్న విషయాన్ని కొన్ని కాలేజీ యాజమాన్యాలే స్వయంగా అంగీకరించడం విశేషం.

చర్యలు తీసుకుంటాం: అధికారులు

రబ్బరు తొడుగుల ద్వారా బయోమెట్రిక్ అటెండెన్స్ విధానానికి పాల్పడుతున్న ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలను గుర్తించేందుకు ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తున్నామని జేఎన్టీయూహెచ్ అధికారులు తెలిపారు. పక్కా ఆధారాలను సేకరించి, నిర్ధారించిన అనంతరం కాలేజీలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అటెండెన్స్ అక్రమాలకు పాల్పడుతున్న కాలేజీలపై చర్యలు తీసుకోవడానికి యూనివర్సిటీ అధికారులతో సంప్రదింపులు జరుపుతామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు.

రబ్బరు తొడుగలతో అటెండెన్స్ స్వీకరిస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోండి

తెలంగాణ ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు గౌతంరావు

రబ్బరు తొడుగులతో బయోమెట్రిక్ అటెండెన్స్ స్వీకరిస్తున్న కాలేజీలు రాష్ట్రంలో లేవని.. ఒకవేళ అలాంటి కాలేజీలు ఉంటే వాటిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు గౌతంరావు పేర్కొన్నారు. జేఎన్టీయూహెచ్ మాదిరిగానే బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని ఓయూ, కేయూ పరిధిలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో కూడా అమలుచేయాలని కోరారు.

దోస్త్ అడ్మిషన్లపై కరపత్రాలు

- ప్రతి జూనియర్ కాలేజీ విద్యార్థికి చేరేవిధంగా చర్యలు
- డిగ్రీ కాలేజీలన్నిటికీ ఒకే ఫీజులు
- ఆన్‌లైన్ దరఖాస్తులకు ప్రత్యేక యాప్
- ఈ నెలాఖరులోగా మార్గదర్శకాలు
- మార్చి మొదటివారం లేదా రెండోవారంలో దోస్త్-2018 నోటిఫికేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం నిర్వహించనున్న డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ల విధానం (దోస్త్)పై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం కల్పించాలని దోస్త్-2018 నిర్వహణ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందుకోసం నూతన మార్గదర్శకాలు, విధివిధానాలు, అర్హతలతో తయారుచేసిన కరపత్రాలను రాష్ట్రంలోని అన్నిరకాల జూనియర్ కాలేజీల విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. ఈ విషయంలో ఇంటర్మీడియట్ విద్యామండలి అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. అదేవిధంగా ఇంటివద్ద నుంచే దోస్త్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకునే విధంగా మొబైల్ యాప్‌ను తీసుకువచ్చే ప్రయత్నానికి కూడా అధికారులు శ్రీకారం చుట్టారు. అందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు.

కామన్ ఫీజు విధానంపై చర్చ

దోస్త్ అడ్మిషన్ల నేపథ్యంలో అన్నిరకాల డిగ్రీ కాలేజీల్లో కామన్ ఫీజు విధానం అమలుచేస్తే ఎలా ఉంటుంది? అన్న అంశంపైనా చర్చించనున్నారు. దీనిపై ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల నుంచి సలహాలు, సూచనలను తీసుకుంటామని దోస్త్ నిర్వహణాధికారి ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. గత రెండేండ్లుగా సగం సీట్లు మిగిలిపోతున్నాయని, ఈసారి అలాంటి అవగాహన లోపం తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

స్పాట్ అడ్మిషన్లకూ అవకాశం

రాష్ట్రంలో అన్నిరకాల డిగ్రీ కాలేజీలలో కలిపి మొత్తం 4.20 లక్షల సీట్లు ఉన్నాయి. కాని వాటిలో 2 లక్షల సీట్లు మాత్రమే నిండాయి. దాదాపు 2.20 లక్షల వరకు సీట్లు మిగిలాయి. ఈ క్రమంలో నాలుగు దశల్లో మాత్రమే దోస్త్ అడ్మిషన్లను నిర్వహించారు. స్పాట్ అడ్మిషన్లకు అవకాశం ఇవ్వలేదు. చాలామంది విద్యార్థులు డిగ్రీ కాలేజీలలో సీట్లు పొందలేక ఇబ్బందులు పడ్డారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మొదటిదశ, రెండోదశ కౌన్సెలింగ్‌తో పాటు స్పాట్ ద్వారా కూడా మిగిలిన సీట్లను భర్తీ చేసుకునే విధానాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు అధికారులు తెలిపారు. మార్చి మొదటివారం లేదా రెండోవారంలో దోస్త్-2018 అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ జారీచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని దోస్త్ నిర్వాహకులు పేర్కొన్నారు.

దోస్త్ వైపు బడా డిగ్రీ కాలేజీల మొగ్గు

గత రెండు విద్యాసంవత్సరాల నుంచి దోస్త్ అడ్మిషన్ల విధానంలో పాల్గొనని కొన్ని ప్రైవేటు బడా డిగ్రీ కాలేజీలు కూడా ఈసారి దోస్త్ పరిధిలోకి రావాలని భావిస్తున్నాయి. దోస్త్ అధికారులకు అర్జీ పెట్టుకుంటున్నాయి.

డిగ్రీ కాలేజీల గ్రేడింగ్‌కు కమిటీలు!

- సీనియర్ ప్రొఫెసర్లతో జిల్లాలవారీగా ఏర్పాటు
- ప్రైవేటు యాజమాన్యాలకూ ప్రాతినిధ్యం
- ఉన్నత విద్యామండలి కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలకు గ్రేడింగ్ ఇచ్చే విధానాన్ని తీసుకొచ్చేందుకు ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తున్నది. గ్రామీణ, పట్టణ, మహానగర ప్రాంతాలవారీగా డిగ్రీ కాలేజీలను విభజించి, గ్రేడింగ్ ఇవ్వాలని భావిస్తున్నది. మూడేండ్ల నుంచి ఆయా కళాశాలల్లో ప్రవేశాలు, ఉత్తీర్ణత శాతం, బోధన, బోధనేతర సిబ్బందికి చెల్లిస్తున్న జీతాలు, వసూలుచేస్తున్న ఫీజులను గ్రేడింగ్ విధానంలో పరిగణనలోకి తీసుకోవాలని యోచిస్తున్నది. డిగ్రీ కళాశాలలకు గ్రేడింగ్ ఇచ్చే అంశంపై జిల్లాలవారీగా సీనియర్ ప్రొఫెసర్లతో కమిటీలను ఏర్పాటుచేయనున్నారు. కమిటీల్లో ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘం ప్రతినిధికి సభ్యుడిగా అవకాశం కల్పించనున్నారు.

ఇంజినీరింగ్, ఇతర సాంకేతిక విద్య కాలేజీలకూ గ్రేడింగ్

రాష్ట్రంలో పలు విశ్వవిద్యాలయాల పరిధిలో కొనసాగుతున్న ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలతోపాటు ఎంబీఏ, ఎంసీఏ, బీఎడ్, లా తదితర కళాశాలలకు కూడా గ్రేడింగ్ ఇవ్వాలని ఉన్నత విద్యామండలి అధికారులు భావిస్తున్నారు. దీనివల్ల నాణ్యమైన విద్యాబోధన ఎక్కడ లభిస్తుందనే విషయం విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలుస్తుందని చెప్తున్నారు. ఇప్పటికే నాణ్యత ప్రమాణాలు పాటించే కళాశాలలను ప్రోత్సహించేందుకు కేంద్రం వర్సిటీలు, కాలేజీలకు న్యాక్ గుర్తింపు ఇస్తుంది. వృత్తి కాలేజీలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రెడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు ఇస్తున్నారు. రాష్ట్రంలోని కళాశాలలకు గ్రేడింగ్ ఇవ్వడం మంచిదేనని సీనియర్ ప్రొఫెసర్లు, ప్రైవేటు కాలేజీ యాజమానులు చెప్తున్నారు. దీనిపై త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని విద్యామండలి అధికారులు తెలిపారు. డిగ్రీ కళాశాలలకు గ్రేడింగ్ ఇవ్వాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తామని ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్‌రెడ్డి చెప్పారు. దీనివల్ల నాణ్యత పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ట్యూషన్ ఫీజులను పెంచాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తిచేశారు.



కండెలు పట్టే చిన్న యంత్రం



జరి పోసే యంత్రం



ఆమనగల్లులో మగ్గాలు నేస్తున్న ధర్మవరం కార్మికులు

మళ్లీ మగ్గాల సందడి

శిరందాస్ ప్రవీణ్‌కుమార్
సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో చేనేతరంగం కొత్త కళను సంతరించుకుంది. అనూహ్యంగా డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీంతో ఒకప్పుడు పొట్ట చేతపట్టుకుని హైదరాబాద్‌కు వలస వచ్చిన చేనేత కార్మికులు.. చిన్నాచితక ఉద్యోగాలను వదిలిపెట్టి.. మగ్గాలపై తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నిండైన చీరెలు, మెండైన బార్డర్లతో సరికొత్త నమూనాలతో చీరలు తయారు చేసే నైపుణ్యం ఉన్న కార్మికులు.. మళ్లీ తమ ప్రతిభను చాటుతున్నారు. వెండిజరీ, నాణ్యమైన సిల్క్‌తో చీరెలను నేయగల నేర్పును సొంతం చేసుకున్న తెలంగాణ చేనేత కార్మికులు.. కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్నారు. అనంతపురం నుంచి ఇక్కడకు వలస వచ్చినవారు సైతం మళ్లీ చేనేత పనిలో నిమగ్నమవుతున్నారు. బ్రైడల్ కలెక్షన్‌కు అవసరమైన మెటీరియల్ రూపకల్పన సైతం ఇక్కడ సాధ్యపడుతున్నది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, ముంబైలకు చెందిన ప్రముఖ డిజైనర్లు కోరుకున్న డిజైన్ల ఉత్పత్తి సామర్థ్యం ఇక్కడే ఉన్నది. అందుకే ఉపాధి లేక పట్నమొచ్చిన వారంతా తిరిగి చేనేత వృత్తుల్లోకి ప్రవేశిస్తున్నారు. ఊర్లకు తిరిగి వెళ్లలేనివారు, పిల్లల చదువులను దృష్టిలో పెట్టుకున్నవాళ్లు హైదరాబాద్‌లోనే ఉంటూ మగ్గాలు నేయడం ఆరంభించారు. ప్రధానంగా ఎల్బీనగర్, హయత్‌నగర్, ఉప్పల్, కాటేదాన్ ప్రాంతాల్లో ఊర్ల నుంచి వలసొచ్చిన వాళ్లు తిరిగి మగ్గాలు నేస్తుండటం విశేషం. నగరశివార్లలో కొందరు మాస్టర్ వీవర్లు ఇండ్లను కొనుగోలు చేస్తున్నారు. కొందరేమో కిరాయికి తీసుకొని నడిపించేందుకు సిద్ధమవుతున్నారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో ఓ మాస్టర్‌వీవర్ మూడు ఇండ్లను కిరాయికి తీసుకొని మగ్గాలు నేయిస్తున్నారు. త్వరలోనే తుర్కయాంజాల్‌లో ఓ భవంతిని కొనుగోలు చేసి 50 మగ్గాల వరకు నడిపించేందుకు ప్లాన్ చేసుకున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో కొత్త కళ

- తెలంగాణ పట్టు చీరెలకు భారీ డిమాండ్
- పనికోసం పొరుగు రాష్ట్రాల కార్మికుల రాక
- నగరశివార్లలో కార్ఖానాల ఏర్పాటుకు ప్లాన్
- ఆమనగల్లు, హయత్‌నగర్‌లోనూ కొత్తమగ్గాలు

అనంతపురం నుంచి వలసలు

తెలంగాణ కంచి చీరెలకు డిమాండ్ పెరిగింది. వృత్తి నైపుణ్యం కలిగిన కార్మికులు ఆ చీరెల తయారీలో నెలకు రూ.30 వేలకు పైనే సంపాదిస్తున్నారు. నెలకు డిజైన్లను బట్టి ఒకటి రెండు నేసినా కుటుంబం హాయిగా గడిచే స్థాయిలో కూలీ గిట్టుబాటు అవుతున్నది. గతంలో చేనేతరంగంలో ఉపాధికి కేంద్రంగా ధర్మవరం ఉండేది. కానీ అక్కడి నుంచే కార్మికులు తెలంగాణకు వలస వస్తుండటం గమనార్హం. తాజాగా కొన్ని కుటుంబాలు ఆమనగల్లుకు వచ్చాయి. కంచి చీరలను నేసేందుకు ఇండ్లను కిరాయికి తీసుకొని అక్కడే ఉంటున్నారు. పెద్దబార్డర్, వెండిజరీ చీరెలను నేస్తున్నారు. కొన్నిరోజుల పాటు కొత్త డిజైన్లను నేసేందుకు శిక్షణ ఇచ్చే బాధ్యతను మాస్టర్‌వీవర్లు తీసుకుంటున్నారు. చీరల డిమాండ్ భారీగా ఉండడంతో ఇటీవల ఇద్దరు మాస్టర్‌వీవర్లు కార్మికుల కోసం ధర్మవరం వెళ్లారు. హైదరాబాద్ శివార్లలో నివాస, ఉపాధి సదుపాయం కల్పిస్తే వెంటనే వచ్చేందుకు సిద్ధమని పలువురు కార్మికులు చెప్పారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయడంలో మాస్టర్ వీవర్లు నిమగ్నమయ్యారు.

టెక్నాలజీ అప్‌గ్రేడ్‌తో చేనేత చీరెలు

గతంలో చేతితోనే నిలువు పేక, కండెలను తయారుచేసుకునేవారు. ఇప్పుడు ఆసు పోయడంతోపాటు కండెలు పట్టేందుకు సొంతంగా యంత్రాలను తయారు చేసుకుంటుండటంతో పనిభారం తగ్గిందని ఆమనగల్లుకు చెందిన మాస్టర్‌వీవర్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఫ్యాషన్ డిజైనర్లు ఏ డిజైన్ ఇస్తే.. దానికి అనుగుణంగా పింజర్లు, డిజైన్ అట్టలకు పంచింగ్ చేసుకునే పరిజ్ఞానాన్ని సంపాదించుకున్నామన్నారు. ధర్మవరం, కాంచీపురం వెళ్లి ఈ పరిజ్ఞానాన్ని నేర్చుకున్నామని వివరించారు. తమ దగ్గర ధర్మవరం, జనగామ ప్రాంతాలకు చెందిన కార్మికులు మగ్గాలు నేస్తున్నారని, త్వరలోనే మరికొందరిని తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రధానంగా తెలంగాణలో నాణ్యతతో కూడిన కంచి చీరెలకు డిమాండ్ పెరిగింది. ఒక్కో చీర రూ.40 వేల నుంచి రూ.లక్షన్నర దాకా పలుకుతున్నది. కంచి చీరెల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన కార్మికులకు రానున్న రోజుల్లో ఉపాధి అవకాశాలు పెరుగనున్నాయి. అనేక నకిలీలు మార్కెట్లోకి వస్తున్న నేపథ్యంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన డిజైనర్లు ఇక్కడివారికే ఆర్డర్లు ఇస్తున్నారు. అందుకే తెలంగాణ చేనేతకు ముమ్ముందు ఇంకా మంచి రోజులు రానున్నాయని మాస్టర్ వీవర్లు అంటున్నారు.

ధర్మవరం టెక్నాలజీతో..

చేనేతమగ్గంపై నాణ్యత కలిగిన కంచి చీరెలు నేయడం అంత సులువు కాదు. మగ్గం, దానిపై ఉండే పింజర్లు, వేలాడే డిజైన్ల కవర్లు, కదలాడే చైన్లు, లయబద్ధంగా కదిలే మందపు దారాలను చూస్తే చాలు.. దానిలో ఎంతటి నైపుణ్యం ఉంటుందో అర్థమవుతుంది. ఎప్పటికప్పుడు మారే డిజైన్లను బట్టి చీరెలను రూపొందించడం మామూలు విషయం కాదు. ఇప్పటిదాకా అలాంటి పింజర్లు రూపొందించడం ధర్మవరం కార్మికులకే సాధ్యంగా చెప్పుకునేవారు. చాలామంది అక్కడి నుంచే కొనుగోలు చేసేవారు. ఏదైనా చెడిపోయిందంటే తిరిగి అక్కడికే వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడా టెక్నాలజీని కూడా నేర్చుకున్నారు. ఆఖరికి స్టాండ్ మగ్గాన్ని కూడా సొంతంగా తయారుచేయగల నైపుణ్యాన్ని సాధించారు. ఆమనగల్లులో ఓ మాస్టర్ వీవర్ సొంతంగా స్టాండ్ మగ్గాలను తయారుచేసేందుకు ఐరన్ కట్టింగ్, వెల్డింగ్ యంత్రాలన్నీ కొనుగోలుచేశారు. డిమాండ్ పెరుగడంతో బెంగళూరులోని బహుళజాతి కంపెనీలో పనిచేస్తున్న తన తమ్ముడిని కూడా కంచి చీరెల డిజైన్ల తయారీకి నియమించడం విశేషం.

మౌలానా నద్వీ బహిష్కరణ

- ముస్లిం పర్సనల్ లా బోర్డు సంచలన నిర్ణయం
- బాబ్రీ వివాద పరిష్కారంకోసం రవిశంకర్‌తో చర్చలు జరిపినందుకు వేటు
- మసీదు అస్తిత్వాన్ని ఎవరూ మార్చలేరు
- ప్రత్యామ్నాయ స్థలాన్ని అంగీకరించేది లేదు
- ట్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభలో విపక్షాలు అడ్డుకోవాలి
- ముస్లిం పర్సనల్ లాబోర్డు డిక్లరేషన్‌లో పలు తీర్మానాలు



ఆదివారం ఒవైసీ దవాఖానలో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సమావేశాల ముగింపు అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ. చిత్రంలో జాఫర్ యాబ్ జిలానీ, కమాల్ ఫారుఖీ, అస్మా జాహెరా, మౌలానా ఖాలేద్ సైపుల్లా తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అయోధ్యలో బాబ్రీ–మందిర్ వివాదాన్ని కోర్టు బయట పరిష్కరించేందుకు ప్రయత్నించినందుకు, మసీదును మరోచోటికి తరలించవచ్చని సూచించినందుకు.. అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు కార్యవర్గ కమిటీ సీనియర్ సభ్యుడు మౌలానా సల్మాన్ హుస్సేనీ నద్వీని బోర్డు బహిష్కరించింది. బాబ్రీ మసీదు విషయంలో బోర్డు గతంలో తీసుకొన్న వైఖరిలో ఎలాంటి మార్పులేదని, మసీదు కోసం ఎలాంటి కొత్త ప్రతిపాదనలను అంగీకరించేదిలేదని స్పష్టంచేసింది. కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్ తలాక్‌పై తీసుకొచ్చిన బిల్లు మహిళావ్యతిరేకమైందని ప్రకటించింది. బోర్డు 26వ ప్లీనరీ ముగింపు సందర్భంగా ఆదివారం 'హైదరాబాద్ డిక్లరేషన్' పేరిట పలు తీర్మానాలు చేసి ఆమోదించింది. హైదరాబాద్‌లోని కాంచన్‌బాగ్ వద్ద ఒవైసీ దవాఖాన ప్రాంగణంలో మూడురోజులపాటు జరిగిన ప్లీనరీకి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 400 మంది ఉలేమాలు, సామాజిక, రాజకీయ ప్రముఖులతోపాటు పలువురు ప్రత్యేక ఆహ్వానితులు హాజరయ్యారు. ముస్లింల విషయంలో కేంద్ర ప్రభుత్వ పనితీరు, ఇస్లామిక్ షరియా సంరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ట్రిపుల్ తలాక్ బిల్లు, బాబ్రీమసీదు–రామమందిర వివాదాస్పద స్థలం కేసు, ముస్లిం సమాజంలో చైతన్యం తీసుకొనిరావడానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఇస్లామిక్ చట్టాలకు ముస్లింలు కట్టుబడి ఉండటానికి తీసుకోవాల్సిన చర్యలతో పాటు మరి కొన్ని తీర్మానాలను బోర్డు ఆమోదించింది. హైదరాబాద్ తీర్మానాల వివరాలను ఏఐఎంపీఎల్బీ కార్యదర్శి బాబ్రీ మసీదు కేసును వాదిస్తున్న జఫర్ యాబ్ జిలానీ ఆదివారం మీడియాకు వివరించారు.

సుప్రీం తీర్పుకు కట్టుబడి ఉంటాం

బాబ్రీ మసీదు కేసును కోర్టు బయట పరిష్కరించేందుకు ఎవరితోనూ చర్చలు చేపట్టరాదని, సుప్రీంకోర్టు తీర్పుకు కట్టుబడి ఉండాలని బోర్డు నిర్ణయం తీసుకొన్నది. ఒకసారి మసీదు ఉన్నప్రాంతం చివరి వరకు మసీదుగానే ఉంటుందని, దానిఅస్తిత్వం చెరిగిపోదని స్పష్టం చేసింది. మసీదును మరోచోటుకు మార్చడంగాని, ఆ స్థలాన్ని ఇతరులకు అమ్మడం, బహుమతిగా ఇవ్వడానికి గానీ ఇస్లాంలో అనుమతిలేదని బోర్డు స్పష్టంచేసింది. ఈ కేసులో తీర్పు మసీదుకు అనుకూలంగానే వస్తుందనే ఆశాభావాన్ని బోర్డు వ్యక్తంచేసింది.

ట్రిపుల్ తలాక్ బిల్లును అడ్డుకోండి: ప్రతిపక్షాలకు బోర్డు విజ్ఞప్తి

ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ బిల్లు ప్రస్తుత రూపంలో రాజ్యసభలో ఆమోదం పొందకుండా చూడాలని పర్సనల్ లా బోర్డు ప్రతిపక్ష పార్టీలను కోరింది. సవరణలు చేయకుండా. యథాతథంగా అమలు చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తున్నదని, దీనివల్ల ముస్లిం మహిళలకు తీరని నష్టం కలుగుతుందని పేర్కొంది. బిల్లు ఆమోదం పొందితే సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తామని బోర్డు స్పష్టంచేసింది.

కూల్చివేతకు ముందు రాత్రి కూడా నమాజు జరిగింది

బాబ్రీ కూల్చివేతకు ముందు రాత్రి వరకు మసీదులో నమాజు జరిగిందని మరో కార్యదర్శి మౌలానా ఖాలీద్ సైపుల్లా రహ్మానీ అన్నారు. బోర్డును హైజాక్ చేయడం ఎవరికి సాధ్యం కాదన్నారు. అయోధ్యలో వివాదాస్పద స్థలం 1950–51 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో మసీదుగా ఉన్నదని పేర్కొన్నారు. ముస్లిం పర్సనల్‌లా బోర్డు మహిళా విభాగం ఆధ్వర్యంలో తలాక్ విషయంలో ముస్లిం మహిళలను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపడుతున్నట్లు అస్మా జహేరా తెలిపారు. ఇస్లామిక్ అంశాలను ముస్లిం సమాజానికి చేరవేసి వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు రాష్ట్రాలవారీగా బోర్డు శాఖలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

బోర్డును ధిక్కరించిన నద్వీ.. అందుకే బహిష్కరణ

కార్యవర్గ సభ్యుడు సల్మాన్ నద్వీ అయోధ్య వివాదంపై బోర్డు అనుమతి లేకుండా ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్‌తో చర్చలు జరుపడాన్ని బోర్డు తప్పుపట్టింది. వర్కింగ్ కమిటీ సమావేశంలో సల్మాన్ నద్వీ వ్యవహారంపై జరిగిన చర్చను జిలానీ వివరించారు. 1991,1993లో బోర్డు చేసిన తీర్మానాలకు విరుద్ధంగా కోర్టు బయట చర్చలు జరుపుతున్న నద్వీపై క్రమశిక్షణ చర్యలకు సభ్యులు పట్టుబట్టారన్నారు. నలుగురు సభ్యుల విచారణ కమిటీ సిఫారసు మేరకు బోర్డు ఆయన్ను బహిష్కరించిందని చెప్పారు.మరోవైపు బహిష్కరణ వేటుకు గురైన సల్మాన్ నద్వీ మీడియాతో మాట్లాడుతూ పర్సనల్‌లా బోర్డుకు కాలం చెల్లిందని, ముగ్గురు సభ్యులు దాన్ని హైజాక్ చేశారని ఆరోపించారు. ఈ నెల 20న తిరిగి అయోధ్యలో రవిశంకర్‌తో భేటీ అవుతానన్నారు.

ట్రిపుల్ తలాక్ ఇస్లాంలో నేరం

సమావేశాల ముగింపు అనంతరం బోర్డు కార్యదర్శులు మౌలానా ఖాలేద్ సైపుల్లా రహ్మానీ, జఫర్‌యాబ్ జిలానీ, కార్యవర్గసభ్యులు అసదుద్దీన్ ఒవైసీ (ఎంపీ), మౌలానా డాక్టర్ యాసీన్ ఉస్మానీ, కమాల్ ఫారుఖీ, బోర్డు మహిళా విభాగం హెడ్ డాక్టర్ అస్మా జాహెరాలతో కలిసి బోర్డు కార్యదర్శి మౌలానా ఉమ్రేన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ట్రిపుల్‌తలాక్‌ను ఇస్లాం నేరంగా పరిగణిస్తుందన్నారు. ఒకేసారి ట్రిపుల్ తలాక్ చెప్పకూడదని, ఇది ఇస్లాంకు విరుద్ధమని ఆయన ముస్లిం పురుషులకు సూచించారు. తలాక్ అనివార్యమైనప్పుడు మూడు నెలలు వివిధ విధానాలు పాటించిన తరువాత అప్పటికీ భార్యతో భర్త కలిసి ఉండలేని పరిస్థితి ఏర్పడితేనే ట్రిపుల్ తలాక్‌ను అమలు చేయడానికి వీలున్నదని చెప్పారు.

గతేడాది రూ.81,683 కోట్లు

- పీఎస్‌బీలు రద్దు చేసిన మొండి బకాయిలు ఇవే..
- అగ్రస్థానంలో ఎస్‌బీఐ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో రూ.20,339 కోట్ల మొండి రుణాలను రద్దు చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లన్నీ కలిపి మొత్తం రూ.81,683 కోట్ల మొండి బకాయిలను రద్దు చేయగా, అందులో ఎస్‌బీఐ వాటాయే అత్యధికం. ఈ గణాంకాలు కూడా అనుబంధ బ్యాంకుల విలీనానికి ముందువి కావడం గమనార్హం. 2012-13లో పీఎస్‌బీలన్నీ కలిపి రూ.27,231 కోట్ల మొండి బకాయిలను రద్దు చేయగా.. ఆ తర్వాత మూడేండ్లలో ఈ మొత్తం ఐదు రెట్లు పెరిగింది. 2013-14లో రూ.34,409 కోట్లు, 2014-15లో రూ.49,018 కోట్లు, 2015-16లో రూ.57,585 కోట్లు, 2017 మార్చి నెలాఖరు నాటికి మరో రూ.81,683 కోట్ల బకాయిలను రద్దు చేసినట్లు ప్రభుత్వ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) అత్యధికంగా రూ.9,205 కోట్ల మొండి బకాయిలను రద్దు చేయగా, బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.7,346 కోట్లు), కెనరా బ్యాంక్ (రూ.5,545 కోట్లు), బ్యాంక్ ఆఫ్ బరోడా (రూ.4,348 కోట్లు) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లోని తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబర్)నూ పీఎస్‌బీలు మరో రూ.53,625 కోట్ల మొండి బకాయిలను రద్దు చేశాయి.

హైదరా బాద్‌షా!

- ప్రతికూల పరిస్థితుల్లోనూ రాజధానిలో రియల్ ఎస్టేట్ పరుగులు
- దేశంలోనే అద్దెలకు అత్యధికంగా డిమాండ్.. 4 శాతం పెరిగిన రెంట్లు
- ఇతర మెట్రో నగరాల కంటే భాగ్యనగరమే ఆకర్షణీయం
- 99ఏకర్స్‌డాట్‌కామ్ అధ్యయనంలో వెల్లడి
- మెట్రో రైల్ ప్రాజెక్టుతో మియాపూర్-నాగోల్ రియల్టీ మార్కెట్‌లో జోష్

ముంబై, ఫిబ్రవరి 11:

ప్రతికూల పరిస్థితుల్లోనూ హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం దూసుకుపోతున్నది. దేశంలోని ఇతర మెట్రో నగరాల కంటే హైదరాబాద్‌లోనే అద్దెలకు అధిక డిమాండ్ కనిపిస్తున్నది మరి. ప్రాపర్టీ పోర్టల్ 99ఏకర్స్‌డాట్‌కామ్ అధ్యయనం ప్రకారం అంతకు ముందు ఏడాదితో పోల్చితే గతేడాది అక్టోబర్-డిసెంబర్ వ్యవధిలో హైదరాబాద్ అద్దెలు సగటున 4 శాతం పెరిగాయి. వ్యాపారానికి అనువైన పరిస్థితులు, మెరుగైన రవాణా సదుపాయాలు, మౌలిక వసతులు, నిర్మాణాలకు వేగవంతమైన అనుమతులతో నూతన సంస్థలు, కార్యాలయాల ఏర్పాటుకు అంతా హైదరాబాద్‌నే ఎంచుకుంటున్నారు. ఇక కోల్‌కతాలోనూ 4 శాతం డిమాండ్ కనిపించినట్లు 99ఏకర్స్ తెలియజేసింది. అయితే బెంగళూరు, ముంబైల్లో మాత్రం 3 శాతం వృద్ధే నమోదైందని పేర్కొంది. పాత పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), నిర్మాణ రంగ నియంత్రణ చట్టం (రెరా) ప్రభావంతో మందగమనంలో పడిపోయిన భారతీయ రియల్ ఎస్టేట్.. తిరిగి కోలుకుంటున్నదని 99ఏకర్స్ తెలిపింది. ఈ క్రమంలోనే చాలావరకు మెట్రో నగరాల్లో అమ్మకాలు పుంజుకున్నాయని చెప్పిన 99ఏకర్స్.. ప్రాపర్టీ ధరలు కొన్నిచోట్ల తగ్గాయని, మరికొన్నిచోట్ల అలాగే ఉన్నాయన్నది. పుణె, ముంబై, ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరుల్లో ధరలు తగ్గాయని, గుర్గావ్, నోయిడా, నవీ ముంబైల్లోగల కొన్ని పాపులర్ హౌసింగ్ ప్రాజెక్టుల విలువలో క్షీణత కనిపించిందని వెల్లడించింది. అయితే ఈ కారణంగానే ఈ నగరాల్లో అమ్మకాలూ పెరిగాయని వివరించింది. జీఎస్టీ, రెరా, పెద్ద నోట్ల రద్దుతో నిరుడు ప్రథమార్ధం రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు, లావాదేవీల్లో నిస్తేజం కనిపించిందని, అయితే ద్వితీయార్ధంలో పరిస్థితులు చక్కబడ్డాయని 99ఏకర్స్‌డాట్‌కామ్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ నరసింహ జయకుమార్ తెలిపారు. రెరాతో కొనుగోలుదారుల్లో విశ్వాసం పెరిగిందన్నారు. ఇదిలావుంటే ఈ ఏడాది కూడా లగ్జరీ, అల్ట్రా లగ్జరీ ఇండ్ల కొనుగోళ్లకు డిమాండ్ అంతంతమాత్రంగానే ఉండవచ్చని ఈ సందర్భంగా ఆయన అంచనా వేశారు.

తెలంగాణపై కనిపించని నోట్ల రద్దు ప్రభావం

2016 నవంబర్ 8న ప్రకటించిన పాత పెద్ద నోట్ల రద్దుతో దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా ప్రభావితమైన విషయం తెలిసిందే. రూ.500, రూ.1,000 నోట్ల రద్దుతో నిర్మాణ రంగంలోని లావాదేవీలు ఒక్కసారిగా పడిపోయాయి. అయితే ఈ ప్రభావం నుంచి దేశంలోని మిగతా ప్రాంతాల కంటే హైదరాబాద్ త్వరగా కోలుకుందని నిపుణులు చెబుతున్నారు. 2016 నవంబర్‌తో పోల్చితే గతేడాది నవంబర్‌లో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం దాదాపు సమానంగానే ఉన్నప్పటికీ, డిసెంబర్‌లో మాత్రం రూ.177 కోట్ల వృద్ధి నమోదైంది. హైదరాబాద్ చుట్టుపక్కల ధరలు తక్కువగా ఉండటంతో మధ్యతరగతి వర్గాల నుంచి డిమాండ్ ఎక్కువగా కనిపిస్తున్నదని, దాంతో లావాదేవీలు ఎక్కువగా ప్రభావితం కాలేకపోయాయని రియల్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ విధానాలూ ఇందుకు దోహదం చేస్తున్నాయంటున్నారు. టీఎస్-ఐపాస్, సులభతర వ్యాపార నిర్వహణ ర్యాంకుల్లో దేశంలోనే అగ్రస్థానం హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌కు కలిసొస్తున్నాయని తెలంగాణ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ కోశాధికారి కే శ్రీధర్ రెడ్డి అన్నారు. ధరలు రోజురోజుకు పెరుగుతుండటం, స్వల్ప కాలంలోనే పెట్టిన పెట్టుబడులకు ఆకర్షణీయమైన లాభాలు రావడంతో కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు.

నిర్మాణ రంగాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

మందగమనం నుంచి బయటపడుతున్న రాష్ట్ర నిర్మాణ రంగాన్ని అభివృద్ధి చేయడంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ పెద్ద ఎత్తున విస్తరిస్తున్న నేపథ్యంలో మరింతగా ఈ రంగానికి చేయూతనిచ్చే దిశగా సర్కారు అడుగులు వేస్తున్నది. దీనివల్ల స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖల ఆదాయం పెరుగనుండటమూ ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధకు ఓ కారణంగా నిలుస్తున్నది. గతేడాది డిసెంబర్‌లో తొలిసారిగా వివిధ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మొత్తం రిజిస్ట్రేషన్ల సంఖ్య ఒక లక్ష మార్కును దాటింది. ఏప్రిల్-డిసెంబర్ వ్యవధిలో భూ రిజిస్ట్రేషన్ల నుంచి స్టాంప్ డ్యూటీ ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం రూ.3,000 కోట్లను తాకింది. అంతకుముందు ఏడాదిలో ఇది రూ.2,837 కోట్లుగా ఉన్నది. కాగా, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా విస్తరిస్తున్నది. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో ఇవి ఉండటమే కారణం. వికారాబాద్, యాదాద్రీ భువనగిరి, శంషాబాద్‌ల్లోనూ రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. ఇక నానక్‌రామ్‌గూడా, గచ్చిబౌలితోపాటు చిలుకూరు బాలాజీ దేవాలయం సమీప ప్రాంతాల్లో భారీ ఐటీ ప్రాజెక్టులకు అవకాశాలుండటం కూడా ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ రంగంపై దృష్టి పెట్టేలా చేస్తున్నదని నిర్మాణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుంటే ప్రపంచవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలను నిశితంగా గమనించే నైట్ ఫ్రాంక్ కన్సల్టెన్సీ.. ఈ ఏడాది జనవరి7న విడుదల చేసిన ఓ నివేదికలో హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ లావాదేవీలు 3.34 మిలియన్ చదరపు అడుగుల మేర ఉన్నదని చెప్పింది. గతంతో పోల్చితే 5 శాతం పెరిగినట్లు పేర్కొంది.

99 ఏకర్స్ ఇంకా ఏం చెప్పిందంటే?

- మెట్రో రైలుతో మెరుగైన రవాణా సదుపాయం
- నలుమూలలా నివాసాలకు డిమాండ్
- ఒక్కసారిగా పుంజుకున్న బేగంపేట్ రియల్టీ మార్కెట్
- 5 శాతం పెరిగిన సగటు పెట్టుబడి విలువ
- 3-4 శాతంతో తర్వాతి స్థానంలో మియాపూర్-బోడుప్పల్
- 8 శాతం మేర ఎగిసిన భూములు, ఇండ్లు, ఫ్లాట్ల ధరలు
- నిజాంపేట్, చందానగర్‌లో 6, 7% పైకి
- అప్పా జంక్షన్, మణికొండల్లోనూ ఊపందుకున్న అమ్మకాలు
- కొండాపూర్, హైటెక్ సిటీల్లో గరిష్ఠంగా జరుగుతున్న లీజులు
- ఇక్కడ 6-8% పెరిగిన అద్దెలు





రియల్ ఎస్టేట్ రంగంలో దూకుడు మీదున్న హైదరాబాద్‌కు మెట్రో రైల్ ప్రాజెక్టుతో కొత్త హుషారు వచ్చింది. మియాపూర్-నాగోల్ మెట్రో కారిడార్ వెంబడి నివాస గృహాలకు విపరీతమైన డిమాండ్ కనిపిస్తున్నదిప్పుడు. గతేడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంతో పోల్చితే అక్టోబర్-డిసెంబర్‌లో మియాపూర్, బోడుప్పల్ ప్రాంతాల్లో సగటు పెట్టుబడి విలువ 3-4 శాతం పుంజుకున్నట్లు ఆన్‌లైన్ ప్రాపర్టీ సంస్థలు చెబుతున్నాయి. ఈ విషయంలో బేగంపేట్ 5 శాతంతో నగరంలోని ఇతర ప్రాంతాల కంటే కూడా ముందుంది. విద్య, ఉద్యోగ, వ్యాపారాలకు కేంద్ర బిందువైన బేగంపేట్‌ను ఇంతకుముందు ట్రాఫిక్ సమస్యలు వేధించేవి. అయితే మెట్రో రైలు రాకతో పరిష్కారం లభించగా, మెరుగైన రవాణా సదుపాయాలు, అన్నిరకాల మౌలిక వసతులున్న బేగంపేట్‌లో ఉండేందుకు ఇప్పుడు అత్యధికులు అమితాసక్తిని కనబరుస్తున్నట్లు 99ఏకర్స్ తెలియజేసింది. మొత్తంగా మెట్రో రైల్ ప్రాజెక్టు.. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ సెంటిమెంట్‌ను బాగా పెంచిందని స్పష్టం చేసింది. ఇకపోతే హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో కార్యాలయ లీజులు ఇంకా ఎక్కువ సంఖ్యలోనే జరుగుతున్నాయని, సమీప భవిష్యత్తులో ఇక్కడ నివాస గృహాల అమ్మకాలు పుంజుకోగలవన్న విశ్వాసాన్ని 99ఏకర్స్ ఈ సందర్భంగా వ్యక్తం చేసింది. మణికొండ, కొండాపూర్, హైటెక్ సిటీల్లో ప్రస్తుతం నివాసయోగ్య లీజులు కూడా అధికంగానే జరుగుతున్నాయని చెప్పింది.

ప్రపంచ సంపన్న నగరాల్లో
ముంబైకి 12వ ర్యాంకు

- మొత్తం సంపద 950 బిలియన్ డాలర్లు
- అగ్రస్థానంలో న్యూయార్క్, ఆ తర్వాత లండన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: దేశ ఆర్థిక రాజధాని ముంబై ప్రపంచంలోని అత్యంత సంపన్నవంతమైన 15 నగరాల్లో ఒకటిగా నిలిచింది. అమెరికాలోని మహా నగరాల్లో ఒకటైన న్యూయార్క్ మొత్తం 3 ట్రిలియన్ డాలర్ల సంపదతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలువగా.. ముంబై 950 బిలియన్ డాలర్ల సంపదతో 12వ స్థానాన్ని దక్కించుకున్నదని, ఆ తర్వాత టొరంటో (944 బిలియన్ డాలర్ల సంపదతో 13వ స్థానం), ఫ్రాంక్‌ఫర్ట్ (912 బిలియన్ డాలర్లతో 14వ స్థానం), పారిస్ (860 బిలియన్ డాలర్లతో 15వ స్థానం) ఉన్నాయని 'న్యూ వరల్డ్ వెల్త్' తన తాజా నివేదికలో వెల్లడించింది. ఈ జాబితాలో న్యూయార్క్ తర్వాత లండన్ 2.7 ట్రిలియన్ డాలర్ల సంపదతో ద్వితీయ స్థానాన్ని, జపాన్ రాజధాని టోక్యో 2.5 ట్రిలియన్ డాలర్ల సంపదతో తృతీయ స్థానాన్ని ఆక్రమించగా, ఆ తర్వాతి స్థానాల్లో శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియా (2.3 ట్రిలియన్ డాలర్లు), చైనా వాణిజ్య రాజధాని షాంఘై (2 ట్రలియన్ డాలర్లు), లాస్ ఏంజెల్స్ (1.4 ట్రిలియన్ డాలర్లు), హాంకాంగ్ (1.3 ట్రిలియన్ డాలర్లు), సిడ్నీ (1 ట్రిలియన్ డాలర్లు), సింగపూర్ (1 ట్రలియన్ డాలర్లు), చికాకో (988 బిలియన్ డాలర్లు) ఉన్నాయి. ఆయా నగరాల్లోని ప్రజల వద్ద ఉన్న వ్యక్తిగత సంపదను ఆధారంగా చేసుకుని 'న్యూ వరల్డ్ వెల్త్' ఈ నివేదికను రూపొందించింది. బిలియనీర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న టాప్-10 నగరాల్లో కూడా ముంబైకి చోటు లభించిందని, 100 కోట్ల డాలర్లు లేదా అంతకంటే ఎక్కువ నికర ఆస్తులను కలిగిన బిలియనీర్లు ముంబైలో 28 మంది ఉన్నారని 'న్యూ వరల్డ్ వెల్త్' పేర్కొన్నది. సంపద వృద్ధి పరంగా రానున్న 10 ఏండ్లలో ముంబై ప్రపంచంలోనే అత్యంత వేగవంతంగా వృద్ధి చెందుతున్న నగరంగా ఆవిర్భవిస్తుందని భావిస్తున్నట్లు తెలిపింది.

త్వరలో కసరత్తు మొదలు

- జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకంపై చర్చించనున్న ఆర్థిక, ఆరోగ్య శాఖలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం (ఎన్‌హెచ్‌పీఎస్) అమలుకు ముహూర్తం దాదాపు ఖరారైంది. ఆగస్టు 15 లేదా అక్టోబర్ 2వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ఈ పథకం అమలుకు సంబంధించిన విధివిధానాల గురించి చర్చించేందుకు కేంద్ర ఆర్థిక, ఆరోగ్య శాఖలు మరికొద్ది రోజుల్లో సమావేశాన్ని నిర్వహించనున్నాయి. ఎన్‌హెచ్‌పీసీ క్లెయిములను బీమా సంస్థల ద్వారా పరిష్కరించాలా? లేక అందుకోసం ప్రత్యకంగా ఒక ట్రస్టును ఏర్పాటు చేయాలా? అనే అంశాల గురించి ఈ భేటీలో చర్చించనున్నారు. ప్రపంచంలోని ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ పథకాల్లో అతిపెద్దదైన ఎన్‌హెచ్‌పీఎస్‌ను మోదీ ప్రభుత్వం సార్వత్రిక బడ్జెట్ 2018-19లో ప్రకటించిన విషయం విదితమే. దేశ మొత్తం జనాభాలో దాదాపు 40 శాతం మేరకు ఉన్న 10 కోట్లకు పైగా పేద కుటుంబాలకు వార్షికంగా రూ.5 లక్షల వరకు ఆరోగ్య రక్షణ కల్పించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ప్రకటించింది. జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం అమలుకు సంబంధించిన పద్ధతులపై చర్చించేందుకు కేంద్ర ఆర్థిక, ఆరోగ్య శాఖలు మరికొద్ది రోజుల్లో తొలిసారి సమావేశం కాబోతున్నాయని, ఈ పథకాన్ని ట్రస్టు ద్వారా అమలు చేయాలా? లేక సాధారణ బీమా సంస్థల ద్వారా అమలు చేయించాలా? అనే అంశంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించడం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. దేశంలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు ట్రస్టు ఆధారిత నమూనాను ఉపయోగించి ఆరోగ్య సంరక్షణ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నాయి. ఈ పద్ధతిలో ప్రభుత్వం కేంద్ర, రాష్ట్రాల నిధులతో ట్రస్టును ఏర్పాటు చేస్తుంది. లబ్ధిదారుల హాస్పిటల్ క్లెయిములను బీమా సంస్థలకు బదులుగా ఈ ట్రస్టు పరిష్కరిస్తుంది. ఆగస్టు 15 లేదా అక్టోబర్ 2వ తేదీన ప్రారంభమవుతుందని భావిస్తున్న జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ రూపొందిస్తుంది. ఈ పథకంతో పాటు ఇప్పటికే కొన్ని రకాల జబ్బుల కోసం రాష్ట్రాలు అమలు చేస్తున్న ఆరోగ్య సంరక్షణ పథకాలను ఏవిధంగా అమలు చేయాలి, కేంద్ర స్థాయిలో అమలవుతున్న ఆర్‌ఎస్‌బీవై (రాష్ట్రీయ స్వస్థ బీమా యోజన)తో పాటు రాష్ట్రాలు అమలు చేస్తున్న పథకాలను ఎన్‌హెచ్‌పీఎస్‌లో విలీనం చేయాలా? లేదా? అనే అంశాలపై కేంద్ర ఆరోగ్య శాఖ రాష్ట్రాలతో చర్చిస్తుందని ఆ అధికారి వివరించారు.

ఈ ఏడాది జాబ్ మార్కెట్‌లో
10-15 శాతం వృద్ధి

- భారత నైపుణ్య నివేదిక అంచనా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: దేశీయంగా ఈ ఏడాది నియామకాల జోరు పెరుగవచ్చని భారత నైపుణ్య నివేదిక 2018 అంచనా వేసింది. గతంతో పోల్చితే ఈసారి కార్పొరేట్ సంస్థలు 10-15 శాతం మందిని అధికంగా ఉద్యోగాల్లోకి తీసుకోవచ్చని పేర్కొంది. హెచ్‌ఆర్ టెక్నాలజీ సొల్యూషన్స్ కంపెనీ పీపుల్ స్ట్రాంగ్, స్కిల్ అసెస్‌మెంట్ సంస్థ వీబాక్స్‌తోపాటు సీఐఐ, యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, ఏఐయూ, ఏఐసీటీఈ తదితర సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సర్వేలో గడిచిన ఐదేండ్లలో 45.6 శాతం ఉపాధి సామర్థ్యం పెరిగిందని తేలింది. ఢిల్లీ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ తదితర 10 రాష్ట్రాల్లో ఉద్యోగావకాశాలు అధికంగా దక్కాయని పేర్కొంది. ఇక ఉపాధి అవకాశాలను కల్పించడంలో దేశీయ ఐటీ హబ్ బెంగళూరు మొదట ఉన్నదన్న సర్వే.. ఆ తర్వాతి స్థానాల్లో చెన్నై, ఇండోర్, లక్నో, ముంబై, నాగ్‌పూర్‌లున్నట్లు వెల్లడించింది. దేశ రాజధాని నగరం న్యూఢిల్లీ ఏడో స్థానంలో ఉందని, పుణె, తిరుచిరాపల్లి 8,9 స్థానాల్లో ఉన్నాయని సర్వే వివరించింది. ఇదిలావుంటే గడిచిన ఏడాది కాలంలో ఉపాధి అవకాశాలు 40.44 శాతం నుంచి 45.60 శాతం పెరిగినట్లు సర్వే తెలియజేసింది.

జీఎస్టీ రిటర్నుల సరళతరానికి
కమిటీ సన్నద్ధం

- త్వరలో వ్యాపార వర్గాలతో భేటీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రిటర్నుల దాఖలు ప్రక్రియను సరళతరం చేసేందుకు జీఎస్‌టీఎన్ ఛైర్మన్ అజయ్ భూషణ్ పాండే నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ త్వరలో వ్యాపార, పారిశ్రామిక వర్గాలతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకోనున్నది. ఈ కమిటీ తన నివేదికను బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోడీ నేతృత్వంలోని మంత్రుల గ్రూపు (జీఓఎం)నకు సమర్పిస్తుంది. మంత్రుల గ్రూపు ఈ నెలాఖరు నాటికి తన సిఫారసులను ఖరారు చేసి జీఎస్టీ కౌన్సిల్‌కు నివేదిస్తుందని భావిస్తున్నట్లు పాండే తెలిపారు. జీఎస్టీ రిటర్నుల దాఖలు ప్రక్రియను సరళతరం చేసి వ్యాపారులపై భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో ఈ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇనిషియల్ సేల్స్ రిటర్న్ జీఎస్‌టీఆర్-3బీతో పాటు నెలకు మూడు రిటర్నులను దాఖలు చేయడం వ్యాపారులకు పెను భారంగా పరిణమించడంతో ప్రభుత్వం ఈ కమిటీని నియమించింది.

ట్విట్టర్‌లో ప్రశ్నలకు సమాధానమిచ్చేందుకు ఎనిమిది మంది అధికారులు

కాగా, జీఎస్టీకి సంబంధించి ప్రముఖ సామాజిక మాధ్యమం 'ట్విట్టర్'తో పాటు ఈ-మెయిళ్ల ద్వారా వచ్చే ప్రశ్నలకు సమాధానమిచ్చేందుకు పన్నుల విభాగానికి చెందిన ఎనిమిది మంది అధికారులను నియమించినట్లు కేంద్ర ఆర్థిక శాఖ అధికారిక ఉత్తర్వులో వెల్లడించింది. ఈ అధికారులంతా అసిస్టెంట్ కమిషనర్లేనని, తమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఇరుగు పొరుగు కమిషనరేట్ల నుంచి ఈ అధికారులను ఎంపిక చేశామని ఆర్థిక శాఖ తెలిపింది.

అమెరికా మార్కెట్లపైనే ఆధారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:

ఐఐపీ, ద్రవ్యోల్బణ గణాంకాలూ కీలకమే.. పెట్టుబడులపై కార్పొరేట్ ఫలితాల ప్రభావం

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు, ముఖ్యంగా అమెరికా మార్కెట్ల ఆధారంగా ట్రేడ్ అవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. పారిశ్రామికోత్పత్తి, ద్రవ్యోల్బణం గణాంకాల ప్రభావం కూడా ఉంటుందని చెబుతున్నారు. గత వారం సెన్సెక్స్ 1,060.99 పాయింట్లు, నిఫ్టీ 305.65 పాయింట్లు కోల్పోయిన విషయం తెలిసిందే. అమెరికా స్టాక్ మార్కెట్లైన డౌజోన్స్, నాస్‌డాక్, ఎస్అండ్‌పీ 500 సూచీలు భీకర నష్టాల్లోకి జారుకోవడంతో భారత్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లూ అదే బాటలో నడిచాయి. దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిరాశాజనక ద్రవ్యసమీక్షలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా భారతీయ మార్కెట్లపై అగ్రరాజ్య మార్కెట్ల ప్రభావం తప్పక ఉంటుందన్న అంచనాలు మార్కెట్ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నాయి. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2017-18) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను కార్పొరేట్ సంస్థలు ప్రకటించే ఆర్థిక ఫలితాల ప్రభావం కూడా ఉంటుందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ అధిపతి వినోద్ నాయర్ అన్నారు. ఈ క్రమంలోనే గత శుక్రవారం ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ప్రకటించిన భారీ నష్టాలు, శనివారం విడుదలైన కోల్ ఇండియా ఆర్థిక ఫలితాలపై సోమవారం మదుపరులు స్పందించే వీలుందన్నారు. అలాగే డిసెంబర్‌కుగాను పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) గణాంకాలు, జనవరికిగాను వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ), టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం గణాంకాలు ఈ వారమే విడుదలవుతుండటంతో మదుపరులు తమ పెట్టుబడులపై వీటి ఆధారంగా కూడా నిర్ణయాలు తీసుకుంటారని చెబుతున్నారు. ఇకపోతే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, విదేశీ మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఎప్పట్లాగే మార్కెట్లను ప్రభావితం చేయనున్నాయి.



లక్ష కోట్లకుపైగా ఆవిరి

గత వారం స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలకు లోనైన నేపథ్యంలో బీఎస్‌ఈ టాప్-10 సంస్థల మార్కెట్ విలువ లక్ష కోట్లకుపైగా హరించుకుపోయింది. మొత్తం రూ.1,11,986.87 కోట్ల సంపదను చేజార్చుకున్నాయి. టీసీఎస్ అత్యధికంగా రూ.33,854.18 కోట్లు నష్టపోగా, దీని మార్కెట్ విలువ రూ.5,68,983.70 కోట్లకు దిగజారింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సైతం రూ.24,935.67 కోట్లు నష్టపోయి రూ.4,80,206 కోట్ల వద్ద స్థిరపడింది. హెచ్‌డీఎఫ్‌సీ మార్కెట్ విలువ కూడా రూ.20,733.18 కోట్లు పడిపోయి రూ.2,83,336.41 కోట్లకు పరిమితమైంది. హిందుస్థాన్ యునీలివర్ (రూ.8,073.5 కోట్లు), ఇన్ఫోసిస్ (రూ.6,514.19 కోట్లు), ఓఎన్‌జీసీ (రూ.6,031.62 కోట్లు), రిలయన్స్ ఇండస్ట్రీస్ (రూ.4,908.95 కోట్లు), ఐటీసీ (రూ.4,877.27 కోట్లు), మారుతి సుజుకీ (రూ.1,626.7 కోట్లు), ఎస్‌బీఐ (రూ.431.61 కోట్లు) మార్కెట్ విలువలూ పతనమయ్యాయి. మార్కెట్ విలువలో ప్రస్తుతం టీసీఎస్ అగ్రస్థానంలో ఉండగా, రూ.5,68,773.21 కోట్లతో రిలయన్స్ తర్వాతి స్థానంలో కొనసాగుతున్నది.

తరలిపోయిన రూ.3,800 కోట్లు

గడిచిన ఏడు ట్రేడింగ్ సెషన్లలో భారతీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) రూ.3,838 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. అయితే ఇదే సమయంలో రుణ మార్కెట్లలోకి రూ.4,600 కోట్ల పెట్టుబడులను పట్టుకొచ్చారు. గత నెలలో స్టాక్ మార్కెట్లలోకి రూ.13,780 కోట్లకుపైగా పెట్టుబడులను తీసుకొచ్చిన ఎఫ్‌పీఐలు.. గ్లోబల్ స్టాక్ మార్కెట్ల నష్టాల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లకు దూరమైపోయారు.

ఆకట్టుకోని గోల్డ్ ఈటీఎఫ్‌లు

గోల్డ్ ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్లు (ఈటీఎఫ్) మదుపరులను ఆకట్టుకోలేకపోతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడిచిన పది నెలల్లో (ఏప్రిల్-జనవరి) రూ.679 కోట్ల పెట్టుబడులను మదుపరులు తిరిగి లాగేసుకున్నారు. జనవరిలోనే రూ.110 కోట్ల ఉపసంహరణ జరిగింది. లాభాలు నిరాశాజనకంగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో మొత్తం పెట్టుబడులు రూ.5,670 కోట్ల నుంచి రూ.4,906 కోట్లకు పడిపోయాయి.

పేదల జీవితాల్లో వెలుగులు

రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి

తాండూరు టౌన్: టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో నిరుపేద కుటుంబాల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయని రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో 116 మంది మహిళలకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకంలో భాగంగా రూ.72.42 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వెనుక బడిన కులాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక కార్యాచరణ చేపట్టి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు.



వికారాబాద్ జిల్లా తాండూర్‌లో షాదీముబారక్ చెక్కు అందజేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
కామారెడ్డి	35.9	14.7
మేడ్చల్	34.8	14.7
రంగారెడ్డి	34.6	15.6
మహబూబ్‌నగర్	34.9	15.9
సంగారెడ్డి	35.4	15.9
వికారాబాద్	34.6	15.9
ఆదిలాబాద్	35.1	16.3
కుమ్రంభీం ఆసిఫాబాద్	35.6	16.7
నిజామాబాద్	35.8	16.7
రాజన్న సిరిసిల్ల	34.9	16.7
నిర్మల్	35.7	16.7
మెదక్	35.9	17.0
సిద్దిపేట	35.7	17.1
యాదాద్రి భువనగిరి	32.8	17.2
జగిత్యాల	35.5	17.5
మంచిర్యాల	35.7	18.5
జనగామ	33.1	18.5
నాగర్‌కర్నూల్	34.9	18.7
కరీంనగర్	34.6	18.7
పెద్దపల్లి	36.1	19.1
జయశంకర్ భూపాలపల్లి	35.1	19.1
హైదరాబాద్	34.0	19.6
వనపర్తి	34.9	19.8
నల్లగొండ	34.8	19.9
వరంగల్ రూరల్	32.3	20.6
భద్రాద్రి కొత్తగూడెం	34.9	20.7
జోగుళాంబ గద్వాల	34.9	20.9
వరంగల్ అర్బన్	32.6	20.9
మహబూబాబాద్	34.9	21.0
ఖమ్మం	32.3	21.1
సూర్యాపేట	34.6	21.1

వచ్చే ఏడాది మరో 119 బీసీ గురుకులాలు

బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న

బోధన్, నమస్తే తెలంగాణ/మద్నూర్: బీసీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదనీ, బీసీల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ అనేక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని బీసీ సంక్షేమశాఖల మంత్రి జోగు రామన్న అన్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఆదివారం ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేసి, డిజిటల్ తరగతులను ప్రారంభించారు. అనంతరం తిరుగు ప్రయాణమవుతూ ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఒకేసారి రాష్ట్రంలో 123 బీసీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో మరో 119 బీసీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని, ఈ పాఠశాలల ఏర్పాటుతో బీసీ విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.



బోధన్‌లోని ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌లో డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న

రాంరెడ్డి ఆశయాల మేరకే కేజీ టు పీజీ

హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి

ఆచార్య రాంరెడ్డికి పద్మ అవార్డు వచ్చేలా ప్రయత్నిస్తాం: మంత్రి ఈటల

కరీంనగర్, కలెక్టరేట్: దూరవిద్య పితామహుడు ఆచార్య గడ్డం రాంరెడ్డి ఆశయాల మేరకు సీఎం కేసీఆర్ కేజీ టు పీజీ ఉచిత విద్యను అందించేందుకు కట్టుబడి ఉన్నారని, ఆ మేరకు ముందుకు వెళ్తున్నారని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆచార్య గడ్డం రాంరెడ్డి విగ్రహాన్ని ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్‌తో కలిసి నాయిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ రాంరెడ్డి ఆశయసాధనకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నదని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో విద్యను ఉంచడమే కాకుండా నాణ్యమైన విద్యను అందించాలని ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వాల కాలంలో విద్యాభివృద్ధికి నిధుల మంజూరులో ఎంతో నిర్లక్ష్యానికి గురైన విషయాన్ని గుర్తుచేశారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, డాక్టర్ సీ నారాయణరెడ్డితోపాటు, ఆచార్య రాంరెడ్డి కరీంనగర్ గడ్డకు చెందిన వారు కావడం ఎంతో గర్వంగా ఉన్నదన్నారు. ఓపెన్ యూనివర్సిటీల ద్వారా ఎంతో లాభం ఉన్నదనిచెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన వారు ఓపెన్ యూనివర్సిటీల్లో ఉన్నత చదువులు చదివి కొలువులు, ఉన్నత పదవుల్లో స్థిరపడ్డ విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఆచార్య రాంరెడ్డికి పద్మ అవార్డు ఇచ్చే విధంగా సీఎం కేసీఆర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. చదువు అనేది ప్రతి వ్యక్తికి సంస్కారం, సభ్యత, జీవించే విధానాన్ని నేర్పుతుందని చెప్పారు. అందుకే ప్రభుత్వం విద్యాభివృద్ధికి సంస్కరణలతో కూడిన విధానాలు అవలంబిస్తున్నదని వివరించారు. రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ ఆచార్య రాంరెడ్డి దూరవిద్య పితామహుడే కాకుండా న్యాక్ సంస్థకు కూడా రూపకల్పన చేశారన్నారు. ఆచార్య రాంరెడ్డి వ్యక్తి కాదనీ, ఆయన ఓ శక్తిగా అభివర్ణించారు. సమావేశంలో జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో దూరవిద్య పితామహుడు ప్రొఫెసర్ రాంరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, ఈటల రాజేందర్. చిత్రంలో ఎమ్మెల్యే గంగుల, ఎమ్మెల్సీ నారదాసు



బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

'పాలమూరు'తో సస్యశ్యామలం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల, నమస్తే తెలంగాణ: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో బీడు పొలాలు సైతం సాగులోకి వచ్చి సస్యశ్యామలంగా మారనున్నాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్దాయిపల్లి, శేరిగూడెంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం ఆయన బీటీ రోడ్ల నిర్మాణాల ప్రారంభంతోపాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. ఇందులో భాగంగానే పాలమూరు ఎత్తిపోతల పనులను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆ ప్రాజెక్టు పనులు పూర్తయితే జడ్చర్ల నియోజకవర్గంలో 1.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందనున్నదని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ జితేందర్‌రెడ్డి

రెడ్డి సేవా సమితికి సీఎం అండ

జితేందర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి

పాలమూరు: అగ్రవర్ణాల్లోని పేదలకు కల్యాణలక్ష్మీతో పాటు గురుకులాల్లో ప్రవేశాలకు సంబంధించి సీఎం కేసీఆర్‌తో చర్చిస్తామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, టీఆర్ఎస్ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ జితేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రెడ్డి బాలుర వసతి గృహ ప్రాంగణంలో ఉమ్మడి పాలమూరు జిల్లా రెడ్డి సేవా సమితి 16వ వార్షికోత్సవానికి వారు హాజరై మాట్లాడారు. రెడ్డి సేవా సమితికి సీఎం అండగా ఉన్నారనీ, గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సమితికి రూ.150 కోట్లకుపైగా నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో రాజా బహద్దూర్ వెంకట్రాంరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రముఖ సినీ నిర్మాత బసిరెడ్డి పాల్గొన్నారు.



కోటగిరిలో మిర్చి, పప్పు గిర్నీని ప్రారంభిస్తున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

'ఫుడ్ ప్రాసెసింగ్'కు ప్రోత్సాహం

వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

కోటగిరి: రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి ఆహార పరిశ్రమల(ఫుడ్ ప్రాసెసింగ్) యూనిట్ల స్థాపనకు ప్రోత్సహిస్తామనీ, ప్రభుత్వం రూ.100 కోట్లు కూడా కేటాయించిందని వ్యవసాయ, సహకార శాఖల మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. దీనికి కేబినెట్ సబ్ కమిటీ వేశారనీ, తాను చైర్మన్‌గా, సభ్యులుగా మంత్రులు ఈటల, కేటీఆర్ ఉన్నారని చెప్పారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని పొతంగల్ రోడ్డు వైపు నూతనంగా నిర్మించిన (జీఎంకే) మిర్చి, పప్పు గిర్నీని ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి ఒక ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయడానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. కోటగిరికి చెందిన జుబేర్ బీఎస్సీ మైక్రోబయాలజీ వరకు చదివి స్వయం ఉపాధి పొందడంతో పాటు మరో 10మందికి ఉపాధి కల్పించేలా ఇండస్ట్రీని స్థాపించడంపై అభినందించారు.రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటుందన్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి

విద్యతోనే అభివృద్ధి

బిజినేపల్లి: విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి, తెల్కపల్లి మండలాల్లో రూ.1.54కోట్లతో కస్తూర్బా పాఠశాల, హాస్టల్ గదులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. అందులో భాగంగానే విద్యార్థులకు సన్నబియ్యంతో అన్నం పెట్టడం, కేజీ టూ పీజీ ఉచిత విద్య, గురుకులాల వంటి ఎన్నో కార్యక్రమాలకు సంబంధించి అభివృద్ధి పనులను చేస్తుందన్నారు. విద్యార్థులు శ్రద్ధతో మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

దావానలం నివారణకు ప్రత్యేక కమిటీ

సభ్యులుగా ముగ్గురు ఉన్నతాధికారులు

అడవుల్లో కార్చిచ్చు అడ్డుకట్టకు 2,600 మందితో రక్షణ బృందం

శాటిలైట్ నిఘాతో అనుక్షణం అప్రమత్తం

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఎండాకాలంలో వివిధ కారణాలతో వేల ఎకరాల్లో అడవులు అగ్నికి ఆహుతవుతాయి. విలువైన అటవీ సంపద బుగ్గిపాలవుతుంది. దీనికి చెక్‌పెట్టడానికి 2018 సంవత్సరాన్ని అటవీశాఖ 'జీరో ఫారెస్ట్ ఫైర్ ఇయర్'గా ప్రకటించింది. శాటిలైట్ సహాయంతో(జీపీఎస్) అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని గుర్తించడంతోపాటు వెంటనే సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలు ఆర్పేలా చర్యలు చేపట్టింది. ఈ మొత్తం వ్యవహారం పర్యవేక్షణకు అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా ముగ్గురు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని నియమించారు. అడిషనల్ పీసీసీఎఫ్ (ఐటీ అండ్ ప్రాజెక్ట్స్) పీ రఘువీర్, అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ పీసీసీఎఫ్ మునీంద్ర, వరంగల్ సీసీఎఫ్ ఎంజే అక్బర్‌లతో కమిటీ ఏర్పాటుచేశారు. కమిటీలో ఉన్నారు. అడిషనల్ పీసీసీఎఫ్ ఫైర్ ప్రొటెక్షన్ స్ట్రాటజీని రూపొందించారు. రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో 9,784 కంపార్ట్‌మెంట్లను సున్నితమైనవిగా, 431 ప్రాంతాలను అత్యంత సమస్యాత్మకమైనవి గుర్తించారు. గత 14ఏండ్లుగా పదేపదే, లేదా తరుచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను సున్నిత ప్రాంతాల జాబితాలో చేర్చారు. తెలంగాణలో 2014 నుంచి అటవీ ప్రాంతాల్లో 12,537 సార్లు అగ్నిప్రమాదాలు సంభవించినట్లు రికార్డులు చెప్తున్నాయి. అగ్నిప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్తలు, సంభవించిన వెంటనే తీసుకోవాల్సిన చర్యలపై ప్రివెన్షన్, డిటెన్షన్, సప్రెషన్, పోస్ట్ ఫైర్ మేనేజ్‌మెంట్ విధానాలపై రాష్ట్రంలోని అటవీ శాఖ అధికారులు, సిబ్బందికి నిర్దిష్టమైన సూచనలు చేశారు. ప్రతీ అటవీ డివిజన్‌లో ప్రమాదం సమాచారం రాగానే మంటలనార్పేందుకు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను ఏర్పాటుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా రిస్క్‌జోన్ మ్యాప్‌లను రూపొందించారు. అగ్ని ప్రమాదాన్ని గుర్తించిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రక్షణ 2,600 మంది సభ్యులకు ఎస్ఎంఎస్ అలర్ట్ వెళ్తుంది. దగ్గరలో ఉన్న సిబ్బంది జీపీఎస్‌ను ఉపయోగించి ఘటనా స్థలానికి చేరుకుంటారు. రిస్క్ జోన్‌లలో ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. రాష్ట్రంలో అటవీప్రాంతాలకు 500 మీటర్లలోపు 132 గ్రామాలున్నాయి.

ఉప తహసీల్దార్లకూ రిజిస్ట్రేషన్ అధికారాలు!

తహసీల్దార్లు లేని సమయంలో బాధ్యతలు

విధివిధానాలపై దాదాపు 1200 మందికి శిక్షణ

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఉప తహసీల్దార్ల (నయాబ్ తహసీల్దార్ల)కు కూడా రిజిస్ట్రేషన్ అధికారాలను ఇవ్వాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. మండల కార్యాలయాల్లో తహసీల్దార్లు అందుబాటులో లేని సమయంలో మాత్రమే వారికి రిజిస్ట్రేషన్‌చేసే అధికారముంటుంది. వివిధ పనుల్లో నిమగ్నమయ్యే తహసీల్దార్లకు రోజూ రిజిస్ట్రేషన్లను చేసే వీలుండదు. ఈ సమయంలో ఉప తహసీల్దార్లకు కూడా అవకాశం కల్పిస్తున్నారు. రిజిస్ట్రేషన్లలో అవినీతి, అక్రమాలకు చరమగీతం పాడి, మరింత పారదర్శకతను తీసుకొచ్చేందుకు మార్చి 11 నుంచి మండల రెవెన్యూ కార్యాలయాల్లో స్థిర, చరాస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై తహసీల్దార్లకు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీహెచ్చార్డీ)లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ ఈ నెల 28 తేదీ వరకు కొనసాగనుంది. రెండోదశలో ఉప తహసీల్దార్లు, అడ్మినిస్రేటివ్ అధికారులు, సీసీఎల్‌ఏ అధికారులు మొత్తం కలిపి దాదాపు 1200 మందికిపైగా శిక్షణ ఇవ్వనున్నారు. తహసీల్దార్లు ఇతర విధుల నిర్వహణలో నిమగ్నమయ్యే అవకాశం ఉన్నందున మండల రెవెన్యూ కార్యాలయాల్లో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకే రిజిస్ట్రేషన్లకు సమయం కేటాయించాలని నిర్ణయించినట్టు సమాచారం. రిజిస్ట్రేషన్ చేసుకొనే వారు ముందుగానే ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

టీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గులాబీ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఇతర సంఘాల వారు ఆదివారం పెద్ద సంఖ్యలో టీఆర్ఎస్‌లో చేరారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దేశిని కోటితోపాటు ఆయన అనుచరులు సుమారు వెయ్యిమంది టీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి ఈటల రాజేందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీడి భిక్షంతోపాటు పలువురు నాయకులు మంత్రి జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో చందూర్ గ్రామానికి చెందిన 56 శాలివాహన కుటుంబాల వారు, 200 మంది కుమ్మరి సంఘం సభ్యులు కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరగా, మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్దాయిపల్లి, శేరిగూడెం గ్రామాలకు చెందిన 150 మంది టీడీపీ, కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. నల్లగొండ జిల్లా వేములపల్లికి చెందిన ఐదుగురు వార్డుసభ్యులతోపాటు వందమంది వివిధ పార్టీల కార్యకర్తలు మిర్యాలగూడలో ఎమ్మెల్యే భాస్కర్‌రావు సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జంగమాయిపల్లి గౌడ కులస్థులు టీఆర్ఎస్‌లో చేరగా, వారికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలోని రామకృష్ణాపూర్‌లో పలువురు యువకులు, కుల వృత్తి సంఘాల నాయకులు 500మంది టీఆర్ఎస్‌లో చేరగా, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, విప్ ఓదెలు, ఎమ్మెల్సీ సతీశ్‌కుమార్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఎన్ఎస్‌యూఐ, జీహెచ్ఎంసీ వార్డు కమిటీ సభ్యుడు మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో పరకాల వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న దడువాయిలు, హమాలీలు, పరకాల పరిధిలోని 400మంది అంగన్‌వాడీలు, ఆయాలు, కార్యకర్తలు టీఆర్ఎస్‌కేవీలో చేరారు.



కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి దేశిని కోటికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఈటల రాజేందర్



సూర్యాపేటలో బీజేపీ నాయకులను టీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



బాన్సువాడలో మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరిన కులసంఘాల వారు



వనపర్తి జిల్లా జంగమాయిపల్లిలో నిరంజన్‌రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరిన గౌడ కులస్థులు

మాజీ ఎమ్మెల్యేపై ఫిర్యాదులు

పిట్లం/పెద్దకొడప్‌గల్/మద్నూర్: మాజీ ఎమ్మెల్యే గంగారాంపై కామారెడ్డి జిల్లా పిట్లం, పెద్దకొడప్‌గల్, మద్నూర్ ఠాణాల్లో ఆయా మండలాల టీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఇటీవల బిచ్కుందలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారితోపాటు వీటికి సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నవారిపైనా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

అవమాన భారంతో మహిళ ఆత్మహత్య

ములుగు రూరల్: చెప్పుతో దాడి చేయగా, అవమానభారించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలం కాసిందేవిపేటలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ములుగు మండలం కాసిందేవిపేటలో శనివారం జరిగిన శుభకార్యానికి ఎప్పటిలాగే ప్రకాశ్ డీజే ఆపరేటింగ్ చేస్తుండగా, సాంకేతిక లోపంతో డీజే ఆగిపోయింది. దీంతో అదే గ్రామానికి చెందిన జన్ను ఈశ్వరమ్మ, జన్ను రాజు, జన్ను దివ్య, చుంచు కిషోర్ ప్రకాశ్‌తో గొడవకు దిగారు. అంతటితో ఆగకుండా ఆదివారం ఉదయం కూడా ప్రకాశ్ ఇంటికి వెళ్లి, అతనిపై దాడి చేశారు. గమనించిన ప్రకాశ్ భార్య సుమలత ఆపేందుకు ప్రయత్నించగా, నలుగురు వ్యక్తులు ఆమెను చెప్పులతో కొట్టి, అసభ్యపదజాలంతో దూషించారు. దీంతో అవమానంగా భావించిన సుమలత ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. బంధువులు హుటాహుటిన ములుగు దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ సుమలత మృతి చెందింది. సుమలత మృతదేహంతో దాడికి పాల్పడిన ఈశ్వరమ్మ ఇంటి ఎదుట వేసి బంధువులు నిరసన తెలిపారు. సుమలత భర్త ప్రకాశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నీటి కుంటలో పడి చిన్నారుల దుర్మరణం

సిరిసిల్ల క్రైం: నీటికుంటలో పడి ఇద్దరు చిన్నారులు దుర్మరణం చెందారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చంద్రంపేటలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన రుపాధర్ సునా,మినా సునా దంపతుల కుమారులు బింజు సునా(4), రింకుసునా(2) ఆదివారం చంద్రంపేట గ్రామ శివారులోని ఇటుక బట్టీల వద్ద తవ్విన నీటి కుంటలో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలిసి వారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఎస్సై అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్కసులో ప్రతిపక్షాలది ప్రపంచ రికార్డు: మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, నమస్తే తెలంగాణ ప్రతినిధి: టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పరంపరను జీర్ణించుకోలేని కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు అక్కసు పెంచుకుంటూ చేస్తున్న కుట్రలు ప్రపంచ రికార్డుకు చేరువలో ఉన్నాయని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. గత అరువై ఏండ్లలో జరుగని అభివృద్ధి, సంక్షేమ పథకాలు కేవలం మూడున్నరేండ్లలో టీఆర్ఎస్ పాలనలో చేపట్టడంతో ప్రభుత్వానికి మద్దతు పెరుగుతుండటంతో ఆ అక్కసుతోనే కాంగ్రెస్ నాయకులు కుట్రలు ప్రారంభించి అభివృద్ధికి అడుగడుగునా అడ్డు తగిలేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.

విధుల్లో చేరిన నూతన కానిస్టేబుళ్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీస్‌శాఖ నూతన సిబ్బంది చేరికతో కళకళలాడుతున్నది. ఇటీవల శిక్షణ పూర్తిచేసుకొన్న 8,824 మంది కానిస్టేబుళ్లలో ఏడున్నరవేల మంది ఈ నెల ఒకటోతేదీన విధుల్లోకి చేరారు. మిగిలినవారు మార్చి ఒకటి నుంచి విధుల్లోకి రానున్నారు. ఒకేసారి భారీ సంఖ్యలో క్షేత్రస్థాయి సిబ్బంది చేరడంతో రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో హడావుడి నెలకొంది. కొత్త సిబ్బందికి విధి నిర్వహణలో ఇవ్వాల్సిన సూచనలు, సలహాలపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టిసారించారు. కొత్త వారికి విధుల కేటాయింపు, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వారిని మలుచుకోవడంవంటి అంశాలపై అన్ని జిల్లాల అడ్మిన్ అధికారులతో ఐజీ పర్సనల్ శివధర్‌రెడ్డి, నార్త్‌జోన్ ఐజీ నాగిరెడ్డి, వెస్ట్‌జోన్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర.. ఇతర ఉన్నతాధికారులు ఇటీవల డీజీపీ కార్యాలయంలో సుదీర్ఘ సమావేశం ఏర్పాటుచేసి అనేక సూచనలు ఇచ్చారు. కానిస్టేబుల్ ఉద్యోగాన్ని ఎంచుకొన్నవారిలో గతంతో పోలిస్తే ఉన్నత చదువులు చదువుకొన్నవారి సంఖ్య ఎక్కువగానే ఉన్నది. కానీ, వారికి పోలీస్ ఉద్యోగంలో ఉండే సాధకబాధకాలపై పూర్తి అవగాహన ఉండడంలేదు. శిక్షణ కాలంలో ఎంత తర్ఫీదు ఇచ్చినా, పూర్తిస్థాయి విధుల్లో పరిస్థితులకు అలవాటుపడటంలో ఒత్తిడికి గురవడం సహజం.



విజయోత్సాహంలో ఎమ్ఎల్ఆర్ రాయల్స్ మహబూబ్‌నగర్ జట్టు

మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ గెలుపు

- వెంకటస్వామి స్మారక తెలంగాణ టీ20 లీగ్

సిద్దిపేట, నమస్తే తెలంగాణ: జీ వెంకటస్వామి స్మారక తెలంగాణ టీ20 లీగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మొదటి మ్యాచ్‌లో ఎమ్ఎల్ఆర్ రాయల్స్ మహబూబ్‌నగర్ 8 వికెట్ల తేడాతో కరీంనగర్ వారియర్స్‌పై గెలిచింది. కరీంనగర్ నిర్దేశించిన 142 పరుగుల లక్ష్యాన్ని మహబూబ్‌నగర్ 18.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి అందుకుంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఠాకూర్ తిలక్‌వర్మ(59 నాటౌట్), షకీర్‌ఖాన్(29), నీల్‌కమల్(28) రాణించారు. అంతకుముందు కరీంనగర్ నిర్ణీత 20 ఓవర్లలో 141/7 స్కోరు చేసింది. మరో మ్యాచ్‌లో ఆదిలాబాద్ టైగర్స్ 124 పరుగుల తేడాతో కాకతీయ కింగ్స్‌ను చిత్తుగా ఓడించింది. ఆదిలాబాద్ 20 ఓవర్లలో 183/4 స్కోరు చేయగా, ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కాకతీయ టీమ్ 16.1 ఓవర్లలో 59 పరుగులకే కుప్పకూలింది. టీ20 మ్యాచ్‌లను అద్భుతంగా నిర్వహించిన సిద్దిపేట క్రికెట్ అసోసియేషన్ సభ్యులకు, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రశంసించారు.



జట్టు గెలుపు సంబురాల్లో ఆదిలాబాద్ టైగర్స్

తెలంగాణ భారీ విజయం



మహబూబ్‌నగర్ స్పోర్ట్స్: జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల హ్యాండ్‌బాల్ టోర్నీలో తెలంగాణ జోరు కొనసాగుతున్నది. ఆదివారం బాలుర విభాగంలో జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ 30-04తో మణిపూర్‌పై గెలిచింది. జట్టులో దేవా(7), తాజ్యల్(6), గణేశ్, సాయికుమార్(5) విజయంలో కీలకమయ్యారు. బాలికల విభాగంలో తెలంగాణ 19-05 తో విద్యాభారతిపై విజయం సాధించింది. రెండో రోజు పోటీలను మహబూబ్‌నగర్ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్‌కుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ హన్మంతుగౌడ్, టోర్నీ జాతీయస్థాయి పరిశీలకులు హిమన్షు శర్మ పాల్గొన్నారు.

దక్షిణాఫ్రికాకు జరిమానా

జొహాన్నెస్‌బర్గ్: నాలుగో వన్డేలో స్లో ఓవర్‌రేట్ కారణంగా దక్షిణాఫ్రికా జట్టుపై ఐసీసీ జరిమానా విధించింది. నిర్ణీత సమయంలో వేయాల్సిన ఓవర్ల కంటే తక్కువ వేయడంతో ఐసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఐసీసీ నియమ, నిబంధనలు ఆర్టికల్ 2.5.1 ప్రకారం కెప్టెన్ మర్క్రామ్ మ్యాచ్ ఫీజులో 20 శాతం, మిగతా ఆటగాళ్లపై 10 శాతం కోత వేసినట్లు మ్యాచ్ రిఫరీ అండీ పైక్రాఫ్ట్ తెలిపాడు.

రూ.125 కోట్లు చెల్లించండి!

న్యూఢిల్లీ: 2016 టీ20 వరల్డ్‌కప్‌నకు సంబంధించిన పన్ను మినహాయింపు సొమ్ము బీసీసీఐ నుంచి రాబట్టుకోవాలని ఐసీసీ ప్రయత్నాలు చేస్తున్నది. ఈ మేరకు భారత బోర్డు తమకు రూ. 125 కోట్లు బకాయి ఉన్నట్లు పేర్కొంది. వాస్తవానికి రెండేండ్ల కిందట జరిగిన ఈ టోర్నీ మొత్తం 290 మిలియన్ డాలర్లను వసూలు చేసింది. ఇందులో 10 శాతం ప్రత్యక్షప్రసారదారులకు చెందుతుంది. ఇందులో భాగంగా స్టార్ ఇండియా రూ. 125 కోట్లను టీడీఎస్ కింద కేంద్ర ప్రభుత్వానికి చెల్లించింది. అయితే ఐసీసీ సభ్య దేశాలకు ఇచ్చే రెవెన్యూ షేర్ కింద ఈ 10 శాతం వాటాను బీసీసీఐ నుంచి రాబట్టుకోవాలని ఐసీసీ భావిస్తున్నది.



దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్‌ను గెలిచి చరిత్ర సృష్టిద్దామకున్న విరాట్ సేనకు, జొహాన్నెస్‌బర్గ్ వన్డే ఓటమితో అవకాశం కొంత సంక్లిష్టమైంది.. ఆరు వన్డేల సిరీస్‌లో భారత్ ఆధిక్యం 3-1కి పడిపోయింది.. భారత్ మిగతా రెండు మ్యాచుల్లో ఓడినా సిరీస్ చేజారదు, కానీ చరిత్రను తిరుగ రాసే అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదులుకోవద్దని భావిస్తున్నది. అది జరుగాలంటే మిగతా రెండు మ్యాచుల్లో ఒక్కటి గెలిస్తే చాలు. నాలుగో వన్డేలో సఫారీలు పుంజుకున్న తీరు చూస్తే మాత్రం విరాట్ సేనకు గెలుపు అంత సులువుగా దక్కేలా కనిపించడం లేదు.

రేసు మొదలైంది..

- క్లాసెన్ ఇన్నింగ్స్‌పై ప్రశంసల జల్లు
- సిరీస్ సమంపై సఫారీల దృష్టి
- విరాట్ సేనకు అగ్ని పరీక్షే

జొహాన్నెస్‌బర్గ్: టీమ్‌ఇండియాకు దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్ గెలుపు ఇప్పుడు సంక్లిష్టమైంది. సఫారీలు ఒక్కసారిగా పుంజుకుని సిరీస్‌లో బోణీ కొట్టడంతో విరాట్ సేనలో కంగారు మొదలైంది. భారత పరాజయానికి వరుణుడు ఒకింత కారణమే అయినా..దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ హెన్రిచ్ క్లాసెన్ మెరుపులాంటి బ్యాటింగ్‌తో .విరాట్ సేన లోపాలను ఎత్తిచూపుతూ తమ జట్టును రేసులో నిలిపాడు..డివిలీయర్స్ చేరిక, తాజా గెలుపు దక్షిణాఫ్రికా జట్టులో మరింత ఉత్సాహాన్ని నింపగా..విరాట్ సేన మాత్రం తమ బలహీనతలను అధిగమిస్తేనే వన్డే సిరీస్‌ను దక్కించుకోగలుగుతుంది.

బుమ్రా, భువీకి ఇవ్వలేదు

భారత పేసర్లు బుమ్రా, భువనేశ్వర్‌తో కీలకమైన సమయంలో బౌలింగ్ వేయించకపోవడమే భారత ఓటమికి కారణమైందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వాండరర్స్ హీరో క్లాసెన్ కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, కెప్టెన్ విరాట్ కోహ్లీ వ్యూహమేమిటో తమకు అర్థం కాలేదన్నాడు. చాహల్, కుల్దీప్ బౌలింగ్‌లో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ భారీగా పరుగులు పిండుకున్నప్పటికీ కోహ్లీ పేసర్లను రంగంలోకి దింపకపోవడాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రోహిత్ ఎందుకిలా

రోహిత్‌శర్మ వరుసగా నాలుగో వన్డేలోనూ నిరాశపరిచడం టీమ్‌ను కలవరపెడుతున్నది. వరుసగా మూడు మ్యాచుల్లో రబాడ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. ఇందుకు కారణం అతని ఫుట్‌వర్కే అని మాజీలు చెబుతున్నారు. గత మూడు మ్యాచుల్లోనూ భారత్ గెలువడం వల్ల రోహిత్ వైఫల్యాన్ని పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. కానీ ఈ ద్విశతక వీరుడి చెత్త ఫాం ఇలాగే కొనసాగితే మాత్రం జట్టులో స్థానం



కష్టమౌతుంది.

క్లాసెన్..ఆ షాట్‌కు పేరేమిటో..?

మెరుపులాంటి ఇన్నింగ్స్‌తో 27 బంతుల్లో 47 పరుగులు బాది దక్షిణాఫ్రికాను గెలిపించిన వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్ క్లాసెన్ హీరోగా మారిపోయాడు. హెల్మెట్ పెట్టుకుని ఆడుతుంటే అచ్చం న్యూజిలాండ్ హిట్టర్ మార్టిన్ గప్టిల్‌లా ఉండే ఇతడు..వినూత్నమైన షాట్లతో అలరించాడు. ముఖ్యంగా ఇన్నింగ్స్ 22వ ఓవర్‌లో చాహల్ ఆఫ్ స్టంప్ అవతలికి షార్ట్ పిచ్ బంతిని విసురగా..క్లాసెన్ ఆ బంతిని వెంటాడి మరీ స్క్వేర్‌లెగ్ వైపు బౌండరీగా మలిచిన తీరు ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో చర్చగా మారింది. ఆ షాట్ అచ్చు డివిలియర్స్‌లా ఆడాడని కొందరంటే, మరికొందరేమో క్రేజీ షాట్ అంటున్నారు. సోషల్ మీడియాలో క్లాసెన్ షాట్‌పైనే చర్చ జరుగుతున్నది. తన కెరీర్‌లో రెండో వన్డే ఆడిన క్లాసెన్..ఈ వినూత్నమైన షాట్లకు పేరేంటని అడిగితే, అవి బౌండరీ కోసం ప్రత్యేక సందర్భంలో ఆడిన షాట్లని వాటికేం పేరు లేదని చెప్పాడు. ఇతనితో పాటు డివిలీయర్స్, డుమినీ, మిల్లర్‌తో భారత్‌కు మిగతా రెండు వన్డేల్లో ముప్పు పొంచి ఉందనడంలో సందేహం లేదు.

శివ కేశవన్ కల చెదిరే!



ప్యాంగోచాంగ్: భారత వింటర్ ఒలింపిక్స్ పోస్టర్ బాయ్ శివ కేశవన్ పతకం కల ఈసారి కూడా నెరవేరలేదు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ 'లూజ్' ఈవెంట్ మూడో హీట్స్‌లో అతను 1344 మీటర్ల ట్రాక్‌ను 48.900 సెకండ్లలో ముగించి 30వ స్థానంలో నిలిచాడు. మూడు హీట్స్ ముగిసేసరికి ఓవరాల్ జాబితాలో శివకు 34వ స్థానం దక్కడంతో నాలుగు, ఐదు హీట్స్‌ల్లో పాల్గొనే అవకాశం దక్కలేదు. దీంతో రికార్డుస్థాయిలో ఆరోసారి వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న అతను పతకం గెలువాలన్న కల తీరకుండానే ఆటకు గుడ్‌బై చెప్పాడు. మూడు హీట్స్‌ల్లో కలిపి టాప్-20లో ఉన్న అథ్లెట్లను మాత్రమే ఫైనల్స్‌కు ఎంపిక చేస్తారు. మూడు రౌండ్లలో కలిపి శివ సరాసరి వేగం 28.188 సెకండ్లు. డేవిడ్ గ్లెర్చెర్ (ఆస్ట్రేలియా)కు స్వర్ణం, క్రిస్ మజ్దెర్ (అమెరికా)కు రజతం, జొహన్నెస్ లుడ్విగ్(జర్మనీ)కు కాంస్యం లభించాయి.

భారత స్విమ్మర్ కొత్త రికార్డు



న్యూఢిల్లీ: పుణెకు చెందిన లాంగ్ డిస్టెన్స్ స్విమ్మర్ రోహన్ మోరె.. సముద్రపు ఈతలో కొత్త రికార్డును నెలకొల్పాడు. న్యూజిలాండ్‌లోని నార్త్, సౌత్ ద్వీపాలను కలుపుతూ వెళ్లే కుక్ స్ట్రేట్‌ను అతను 8 గంటలా 37 నిమిషాల్లో ఈదాడు. దీంతో ఈ పోటీని పూర్తి చేసిన అతి తక్కువ వయసు గల తొలి ఆసియన్‌గా రికార్డులకెక్కాడు. వాతావరణం అనుకూలించకపోవడంతో చాలా రోజులు వేచి చూసిన మోరె ఈనెల 9న ఎట్టకేలకు ఈతకు పూనుకున్నాడు. ఉష్ణోగ్రత 19 డిగ్రీల సెల్సియస్ ఉండటంతో తొలి ఐదు గంటలు ఈత సాఫీగా సాగింది. కానీ అంటార్కిటికా నుంచి వచ్చే ప్రవాహాలతో ఉష్ణోగ్రత ఒక్కసారిగా 4 డిగ్రీలకు పడిపోయింది. దీంతో విపరీతమైన చలిలో వణుకుతూనే మిగతా పోటీని పూర్తి చేశాడు. ప్రపంచవ్యాప్తంగా ఈ పోటీని పూర్తి చేసిన తొమ్మిదో వ్యక్తిగా మోరె రికార్డు సృష్టించాడు. 11 ఏండ్ల వయసులోనే మోరె తన తొలి మారథాన్ స్విమ్‌ను పూర్తి చేయడం గమనార్హం.

జడేజా సెంచరీ

జార్ఖండ్‌పై సౌరాష్ట్ర గెలుపు

సికింద్రాబాద్: పరిమిత ఓవర్ల జట్టులో చోటు దక్కించుకోలేకపోతున్న ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (116 బంతుల్లో 113 నాటౌట్; 7 ఫోర్లు, 4 సిక్సర్లు)).. విజయ్ హజారే ట్రోఫీలో సెంచరీతో చెలరేగిపోయాడు. దీంతో ఆదివారం ఇక్కడ జరిగిన గ్రూప్-డి మ్యాచ్‌లో సౌరాష్ట్ర 4 వికెట్ల తేడాతో జార్ఖండ్‌పై గెలిచింది. ముందుగా జార్ఖండ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 329 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (93), సుమిత్ కుమార్ (64), విరాట్ సింగ్ (44) అర్ధసెంచరీలతో హోరెత్తించారు. ఇషాన్, విరాట్ తొలి వికెట్‌కు 143 పరుగులు జోడించి శుభారంభాన్నిచ్చారు. తర్వాత సౌరాష్ట్ర 48.2 ఓవర్లలో 6 వికెట్లకు 333 పరుగులు చేసి నెగ్గింది. కెప్టెన్ పుజార (44), ఉతప్ప (32) ఓ మాదిరిగా ఆడినా.. జడేజా భారీ హిట్టింగ్‌తో చెలరేగిపోయాడు. జానీ (59)తో కలిసి ఐదో వికెట్‌కు 114, యో మహేశ్ (36)తో కలిసి ఆరో వికెట్‌కు 62 పరుగులు జోడించి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఈ విజయంతో సౌరాష్ట్రకు 4 పాయింట్లు లభించాయి.

ఐడీబీఐలో 760 ఎగ్జిక్యూటివ్‌లు

ఐడీబీఐ బ్యాంక్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- డిగ్రీ అభ్యర్థులకు అవకాశం
- ఆన్‌లైన్ టెస్ట్ ద్వారా ఎంపిక
- మొదటి మూడేండ్లు కాంట్రాక్టు, తర్వాత అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగావకాశం

వివరాలు:

మొదట్లో అపెక్స్ డెవలప్‌మెంట్ ఫైనాన్షియల్ సంస్థగా ఉన్న ఐడీబీఐ 2004 నుంచి పూర్తిస్థాయి బ్యాంక్‌గా మారింది. ప్రస్తుతం దేశంలోని పెద్దబ్యాంక్‌ల్లో ఇది ఒకటి.

- **పోస్టు:** ఎగ్జిక్యూటివ్
- మొత్తం ఖాళీల సంఖ్య - 760. వీటిలో ఎస్సీ - 122, ఎస్టీ - 56, ఓబీసీ - 202, వీహెచ్ - 13, హెచ్‌హెచ్ - 56, ఓహెచ్ - 8 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు వస్తే సరిపోతుంది. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- **వయస్సు:** 2018, జనవరి 1 నాటికి 20 -25 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్టీ, ఎస్సీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

జీతభత్యాలు:

- **మొదటి ఏడాది:** నెలకు రూ. 17,000/-
- **రెండో ఏడాది:** నెలకు రూ. 18,500/-
- **మూడో ఏడాది:** నెలకు రూ. 20,000/-
- ఎగ్జిక్యూటివ్‌లకు ఎటువంటి అలవెన్స్‌లు, డీఏ, హెచ్‌ఆర్‌ఏలు ఇవ్వరు.
- ఈ పోస్టులను మొదట ఏడాది కాలానికి తర్వాత మరో రెండేండ్లు కాంట్రాక్టు పొడగిస్తారు. మూడేండ్ల కాంట్రాక్టు కాలాన్ని విజయవంతంగా పూర్తిచేసిన తర్వాత గ్రేడ్ ఏ అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు అర్హులు. బ్యాంక్ నియమనిబంధనల ప్రకారం అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు అర్హులు. బ్యాంక్ ఎంపిక ప్రక్రియ ద్వారా అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను భర్తీ చేస్తుంది.

ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్ ద్వారా

ఆన్‌లైన్ టెస్ట్:

- ఈ పరీక్షలో మొత్తం 150 ప్రశ్నలు - 150 మార్కులు. దీనిలో రీజనింగ్ -50 ప్రశ్నలు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ -50 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ - 50 ప్రశ్నలు ఇస్తారు.
- పరీక్ష కాలవ్యవధి 90 నిమిషాలు
- పరీక్ష ప్రశ్నపత్రం ఇంగ్లిష్/హిందీలో ఉంటాయి.
- నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు జవాబుకు 0.25 మార్కుల కోత విధిస్తారు.
- **పరీక్షతేదీ:** ఏప్రిల్ 28



- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, అహ్మదాబాద్, అమృత్‌సర్, భోపాల్, బెంగళూరు, బెల్గాం, భువనేశ్వర్, కోయంబత్తూరు, చెన్నై, చండీగఢ్, గువాహటి, గ్వాలియర్, జైపూర్, కాన్పూర్, కోల్‌కతా, కొచ్చి, లక్నో, మధురై, మంగళూరు, ముంబై, నాగ్‌పూర్, న్యూఢిల్లీ, పుణె, పాట్నా, రాయ్‌పూర్, రాజ్‌కోట్, రాంచీ, తిరువనంతపురం, విజయవాడ, విశాఖపట్నం.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 28
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** https://www.idbi.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ బ్యాంక్‌లో స్పోర్ట్స్ కోటా

చెన్నై ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న ఇండియన్ బ్యాంక్ క్రీడ కోటాలో ఖాళీగా ఉన్న ఆఫీసర్/క్లరికల్ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- మొత్తం పోస్టుల సంఖ్య: 21 (బాస్కెట్ బాల్-6, క్రికెట్-7, వాలీబాల్-5, హాకీ-3)
- **అర్హత :** గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. సంబంధిత క్రీడలో అంతర్జాతీయ, జాతీయ, ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొని ఉండాలి.
- **వయస్సు:** 18 నుంచి 26 ఏండ్ల మధ్య ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 23,700-31, 540 /-
- **ఎంపిక:** స్క్రీనింగ్ టెస్ట్ స్పోర్ట్స్ ట్రయల్స్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో. నిర్ణీత నమూనాలో దరఖాస్తును నింపి, సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి



చిరునామా: Assistant General Manager (HRM) HRM Department, Corporate Office Indian Bank , 254-260 Avvai Shanmugham Salai Chennai, Tamil Nadu - 600014

- **చివరితేదీ:** మార్చి 3
- **వెబ్‌సైట్:** www.indianbank.in

ఐఐటీ పాట్నాలో నాన్ టీచింగ్ పోస్టులు

పాట్నాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

పోస్టులు - ఖాళీలు:

- అసిస్టెంట్ రిజిస్ట్రార్ - 2, మెడికల్ ఆఫీసర్ -1, జూనియర్ సూపరింటెండెంట్ - 1, జూనియర్ అసిస్టెంట్ -4, ఫిజికల్ ట్రెయినింగ్ ఇన్‌స్ట్రక్టర్- 2, సీనియర్ ల్యాబొరేటరీ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ - 1, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్ - 2, జూనియర్ మెకానిక్ - 2, జూనియర్ టెక్నీషియన్ - 1 ఖాళీ ఉన్నాయి.



- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **వెబ్‌సైట్ :** www.iitp.ac.in

ఇండియన్ ఆయిల్‌లో 350 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) సదరన్ రీజియన్ పరిధిలోని మార్కెటింగ్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న అప్రెంటిస్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ భారతదేశంలోని ఫార్చ్యూన్ గ్లోబల్ 500 కంపెనీల్లో అతిపెద్ద వాణిజ్య సంస్థ.

- **పోస్టు:** టెక్నీషియన్ అప్రెంటిస్
- మొత్తం ఖాళీలు - 350.
- **రాష్ట్రాల వారీగా ఖాళీలు:** తమిళనాడు & పుదుచ్చేరీ- 69, కర్ణాటక-69, కేరళ-46, తెలంగాణ-42, ఆంధ్రప్రదేశ్-44
- **వయస్సు:** 18 - 24 ఏండ్ల మధ్య ఉండాలి.
- **అర్హతలు :** గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతితోపాటు ఐటీఐలో ఉత్తీర్ణత.



- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 19
- **రాతపరీక్ష:** మార్చి 4
- **వెబ్‌సైట్:** www.iocl.com

ఇండియన్ కోస్ట్‌గార్డులో

రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేస్తున్న ఇండియన్ కోస్ట్‌గార్డ్ ఖాళీగా ఉన్న నావిక్ (డొమిస్టిక్ బ్రాంచ్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

భారత తీర ప్రాంత రక్షణలో కోస్ట్‌గార్డ్ పాత్ర కీలకమైంది.

- **పోస్టు పేరు :** నావిక్ (డొమిస్టిక్ బ్రాంచ్)
- **అర్హతలు :** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతిలో ఉత్తీర్ణత. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి.
- **వయస్సు:** 2018 అక్టోబర్ 1 నాటికి కనిష్ఠంగా 18 ఏండ్లు, గరిష్ఠంగా 22 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్ల వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు :** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 16
- **వెబ్‌సైట్:** www.joinindiancoastguard.gov.in

'ఫ్యూయల్ రిసెర్చ్'లో ప్రాజెక్ట్ అసిస్టెంట్లు

సీఎస్ఐఆర్-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్ రిసెర్చ్ (సీఐఎంఎఫ్‌ఆర్) ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

సీఐఎంఎఫ్‌ఆర్ అనేది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలో పనిచేస్తున్న అనుబంధ సంస్థ.

- **పోస్టు పేరు:** ప్రాజెక్ట్ అసిస్టెంట్
- మొత్తం ఖాళీల సంఖ్య-111
- ప్రాజెక్ట్ అసిస్టెంట్ (లెవల్ 1) -78 పోస్టులు
- ప్రాజెక్ట్ అసిస్టెంట్ (లెవల్ 2) -33 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఆనర్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా జియాలజి, అప్లయిడ్ జియాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ/మాస్టర్ డిగ్రీ, డిప్లొమా (సివిల్, మెకానికల్), కంప్యూటర్ సైన్స్, సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ 55 శాతం మార్కులతోఉత్తీర్ణత.
- **వయస్సు:** లెవల్ -1కు 28 ఏండ్లు, లెవల్-2 కు 30 ఏండ్లకు మించరాదు
- **పే స్కేల్:** ప్రాజెక్ట్ అసిస్టెంట్ లెవల్ 1, 2లకు జీతం రూ.15,000/-, రూ. 25,000/- ఇస్తారు.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** అర్హత కలిగిన అభ్యర్థులు సెల్ఫ్ అటెస్టెడ్ కాపీలు, ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఇంటర్వ్యూ జరిగే రోజున సంబంధిత పర్సనల్ అధికారి వద్దకు హాజరుకావాలి



చిరునామా: CSIR-CENTRAL INSTITUTE OF MINING AND FUEL RESEARCH, Digwadih Campus, P.O-FRI, Dhanbad-828108

- **ఇంటర్వ్యూ తేదీ:** లెవల్ 1 అసిస్టెంట్‌కు ఫిబ్రవరి 13,14, లెవల్ 2 అసిస్టెంట్‌కు ఫిబ్రవరి 17,19, 20
- **వెబ్‌సైట్ :** www.cimfr.nic.in

స్టేట్ బయోడైవర్సిటీలో

తెలంగాణ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు తాత్కాలిక ప్రాతిపదికన టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

- **పోస్టు పేరు:** సైంటిఫిక్/టెక్నికల్ అసిస్టెంట్-1
- **అర్హత:** ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, అగ్రికల్చర్ సైన్సెస్, లైఫ్ సైన్స్, ఫారెస్ట్రీ, హార్టికల్చర్ సైన్సెస్, బయాలాజికల్ సైన్సెస్‌లో డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 45 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ లేదా ఈ-మెయిల్ (telanganabiodiversity@gmail.com) ద్వారా కూడా పంపవచ్చు.

చిరునామా: The Member Secretary, Telangana State Biodiversity Board, 6th Floor, Chandra Vihar, Nampally, Hyderabad - 500001

- **చివరి తేదీ:** మార్చి 7
- **వెబ్‌సైట్:** www.tsbiodiversity.org

స్థానిక సంస్థల ఎన్నికల్లో
రాజపక్సే పార్టీ గెలుపు



కొలంబో, ఫిబ్రవరి 11: శ్రీలంక స్థానిక సంస్థల ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్సే పార్టీ ఘనవిజయం సాధించింది. రాజపక్సే నేతృత్వంలోని శ్రీలంక పీపుల్స్ పార్టీ (ఎస్ఎల్‌పీపీ) 45శాతం ఓట్లుసాధించి అగ్రభాగాన నిలిచింది. శనివారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడ్డాయి. 703,117 ఓట్లతో ఎస్ఎల్‌పీపీ 909 సీట్లను దక్కించుకోగా అధికార యునైటెడ్ నేషనల్ పార్టీ 469,986 ఓట్లు సాధించి 459 సీట్లకే పరిమితమైంది. మొత్తం 81 కౌన్సిల్ ఫలితాలు ప్రకటించగా రాజపక్సే వర్గం ఊహించని విధంగా 51 కౌన్సిళ్లను కైవసం చేసుకుంది. శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన, ప్రధాని రణిల్ విక్రమసింఘేలకు చెందిన పార్టీలు ఘోరపరాజయాన్ని మూటకట్టుకున్నాయి. రణిల్ విక్రమసింఘేకు చెందిన యునైటెడ్ నేషనల్ పార్టీ కేవలం 10 స్థానాలకు పరిమితం కాగా, తమిళ్ నేషనల్ అలయెన్స్ కూడా 10 స్థానాల్లో విజయం సాధించింది. ఈవిజయంతో భవిష్యత్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో మహింద రాజపక్సే గెలుపు నల్లేరుపై నడకేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2015లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో సిరిసేన చేతిలో రాజపక్సే ఓటమి పాలయ్యారు.స్థానిక ఎన్నికల్లో తమ పార్టీకి ఘనవిజయం ఇచ్చిన ఓటర్లకు మహింద రాజపక్సే కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సంస్కరణలు తీసుకురావడానికి 2015లో కౌన్సిల్ ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసింది. మొత్తం 9 ప్రావిన్షియల్ కౌన్సిళ్లకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని చట్టసవరణకు అధికార మైత్రిపాల సిరిసేన ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈచర్యను వ్యతిరేకిస్తూ గత సెప్టెంబర్ నెలలో శ్రీలంక సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ప్రతిపాదిత చట్టసవరణకు మూడింట రెండు వంతుల పార్లమెంట్ మెజార్టీతో పాటు దేశవ్యాప్తంగా ప్రజాభిప్రాయసేకరణ చేపట్టాలని సూచించింది.

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో వడగండ్ల వాన

- ముగ్గురు మృతి; దెబ్బతిన్న పంటలు

ముంబై, ఫిబ్రవరి 11: మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లను వడగండ్ల వాన అతలాకుతలం చేసింది. ప్రధానంగా మహారాష్ట్రలోని మరట్వాడా, విదర్భలోని కొన్ని ప్రాంతాలపై విరుచుకుపడింది. దీంతో ముగ్గురు మృతిచెందగా, పంటలు దెబ్బతిన్నాయి. ఆదివారం ఉదయం 7.30 గంటలకు ప్రారంభమైన ఈ వాన దాదాపు 30 నిమిషాలపాటు కురిసింది. జల్నా జిల్లాలో రైతు నామ్‌దేవ్ షిండే(65), ఆసారాం జాగ్‌టాప్(60) మృతిచెందారని, వషీం జిల్లాలో మహిళ రైతు యమునాబి హంబద్(60) ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. జల్నా జిల్లాలోని 180 గ్రామాలు ఘోరంగా దెబ్బతిన్నాయని చెప్పారు. ద్రాక్ష, పత్తి, గోధుమ తదితర పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. బీడ్, ఉస్మానాబాద్, లాతూర్, నాందేడ్, పర్భని, హింగోలి, ధులే, నందూర్‌బర్, ఔరంగాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయని అధికారులు తెలిపారు. పంట, ఆస్తి నష్టం వివరాలను అంచనా వేస్తున్నామని, త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని వివరించారు. మధ్యప్రదేశ్ అధికారులు మాట్లాడుతూ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసిందని తెలిపారు.



మధ్యప్రదేశ్‌లోని భోపాల్ శివార్లలో వడగండ్ల వానకు నేలకొరిగిన గోధుమ పంట

సమోయన్ ద్వీపకల్పాన్ని అతలాకుతలం చేసిన తుఫాన్ గీతా

విల్లింగ్టన్/న్యూజిలాండ్: తుఫాన్ గీతా సమోయన్ ద్వీపకల్పాన్ని అతలాకుతలం చేసింది. ఈ ద్వీపకల్పంలో శనివారం తెల్లవారుజామున సంభవించిన తుఫాన్ కారణంగా భారీగా వరదలు వచ్చాయి. ఇండ్లు నీటిలో మునిగిపోయాయి. దీంతో అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆదివారం ఈ తుఫాన్ టోంగా దేశం వైపు మళ్లింది. బలమైన గాలులు వీస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం తుఫాన్ తీవ్రత అధికంగా ఉండే అవకాశముందని, గాలులు మరింత బలంగా వీయడంతో పాటు వర్షం కురువవచ్చని అధికారులు తెలిపారు.



అసోంలో రైలు ఢీ కొని
ఐదు ఏనుగులు మృతి

గువాహటి, ఫిబ్రవరి 11: అసోం రాష్ట్రం హోజాయి జిల్లా పరిధిలోని లుండింగ్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో శనివారం రైల్వే ట్రాక్ దాటుతున్న ఏనుగులను గువాహటి – సిల్చార్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొట్టింది. దీంతో ఐదు ఏనుగులు మృతి చెందాయని ఈశాన్య సరిహద్దు ప్రాంత రైల్వే సీపీఆర్వో ప్రణవ్ జోషి శర్మ ఆదివారం తెలిపారు. ప్రాథమిక విచారణ ప్రకారం నిర్దేశిత స్థాయిని మించిన వేగంతో రైలు ప్రయాణిస్తున్నదని తేలిందన్నారు. దీనిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించామని రైల్వేఅధికారి చెప్పారు. ఏనుగులను ఢీ కొట్టడంతో రైలు ఇంజిన్ మాత్రమే పట్టాలు తప్పిందన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతం ఏనుగుల కారిడార్‌గా నోటిఫై చేయలేదన్నారు. అయితే ఈ ప్రాంతంలో రైలు 30 కి.మీ వేగంతో మాత్రమే ప్రయాణించాలని అటవీశాఖ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు.

యూవీ కిరణాలతో గాలిలోని
వైరస్‌లను చంపొచ్చు

న్యూయార్క్, ఫిబ్రవరి 11: అతినీలలోహిత కిరణాలను తక్కువ తీవ్రతతో ఉపయోగించి మానవ శరీరంలోని ఫ్లూ వైరస్‌ను చంపొచ్చని అమెరికా పరిశోధకులు చెప్తున్నారు. ఈ విధానంలో మానవ కణజాలానికి ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. దీనిని దవఖానల్లో, బడులల్లో, బహిరంగ ప్రదేశాల్లో వినియోగించొచ్చని, తద్వారా గాలిలోని బ్యాక్టీరియాను, వైరస్‌ను నియంత్రించొచ్చన్నారు. ఫలితంగా ఒకరి నుంచి మరొకరికి ఇన్ఫెక్షన్లు సోకకుండా అడ్డుకోవచ్చని చెప్తున్నారు. డాక్టర్లు కొన్ని శస్త్రచికిత్సల సమయంలో బోర్డ్–స్పెక్ట్రమ్ అల్ట్రావాయిలెట్ సీ (యూవీసీ) కాంతిని వాడుతుంటారు. ఇది బ్యాక్టీరియా, వైరస్‌లను నాశనం చేయడంలో, డీఎన్ఏలోని మూలకాల మధ్య ఉన్న బంధాలను తెంచడంలో ఉపయోగపడుతుంది. అయితే దీనిని ఎక్కువగా వాడటం వల్ల చర్మక్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీ లెర్వింగ్ మెడికల్ సెంటర్ పరిశోధకులు యూవీసీ కన్నా తక్కువ సామర్థ్యం ఉన్న 'ఫార్–యూవీసీ' కాంతిపై పరిశోధనలు జరిపి విజయం సాధించారు. ఈ కాంతి మానవ చర్మంలోకి ఇంకదని, సున్నితంగా ఉండే కండ్ల పైపొరకు సైతం ఎలాంటి హాని చేయదని నిర్ధారించారు. ఈ కాంతిని ఒక ప్రాంతంలో ప్రసరింపజేయడం ద్వారా అక్కడున్న మనుషులకు ఎలాంటి హాని చేయదని, బ్యాక్టీరియా, వైరస్ వంటి సూక్ష్మజీవుల శరీరంలోకి చొచ్చుకెళ్లి వాటి డీఎన్ఏను నాశనం చేస్తాయని ప్రొఫెసర్ ఏ బెన్నర్ తెలిపారు.